
ఒంటిపోటు దొంగ

రహస్యదొంగ



సాంఘిక నవలలు   చరిత్రాత్మక నవ[illegible]

[illegible]	0-12-0	వనదుర్గము
[illegible]	0-12-0	తపోవనము
[illegible]	0-12-0	జయమాలిక పా 1
[illegible]	0-12-0	జయమాలిక పా II
[illegible]	0-12-0	రాణీషా
[illegible]	0-12-0	చిత్రరేఖ
[illegible]	0-12-0	[illegible]
[illegible]	0-12-0	మానసింగు
[illegible]	1-0-0	[illegible]
[illegible]	0-12-0	ఆంధ్రుల చరిత్ర 3 భాగం
[illegible]	1-0-0	[illegible] 5 భాగం
[illegible]	0-12-0	ఆంధ్రదేశపు చరిత్రము
[illegible]	1-0-0	ఆంగ్లరాజ్యస్థాపనము
[illegible]	1-8-0	[illegible]
[illegible]	0-12-0	[illegible]
[illegible]	0-8-0	[illegible]
[illegible]	0-8-0	[illegible]
[illegible]	0-12-0	[illegible]
[illegible]	0-12-0	[illegible]
[illegible]	0-12-0	[illegible]
[illegible]	0-12-0	[illegible] పా 1
[illegible]	0-8-0	[illegible]
[illegible]	0-8-0	[illegible]
[illegible]	1-8-0	[illegible] చరిత్ర
[illegible]	0-12-0	[illegible]

[illegible]:—కురుకూరి సుబ్బారావు అం[illegible]

[illegible]—సరస్వతీ బుక్ డిపో


బెజవాడ

బందిపోటు దొంగ

డిటెక్టివ్ నవల

గ్రంథకర్త:

కేతవరపు రామకృష్ణశాస్త్రిగారు



ప్రకటనకర్త:

కురుకూరి సుబ్బారావు,

ప్రొప్రయిటరు.

సరస్వతీ బుక్ డిపో

బెజవాడ, కృష్ణాజిల్లా,

మొదటి కూర్పు 1000

1937

[వెల 0—12—0

శ్రీరామ

బందిపోటుదొంగ

పూర్వరంగము

భయంకర చౌర్యము

శ్రీ మహారాష్ట్రదేశమున కలంకారమై స్వతంత్రరాజ్య సంస్థాపకుడని బిరుదుగాంచిన ఛత్రపతి శివాజీమహారాజుచే పాలింపబడి భారతవర్షమున నైతిహాసికస్థానమని ప్రసిద్ధిగాంచిన పునహానగరమును పాఠకు లెఱింగియే యుందురు. ఆ నగరమున గోపాలరావు-మధుసూదనరావు-అను పేర్లు గల యిర్వురు వర్తకులుగలరు. వ్యాపారస్థానమున నా ప్రదేశమందు వారిరువురినామములు సుప్రసిద్ధములు. వారిర్వురకును సంయుక్తకార్యస్థానముకలదు. వర్తకమునందుగూడ వారు కలసియే వ్యవహరించుచుండిరి. గోపాలరావు, మధుసూదనరావు, కంపెనీయన్న సాటిజాయంటుకంపెనీలకన్న గొప్పదని తలంచుచుండిరి.

గోపాలరావు వృద్ధుడు. అతనిభార్య చాలకాలము క్రిందనే మరణించెను. సంసారమందతని కీసమయమున నొకకుమారుడు నొకకుమార్తెయు గలరు. మధుసూదనరావు యువకుడు. గోపాలరావును తన జ్యేష్ఠసహోదరునివలె మన్నించుచుండును. గోపాలరావుకూడ మధుసూదనుని తమ్మునివలె ప్రేమించుచుండెను. ఇర్వురిమైత్రత దృఢమైనదని యందరును తలంచుచుందురు.

జ్యేష్ఠ మాసము. గ్రీష్మర్తువగుటచే సూర్య తాపమధికముగ నుండెను. గోపాలరావు కార్యస్థానమున గూర్చుండి కాతాలను తిరుగవేసుకొను చుండెను. ఇతర కర్మచారులందరును వారివారిస్థానములం గూర్చుండి పనిచేసికొను చుండిరి. ఇంతలో తంతివార్తాహరుడు వచ్చి గోపాలరావు చేతికొక తంతివార్తనిచ్చి వెడలిపోయెను. గోపాలరావు (టెలిగ్రాం) ఆ కవరునుచించి చదువుకొనెను.

సుమారు గంట కాలమునకు ప్రధాన కర్మచారి హెడ్గుమాస్తా వచ్చి గోపాలరావుతో నేదియో మాట్లాడదలంచెను. గదిలో ప్రవేశించుటయే తడవుగ నతని కంటికేమి కనబడెనో! శరీరము కొయ్యబారి పోయెను. నోటినుండి ఆహాం అను ఒక చీత్కార ధ్వని వెలువడెను.

గోపాలరావు కుర్చీలో కూర్చున్నవాడు కూర్చుండిన యట్లే ప్రాణములను వదలెను. అవయవములు కొయ్యబారెను. ముఖమున కాంతిలేదు. క్షణములో నీవార్త కార్యస్థాన మంతయు మారుమ్రోగెను. కర్మచారులందరు గోపాలరావు గదిలో మూగిరి. ఇద్దరు వెళ్లి డాక్టరును పిలుచుకొని వచ్చిరి. డాక్టరువచ్చి లక్షణములను బరిశీలించి యిట్లనియె. ఇతడు హృద్రోగమువలన మరణించినాడు. ఆకస్మికముగ మనస్సు చలించుటచే నిట్టి యవస్థ సంభవించినది. హృదయ విదారకమైన సంగతియేమైన జరిగెనా! అని యడిగెను. అందరు నొకరి మొగము నొకరు చూచుచు నూరకుండిరి గాని డాక్టరుగారి ప్రశ్నమున కొకరు సమాధానము చెప్పరైరి. గోపాలరావు చేతిలోనుండి క్రిందబడియున్న టెలిగ్రాం ఫారముపై డాక్టరుగారి దృష్టిపడెను. వెంటనే దానిని తీసి చదువగా నందిట్లున్నది.

బందిపోటు దొంగ

నర్మదారణ్యమును దాటుచుండగా బండిపై దొంగలుపడి దోచుకొనిరి. సర్వము శూన్యము. పైసయైనను లేదు. డాక్టరు హెడ్డుమాస్తానుజూచి తారఅనను వరు?అని అడిగెను. తారగోపాలరావు గారి కుమార్తెయని హెడ్డుమాస్టా బదులు చెప్పెను.

తారాబాయి ఇందూరువెళ్ళియున్నది. అచ్చటనున్న తారా బాయి తంతివార్త నెట్లిచ్చెనో ప్రస్తుతవిషయమందామె కెంతవరకు సంబంధమున్నదో యెవ్వరెరుంగరు.

మధుసూదనరావుకు శరీరము స్వస్థతగలేమిచే కొలదిదినముల నుండి ఆఫీసునకురాక ఇంటివద్దనేయుండెను. ఇంతలో నొక కర్మచారి వెళ్ళి మధుసూదనుని కీవార్త నెఱింగించెను. గోపాలరావుయొక్క మరణవార్తను వినుటయే తడవుగ బయలుదేరి కార్యస్థానము జేరెను. టెలిగ్రామును చదువుకొని కూలబడెను. నిట్టూర్పువిడిచెను. ఆకస్మికముగ నతనినోటినుండి యీ మాటలు వినపడెను. బండిలో డబ్బు వచ్చుచున్నది. సర్వము నాశనమైనది. ఇంకమీద వ్యాపా......ఇంక మాటరాలేదు. ప్రక్కనున్నవారందరీమాటనువిని ఒకరినొకరు చూచు కొన నారంభించిరి. గోపాలరావుయొక్క కుమారునకు కుమార్తెకు తంతి వార్తనుపంపబడెను. వారువచ్చినపిమ్మట గోపాలరావున కంత్యక్రియల జేయింప నిశ్చయించి వారిద్దరిరాక కెదురుచూచుచుండెను.

మరునాడు వార్తాపత్రికలో నీభయంకర చౌర్యమును గూర్చి యిట్లు ప్రకటింపబడెను.

పూర్వము నర్మదారణ్యములో ప్రయాణీకులు బండ్లపై వచ్చు చుండగ బందిపోటులు జరుగుచుండెడివి. కాని నాలుగైదేండ్లనుండి

యట్టి వార్తలు వినవచ్చుటలేదు. రెండు దినములక్రింద నొకబండి యామార్గమునవచ్చుచుండెను. దానిలో పూనాలోని సుప్రసిద్ధ వ్యాపారులగు గోపాలరావు మధుసూదనరావుగార్ల కంపెనీ తాలూకు ద్రవ్యము ఒకటిన్నరలక్షకుపైగా బండిలోనుండెను. బండివాడుగాక యిర్వురుసేవకులు వెనుకనడచుచుండిరి. ఆకస్మికముగ నొక బంది పోటుదొంగ నఖశిఖపర్యంతము నల్లని ముసుగువైచుకొని చేతులలో పిస్తోలు ఖడ్గము ధరించి బండి నడ్డగించెను. వెనుకవచ్చు సేవకు లెదుర్కొనిరి. గాని దొంగ, వారిని జంపి బండిలోని ద్రవ్యము నిశ్శేషముగా దోచుకొనిపోయెను. పోవునప్పుడు ఒక కాగితమును బండిలో వదలిపోయెను. దానిపై పెద్దఅక్షరములతో నిట్లువ్రాయబడి యుండెను. "కాలూరామ్". చదివిన వారెల్లరు ఆశ్చర్యపడుచుండిరి.

తారకు పదునాల్గువత్సరములు వయస్సు. కాని చూచిన వారామెకు పదునెన్మిదివత్సరములని నిర్ణయింతురు. బందెపోటు దొంగలవలన సర్వము కోల్పోబడుటయేగాక పునహాకువచ్చి తల్లి లేనిలోటు కానరాకుండ పెంచిన ప్రేమస్వరూపుడగు తండ్రి మరణము నకు దుఃఖించెను. చిన్నతనమున తల్లిమరణించినను సర్వము తానయై పోషించిన తండ్రియొక్క ఆకస్మికమరణమున కాబాల మిక్కిలి దుఃఖించెను. మధుసూదనరావామెను మాటిమాటికి నూరార్చి ధైర్య మును జెప్పుచుండెను. తార నోదార్చుచు మధుసూదను డిట్లనియె.

భయంకరవిపత్తు వాటిల్లినది. అర్థము- ప్రాణము రెండింటిని గోల్పోవుట సంభవించినది. చిన్నవయస్సున మీరిర్వురు నిరాధారులై నారు. దైవవైపరీత్యము. ఇంకమీద మీయిర్వురిసంగతి యేమాయని తలంచుచున్నాను. తలంపుగాదు. వ్యాకులము కలుగుచున్నది.

తార:—దైవలిఖిత మెట్లున్న నట్లగును.

మధు:—ఆ బండిలో లక్షఏబదివేల రూపాయ[illegible]లూరాయి సర్వశూన్యముగావించెను. ఇంక నీకార్యస్థానము రేపటినుండి ముగింపవలయును. వజ్రాఘాతమువలె నీవార్తనువిని మీతండ్రి గుండెలు చెదరి చనిపోయెను. అట్టి బంధువు నాకెట్లు లభించును?

తార:—మీ మాటలనుబట్టి మాకు మిగిలినదేమియు లేదని తేలినది. ఇంక మేమెవ్వరిపాలుగావలయును? నాసోదరుని గతియేమి? వానిచదువు సాగువిధానమెట్లు?

ఇంతలో సేవకుడువచ్చి చిన్నబాబుగారు వచ్చుచున్నారని చెప్పెను. మాటలోనే ఇరువదిసంవత్సరములు వయస్సుగల సుందర యువకుడు లోనికివచ్చి తారప్రక్కను నిలువబడెను. అతని ముఖము చిన్నపోయియుండెను. కన్నుల నీరుగారుచుండెను. ఈ యువకుడు గోపాలరావు కొమరుడును తారసోదరుడు నగు మల్హారరావు. కొంచెము కాలమునకు శోకావేశము కొంచెము తగ్గెను. మల్హారరావు సాహసించి మాట్లాడుట కారంభించెను. మధుసూదనబాబూ! వ్యాపారము ఎత్తివేయబడునని వింటిని నిజమేనా? సాగించుటకు వేరుమార్గము లేదా? మర్యాదదక్కువిధానము లేదా?

మధు:—మార్గమేదైన నున్న నేనిట్లు కూర్చుందునా? ఇందలి విషయము నీకు దెల్పుటావశ్యకము. మాకంపెనీకి సంబంధించిన శాఖయొకటి (Branch office) జయంతపురమునగలదు. దానికి మేనేజరు మదనజీ. దానిజవాబుదారియంతయు నతనిమీద నున్నది. అచ్చటివ్యాపారమున నధికముగ లాభించుచుండుటచే

ఉన్నదంతయు నాశాఖపై వెచ్చించితిమి. కొలదిదినములక్రింద లెక్కలుచూచుకొనగా పెట్టుబడిపెట్టిన నలుబదివేలుగాక పైన లక్షరూపాయలు లాభమువచ్చినది. మీ తండ్రిగారు నాతో యోజించి నిలువయున్న రొక్కమంతయు పూనాకుపంపమని మదనజీకి జాబువ్రాసినారు. ఈసమయమున నే మీసోదరియైన తార ఇందూరునుండి జయంతపురము వచ్చియున్నది. కారణ మేమనగా మదనుసితో గలసి పూనాకు రమ్మని టెలిగ్రాం ఇచ్చియుండుటచే సట్లొనర్చినది. జయంతపురమునుండి రైలు స్టేషనుకు రావలయునన్నచో కొంతదూరము ఎద్దులబండి మీదను-మరికొంతదూరము గుఱ్ఱపుబండిమీదను రావలయును. మార్గమంతయు దుర్గమము. అదియునుగాక క్రిందటిదినముననే మదనజీ జబ్బుపడి యుండుటచే తాను రాజాలక సొమ్మును పెట్టెలలో భద్రముచేసి బండిపై నెక్కించి వెంట తారను ఇర్వురుసేవకులనుబంపెను. జరిగినవిషయమిది.

మల్హారరావు కోపమునాపుకొనజాలక నిట్లనెను. కంపెనీ తాలూకు ఖజానాను పంపునపుడు శస్త్రధారులు వీరులైన భటులను బంపక నొకబాలికను ఇద్దరుసేవకులతోడిచ్చి ధనముతో బంపుట కతని బుద్ధిహీనత కారణమా! లేక చేయవలయుననియే చేసెనా?

మధు:—నిజమున కట్లుపంపుటచాలతప్పే. ఖజానాను సురక్షితము జేయక నొక బాలికపై వదలుట తప్పుకాదని యెవ్వరనగలరు?

మల్హా:—బుద్ధిహీనతచేగానిండు, లేక దుర్బుద్ధివలనగానిండు. ఎట్లైన నేమి మదనజీ చేసినపని చాలఅన్యాయము. ఇంతనష్టమునకు మామరవస్థకు గారకుడగునతనిని వదలరాదు.

మధు:—జరిగినవిషయమును గురించి ప్రశ్నింపగా నతడిట్లు వ్రాసెను: తానువచ్చుటకు వీలులేకపోవుటచే తారతోగూడ నొక జమాదారును సేవకుని తోడుగాపంపితిని. నర్మదారణ్యపర్వతప్రాంతమునకు వచ్చునప్పటికి నీలవస్త్రాచ్ఛాదితశరీరుడగు బందిపోటు దొంగవచ్చి జమాదారును పిస్తోలుతో కాల్చి యావత్తు ధనమును దొంగిలించెను. ఇది అతనిజవాబు.

మల్హా:—తారా! నీవాదొంగయొక్క స్వరూపమును తెలిసికొనగల్గితివా?

తార:—ఎట్లు తెలిసికొనగలను? శరీరమంతయు నల్లని ముసుగుతో కప్పబడినది. రెండు కన్నులు మాత్రము కన్పడుచున్నవి. ఖజానాపెట్టెను గొనిపోవుచు నాకాగితమును మాత్రము విడిచిపెట్టెను. చూడగా దానిపై కాలూరాయ్ అని వ్రాయబడియుండెను.

మధు:—అక్షరముల పోలికనుబట్టి విచారింపవచ్చును. గాని ఆలోచింపగా నదియు అనుమానమే. ఏమన ఇతరులచే వ్రాయింపవచ్చును. లేక ఎడమచేతితో వంకర టింకరగా వ్రాయవచ్చును.

మల్హా:—ఇదంతయు మదనుని చేసిన పనియని నాయనుమానము. దొంగవలెవచ్చి సర్వమును దొంగిలించెను. బందిపోటునికివచ్చినప్పుడు దొంగయొక్క గొంతుకను (కంఠస్వరమును) వింటివా?

తార:—లేదు. నోటినుండిమాటయే లేదు. మూగవానివలెవచ్చి తన పనిని పూర్తిగావించుకొనిపోయెను.

మల్హా:—సందేహములేదు. ఈపని చేసిన దతడే,

తార:—నేను జయంతపురము వచ్చినప్పటినుండియు నాతడు రోగ శయ్యను వదలగా చూడలేదు.

మల్హా:—అబద్ధము. కపటము. నటన. మిమ్ము నమ్మించుటకు రోగి వలె నటించెను. మీరు బయలుదేరిన తోడనే తాను మారు మారు వేషముతో మరియొక త్రోవనువచ్చి ఖజానాదొంగి లించెను.

మధు:—మన మొక గూఢచారిని బంపిగాని స్వయముగాగాని వెళ్లి విచారింతము. ఖజానా పంపించిన నాటిరాత్రి మదనజీ బైటకు పోయినట్లు ఋజువైనచో నతనిపై మనము క్రిమినలుగా చర్య జరుపవచ్చును.

మల్హా:—ఆవిషయమును తరువాత యోజింతము. మేమిద్దరమును యాచకులవలె దేశములపాలు కావలసియుండునా లేదాయని విచారింపవలసియున్నది.

మధు:—ఉన్నఆ స్తినంతయునమ్మి ఋణదాతలకుఇచ్చి వారి బాధల నుండి విముక్తులము గావలయును. తర్వాతమిగులునది మనది. నాఊహ ప్రకారము ఒక్కనాలుగు వేలరూపాయలు మాత్రము మిగల్చగలమని తోచుచున్నది. అందులో సగమువంతు మీది.

తార:—అన్నా ! ఆ రెండు వేలరూపాయలతో నీచదువు పూర్తి కావచ్చును అని నాఅభిప్రాయము.

మల్హారరావు కన్నీరువిడుచుచు నిట్లనెను. తారా! నాచదువు నకు స్వస్తిచెప్పితిని. ఇంకమీద నేనేమిచేయుదునో చెప్పజాలను. నాన్నగారి అంత్యక్రియలు పూర్తికావలయును. తదుపరి జయంతపురికి

వెళ్లి మదనజీనికలిసి మాట్లాడవలయును. అప్పుడు కర్తవ్యనిర్ధారణము చేసెదను.

*　　*　　*

గోపాలరావు అంత్యక్రియలు పూర్తియైనవి. గోపాలరావు మధుసూదనరావుగార్ల కంపెనీ మూయబడెను. మదనజీచికిత్సకై పునహావచ్చెను. విచారింపగా నతనిజబ్బుమాట నిజమనియును నర్మదారణ్యములో జరిగిన బందెపోటుతో నతని కెట్టిసంబంధము లేదనియు తెలిసినది.

కాలూరాయ్ అను పేరుగల బందెపోటుదొంగను పట్టుకొనుటకై గవర్నమెంటువారు నేర్పరులైన పరిశోధకులను నియమించిరి గాని ఎంత ప్రయత్నించినను కాలూరాయి దొరకకపోవుటచే ప్రాణమువిసిగి ఆప్రయత్నమునుండి విరమించుకొనిరి.

మల్హారరావుకూడ నీవిషయమునుగూర్చి విచారింపగా నతనికి తెలిసిన సారాంశమేమనగా మదనజీపై పరిశోకధశాఖవారికి మంచి అభిప్రాయములేదు. ఇతడు కాలూరాయి కాకున్నను అతని పరిచరులతోగాని లేక వానిదొంగతనముతోగాని సంబంధమున్నదనుట నిశ్చయము కాని తగిన నిదర్శనము దొరకకపోవుటచే వారేమియు చేయజాలకపోయిరి.

ఏదుర్మార్గునివలన తన యైశ్వర్యముపోవుటయేగాక తన తండ్రి మరణమునకు గారకుడయ్యెనో అట్టి దుర్మార్గుని కాలూరాయిని జన్మమధ్యమున బంధించి తీరెదను. అని మల్హారరావు గట్టిప్రతిజ్ఞజేసెను. మరునాడే తనకార్యసిద్ధికై యతడు గవర్నమెంటువారి పరిశోధకశాఖలో **(C. I. Department)** జేరెను.

1 వ ప్రకరణము

—: గూఢశత్రువు :—

శివనివాస మొకపల్లెటూరు. పర్వతప్రదేశమందలి గ్రామము. కాని వ్యాపారస్థుల గృహము లాయూర పెక్కు గలవు. తత్కారణమున వెనుకటికంటె యిప్పుడాయూరు చాల అభివృద్ధిలోనున్నది. ప్రాంతమందలి పర్వతపంక్తి ననుసరించి కొండనది యొకటి ప్రవహించుచుండెను. మొత్తముమీద నా ప్రదేశమంతయు మనోహరమై సృష్టి వైచిత్ర్యమునకు స్థానము.

వేసవికాలము. రాత్రివేళ. నలుదిశల బంధుర తమోమయమై యుండెను. గ్రామమునకు సమీపమునగల కొండ్రశాటననుసరించి చిన్నయరణ్యభాగము కలదు. ముగ్గురుమనుష్యు లచ్చోటగూర్చుండి గంజాయిని సేవించుచుండిరి. మాటిమాటికి బాట వైపునకు జూచుచుండిరి. కొంచెముకాలము గడచినది. ముగ్గురిలో నొకడు తక్కిన వారితో నిట్లనియె. "ఇంక నెంతయాలస్యమున్నదో ! కూర్చున్న కొలది నడుమునొప్పి యధికమగుచున్నది."

ద్వితీ:—ఎంతయో ఆలస్యముండదు. పక్షి శీఘ్రమే వలలోపడగలదు. శంభూ ! నీముఖమట్లు శుష్కించియున్న దేమి ? భయపడుచుంటివా ?

శంభు నవయువకుడు. ముఖమునుత్రిప్పి యిట్లనియె. నేనట్లు భయపడు స్వభావముకలవాడనుగాను. మదనా ! నాసంగతి నెఱుంగక నట్లడిగెద వేల ?

మదన:—మల్హారరావు నీయందు సద్భావముతోనుండెనని మాత్రము

దలంపకుము. ఎంతమాత్రము నీయందు మంచిఅభిప్రాయ మత
నికి లేదు.

శంభు:—లేకపోనిమ్ము. ఇంతవరకు నాకు మల్హారరావెట్టియుపకారము సల్పియుండలేదు. నీపట్టుదలవలన నేనీకార్యమున బ్రవేశించితిని. కాని నీకాతనియం దంతవిరోధమేల? అతడు నిన్ను బంధింప నెంచుటయు నీవాతని చేతులకు జిక్కక వానిని జంపనెంచుటకు గల కారణమేమి?

మద:—ఏమియును లేదు. నెనుకటికారణమే · బందెపోటుదొంగయైన కాలూరాయి వారి లక్షఏబది వేలరూపాయలు గొంగిలించుటచే అతడు సి. ఐ. డి. పోలీసులద్వారా వెదకించుచున్న సంగతి నీ వెఱింగిన దేగదా! ఇప్పుడాతడు నన్నే కాలురాయిగ భావించి బంధింప నన్ను వెన్నాడుచున్నాడు.

శంభు:—ఇంతమందియుండ నీ మీాదనే అనుమానపడు టేల?

మద:—నేనాసమయమున జయంతపురము బ్రాంచికి మేనేజరుగా పని చేయుచుంటిని. తారాబాయిద్వారా ద్రవ్యముపంపినది నేనే. డబ్బుపంపిన నాకును తారాబాయికినిగాక నితరులకీసంగతి తెలియదు. ఆకస్మికముగ ధనము త్రోవలో దొంగలపాలైనది. ఇందువలన నేనే కాలురాయినై వచ్చి ద్రవ్యము నపహరించితి నని యతని తలంపు.

శంభు:—అట్లయిన నతని యనుమానమునకు కారణము లేకపోలేదు.

మధ:—శంభూ! జాగ్రత్తగా మాట్లాడుము. మిత్రుడవని సహించితిని. ఇంకొకరైనచో నా కటారికి బలియైయుందురు. అని చెప్పి కటారితీసి చూపెను.

శంభు:—పరిహాసమునకే కోపమా! శాంతింపుము. నేనొకటి చెప్పెదను. దానికంగీకరింతువా?

మద:—అదేమి? నిస్సంశయముగ వచింపుము.

శంభు:—మల్హారరావును చంపదలంచితివా?

మద:—ప్రతిజ్ఞాపూర్వకంబుగవచించుచుంటిని. నేనతనిని చంపదలంచుకొనలేను. కొంతకాలమువరకు రహస్యముగ దాచనెంచితిని అట్లుచేయకున్న నతనివలన మనకు కొన్నిగొప్పసంకటములు కలుగవచ్చును.

మాడవవానింజూచి శంభు ఇట్లనియె.

శంభు:—గోవర్ధనా! నీవింతుల కంగికరించితివా?

గోవ:—నాకు మల్హారరావుతో నెట్టి శతృత్వమునులేదు. కేవలము మదనజీకి సాయపడుటకే వచ్చితిని.

మద:—మిత్రులారా! నాకిప్పుడు సాయపడినచో మీయుపకారమునకు ప్రత్యుపకారము చేసెదను. మల్హారరావీసమయమున పరిశోధక విభాగములో సమర్థకెక్కి యున్నాడు. అతని కొకమారు బుద్ధిచెప్పనియెడల భవిష్యత్తులో నతనివలన మనకు ముప్పుతప్పదు. కావున సంసిద్ధులై యుండుడు. అదుగో కాలి అడుగుల చప్పుడు వినవచ్చుచున్నది. నిశ్శబ్దముగ నుండుడు.

ముగ్గురు నిశ్శబ్దముగ నిల్చుండి తరుణమునకై నిరీక్షించుచుండిరి. ఒకపురుషుడు బాటవెంబడి శివనివాసగ్రామమునకు వచ్చుచుండెను. అతని హృదయమున నెట్టిశంకలునులేవు. గాన నిర్భయముగ నెట్టి యనుమానమును బెట్టుకొనక నడచివచ్చుచుండెను. బాటప్రక్కనున్న

పోదదగ్గరకువచ్చుటయే తడవుగ పొంచియున్న ముప్పురాకస్మికముగ పైబడిరి. పడుటయేగాక వెంటనే బట్టతో నతనిముఖమును కప్పివేసి బంధింపదలంచిరి.

ఏడుసంవత్సరములనుండి మల్హారరావు పరిశోధకశాఖలో పని జేయుచుండెను. ఈ యేడుసంవత్సరముల కాలములో నతడు పరిశోధకులకు క్షణక్షణమాపదలే సంభవించునుగావున నాకస్మికముగ విపత్తు సంభవించినప్పుడు ప్రాణముల నెట్లుకాపాడుకొనవలయునో యావిధమును నేర్చియుండెను. ముగ్గురుమీదబడినవెంటనే మల్హారరావు తన యెదుటనున్నవానిపై పదాఘాతమును బలముకొలదిగ ప్రసాదించెను. దానితో వాడు రెండుగజములదూరమునబడెను.

రెండవవాడు కేకవైచి ఆ ప్రయత్నమువలన లాభములేదు కత్తితో పొడువుమని చెప్పెను. పడినవాడు తటాలునలేచి బాకుతో పొడువవచ్చుచుండెను. మల్హారరావు రెండవవాని కేకను వినుటయే తడవుగ ప్రక్కనున్న మూడవవానిపైబడి వానిని తనకడ్డముగా నిల్పుకొనెను. పడినవాడు బాకును సూటిజూచి మల్హారరావుపై వదలెను. గాని యాదెబ్బ మల్హారరావుచమత్కారమువలన నతనికి దగులక అడ్డుగనున్న మూడవవానికి దగిలెను. వాడు కెవ్వుమనియార్చి క్రిందబడెను. రెండవవాడు ఖడ్గహస్తుడై కలియబడ వానికృపాణహస్తమును మనికట్టుదగ్గరబిగించిపట్టి మెలివేయ వానిచేతికత్తి క్రిందబడెను. వెంటనే తనసత్తువనంతయు వినియోగించి రెండవవానిని మొదట తనచే తన్నుబడిని బాకువిసిరినవానిపై నొక్కవిసురున త్రోసివేయ నావిసురున కిర్వురును పడిరి. వెంటనే వింటసంధించి వదలినబాణమువలె మల్హారరావాప్రదేశమునువిడిచి పరువెత్త నారంభించెను.

ఘాతకులు ముగ్వురును విధిలేక మల్హారరావు పరువెత్తిన వైపుకు పిస్తోళ్లు కాల్చనారంభించిరి. ముందుపరువెత్తుచున్న మల్హారరావునకు కుడివైపునుండి గుండ్లుపోవుచుండెను. చీకటియగుటచే ఘాతకులకు గురితప్పుచుండెను. ఆకస్మికముగ నొక్కగుండుచెదరి యతని చెవి ప్రక్కనుండి దూసుకొనిపోయెను. దెబ్బ అపాయకరముకాకపోయినను బాధపెట్టుచుండెను. వెనుక శత్రువులు తరుముకొని వచ్చుచుండుటచే బాధను సహించుకొని పరువెత్తుచుండెను. కాని తలదిమ్ము అధికమగుటచే నిలువజాలకపోయెను. అతడు పరువెత్తు బాటప్రక్క నొక కొండయు దానినంటి యొకగోయియు కలదు. మల్హారరావాచీకటిలో నెటదాగుటకును చోటుదొరకకపోవుటచే నాగోతిలో దిగెను. ఆ గోతిలో నొకచెట్టు తీగలచే చుట్టబడి యుండెను. గోతిలోనికి జారుచున్న మల్హారరావుచేతి కాచెట్టుకొమ్మ చిక్కెను. తటాలున దానిని బట్టుకొని కొమ్మలమధ్య నిశ్శబ్దముగ గూర్చుండెను. తలబాధను బలవంతముగ సహించుకొనుచుండెను. మూలిగిన శత్రువులువిని చుట్టుముట్టెదరని భయము.

వెన్నాడుచున్న ఘాతకులు ముగ్వురు క్రమముగా నాప్రదేశమున కరుదెంచిరి. వారికి విరోధి కానరాలేదు. ఎచ్చట మాయమైపోయెనాయని విస్మయపడిరి.

శంభూ:—మదనజీ ! నీపిస్తోలుసూటి తప్పలేదు. తగిలియుండునని తలంచెదను.

మద:—అట్లయిన శరీరము కనుపడవలయునుగదా !

గోవ:—అబ్బా ! విపరీతమైన బాధగా నున్నది. కత్తిపోటు సహింపజాలకున్నాను. ఆదుర్మార్గుడు కంటబడవలయునుగాని నాశనము జేయక వదలుదునా ?

మద:—నోరుమూయుగు. పేర్లు పెట్టి పిలువరాదు. వాడీప్రాంతములలో దాగియుండును. తలకొకవైపున వెదకుడు. ఈరాత్రి పట్టితీర వలయును. లేకున్న మనకపాయము తప్పదు. వాడు సామాన్యుడు కాడు.

ఘాతుకత్రయము మల్హారరావునకు సుమారు ఏబదియడుగుల దూరములో నుండెను. అతనికి భయము మెండయ్యెను. తన్నెక్కడ పట్టుకొందురో యను శంకబలమయ్యెను. ఎందులకైన మంచిదని యతడు తన జేబులోని పిస్తోలును కుడిచేతిలోనికి దెచ్చుకొని యెవడైన సమీపించినచో కాల్చుటకు సిద్ధముగనుండెను. దైవవశమున వారిలో నొకనిదృష్టియైనను మల్హారరావుకూర్చున్న గోతివైపునకు ప్రసరింపలేదు. మల్హారరావు దూరమాలోచించి ఆయుధప్రయోగమువలన కార్యభంగమును శంకించి పిస్తోలును జేబులోనుంచుకొనెను. ఘాతుకత్రయము ప్రాంతమునగలప్రదేశములన్ని వెదకివెదకి విసిగి నిరాశావశులై తిరిగిపోయిరి. మల్హారరావునకు శిరోబాధ విపరీతమయ్యెను. సహింపజాలకపోయెను. చేతులు పట్లుతప్పుటచే క్రిందకుజారి ఆగోతిలో చెట్టుమొదట పడిపోయెను. క్రమక్రమముగా నతని చైతన్యశక్తి తగ్గుచుండెను.



2వ ప్రకరణము

ఈ యువతి యెవరు?

క్రమక్రమముగ మల్హారరావునకు చైతన్యముకలిగెను. మూర్ఛ తొలగిపోయెను. మెల్లగ కన్నులువిచ్చిచూచెను. అదియొక మనుష్య నివాసస్థానముగా కన్పడెను. తలవైపున నెవరో మానవవ్యక్తి తన కోమలకరపల్లవములచే శిరమునుపట్టుచుండెను. అతనికి వెనుకటి సంగతియంతయు జ్ఞప్తికివచ్చెను. ఆ పర్వతశిగర్తము వృక్షశాఖలు ఏమైనవి? నేనిచ్చటికెట్లువచ్చితిని? ఇదికలయా నిక్కువమాయని తల పోయుచు తలయెత్తిచూడ నొక యనింద్యసుందరి తలవైపునకూర్చుండి సేవ చేయుటను తెలిసికొనెను.

ఆమె కిశోరావస్థయందుండుటచే కన్యకయనితోచును. ఆమె శరీరమున నలంకారములుగాని వేషవిన్యాసముగాని లేకున్నను నైసర్గిక సృష్టి సౌందర్య విలాసభాసురమైన వనలతవలె ప్రేక్షకుల హృదయము నాకర్షింపగల సౌందర్యవతియై యుండెను. ప్రత్యవయవమును బలము కలిగి తీర్చినట్లుండెను. మల్హారరావు కనులువిప్పిచూచుట గనిపెట్టి యాసుందరి యతనింజూచి బాధయెట్లున్నదని యడిగెను.

సుందరి ఉపయోగించిన మూలికాప్రభావమువలన అతనిరక్త స్రావమంతయుకట్టెను. గాయమునకు కట్టుగట్టెను. అందువలనధారాళ ముగా నిట్లు జవాబుచెప్పెను.

నాకిప్పుడేమియు బాధ లేదు. చాలవిశ్రాంతిగానున్నది. నే నిచ్చటికెట్లువచ్చితిని?

సుంద:— ప్రాంతమందలి పర్వతగర్తములో శరీర స్మారకము తెలియక పడియుండ తీసుకొని వచ్చితిని.

మల్హా:— నీవొక్కతెవే తీసుకొని రాగల్గితివా?

సుంద—(సిగ్గుతో క్రిందచూచుచు) ఔను. లోపలికిగల మెట్ల సాయమున తీసుకొని వచ్చితిని.

పర్ణకుటీరనివాసియైన యాకన్యక తనవంటి సంపూర్ణ యువకని దృఢశరీరుని యింతదూర మొంటిగ గొనివచ్చినదన్న మల్హారరావున కాశ్చర్యము కలిగెను.

మల్హా—నీ వెవరవు? ఈ కుటీర మెవ్వరిది?

యువ:—ఈ కుటీరము గోవర్ధన సింహునిది. నే నాతని కుమార్తెను. నా పేరు పులింద.

మల్హా:—పులిందా! నీ దయవలన జీవించితిని. ఇందులకు నేను జీవించియున్నంతకాలము కృతజ్ఞుడను. పులింద ప్రసన్నవదనయై సిగ్గుతో తలవంచుకొనెను.

పులిం:—చీకటిలో కాలుజారుటచే పడియుందురని తలంచితిని.

మల్హా:—ఔను. నీయూహసరియే.

పులిం:—గాయమును చూడగా జారిపడుటవలన తగిలినదని కాదని—

మల్హా:—(అర్ధోక్తిలో) నీయనుమానము నిజమే. చీకటిలో కొంతమంది ఘాతకులు నాపై బడిరి. వారిలో నొకడు పిస్తోలును గాల్చెను. నాగాయమునకా పిస్తోలే కారణము. ఈగల్లంతులో పరుగెత్తుచు నందుపడితిని. గాని పడుటయో మేలయ్యె. ఏమనగా! ఆఘాతకులచేతికి జిక్కకుండుటయు స్వభావ సుందరివైన

నీవంటి వనదేవత అనుగ్రహమునకు బాత్రుడనగుటయు సంభ
వించినది.

పులిం:—ఆఘాతకులెవరో మీరు గుర్తింప గల్గితిరా?

మల్హా.—అంధకారము - ఆకస్మికాక్రమణము - అంగువలన నేనెవరిని
గుర్తింపజాలక పోయితిని. కాని వారిలో నొకని చేతిపై బల
మైన కత్తిపోటు తగిలినది. రేపు శివ నివాసమంతయు వెదకి
చేతిపైగాయము గలవాడెవ్వరో వెదకి కనిపెట్టవలయును.
నాపై బడిన ఘాతకులు ముగ్గురిలో వాడొకడు.

పులిందయొక్క ముఖము సంకుచితమయ్యెను. భావముమారెను.
పరేంగితజ్ఞుడగు మల్హారరావది గమనించెను. కారణ మరయజాలక
పోయెను. పులింద ఏదియో చెప్పవచ్చెను. ఇంతలో బయట అడుగుల
చప్పుడు వినవచ్చెను. పులింద సంకిత చిత్తయై యిట్లనియె. మీరా
ప్రక్క గదిలోనికి పొండు. ఎవ్వరో వచ్చుచున్నట్లున్నది. మిమ్ము జూచి
నచో ప్రమాదము సంభవించును. శివ నివాసమునకు కొంచెము దూర
ములో కొండ ప్రక్కను గోవర్ధనుడు కుటీరమును నిర్మించు కొనెను.
పులింద యతని కూతురని పాఠకులు చదివియే యున్నారు. ఆ కుటీర
ములో మధ్యభాగముగాక రెండుగదులున్నవి. ఒకటి భుజించునది.
రెండవది సామాను పెట్టుకొనునది. ఇదిగాక మధ్యశాలు. దానికెదు
రుగ వీధిగుమ్మము.

అడుగుల చప్పుడు సమీపించెను. పులిందకు భయమధిక
మయ్యెను. వెంటనే మల్హారరావును సామాను గదిలోనికిబంపె తలుపు
వేసెను. మల్హారరావాగదిలో మెల్లగ కూర్చుండి తలుపు కంతలో
నుండి వచ్చువాడెవరోయని చూచుచుండెను. ఆకస్మికముగ వీధి

తెలువు తెరువబడెను. ఏబది సంవత్సరములు వయస్సుగల పురుషుడు లోన బ్రవేశించెను. నల్లని కఠినమగు శరీరము, వికటమై భయము గొల్పు ముఖము, ఎఱ్ఱని కండ్లు, సగము నెరసిన తల వెంట్రుకలు, ఇది వాని యాకారము. చేత పిట్టలనుగొట్టు రెండుగుళ్లబారు తుపాకీ గలదు. తుపాకిని గోడకానించి యాక్షేపణములతో పులిందను జూచి ...ఏమి చూచుచుంటివి? అని కేక వేసెను.

పులింద:—ఏమియును లేదు.

ఆగం:—ఆడపిల్లల నైఖరీయంతయు కోతులజాతి వంటిది. చూచుచు నిల్చుండుట వేమి. ఒక పెద్ద గుడ్డపీలికను తీసుకొని రమ్ము.

ఆగంతకుడు మల్హారరావున కపరిచితుడు. పులిందతో సల్పిన కఠినవ్యవహారమున కతనికి కోపమువచ్చెను. వీనికి గుడ్డపీలికతో నవసర మేమూ! యని యోచించెను. ఆకస్మికముగ నెడమచేతిపై దృష్టి పడెను. చేయి నెత్తుటిలో తడిసియుండెను. రాత్రి తనపై లంఘించిన దుర్మార్గులలో వీడొకడై యుండునని తలంచెను.

తండ్రికి గుడ్డపీలికతో నవసరమేమాయని పులింద తలంచుచుండెను. ఇంతలో నారాక్షసుని కేక వినపడెను. మొద్దువలె నిల్చుందు వేల? గుడ్డపీలిక తెచ్చెదవా లేదా! పులింద యీమారు మాట్లాడ సాహసించెను.

పులిం:—బాబా! నీ బట్టలపై నెత్తురు కారుచున్న దేమి?

వానికి కోపమధికమయ్యెను. పండ్లుకొరుకుచు

ఆగం:—ఏమో! నీ శ్రాద్ధము. నీకీప్రశ్నతో సంబంధమేమి? చెప్పినపని చేయక కాలయాపనము చేసెద వేమి?

పులిందకు గుండెలు కొట్టుకొనుచుండెను. కన్నీరు తుడుచుకొనుచుండెను. సందిగ్ధావస్థకు చిక్కినది. పాతగుడ్డలు సామాను గదిలో నున్నవి. దానిలో మల్హారరావుండెను. తలుపుదీయ వీలులేక ఇటు నటు జూచుచుండెను. ఆగంతకుడు గోవర్ధనుడనియు పులిందకు తండ్రి యనియు పాఠకులు గ్రహించియే యుందురు.

పులింద యాలస్యమునకు గోవర్ధనునకు కోప మెక్కువయ్యెను. పండ్లు కొఱకుచు పులిందను గని కండ్లు పోయినవా? గుడ్డపీలికకై రెండు నెలలు కాలయాపననా! ఇక్కడ లేకపోయిన సామానుగది లోనికి పోయి తీసికొని రాకూడదా! అక్కరలేదు. కూర్చుండుము. నేనేపోయి తెచ్చుకొనెదను.

తటాలున లేచి పులింద నొకతన్నుతో నావలకుద్రోసి సామాను గదివైపునకు నడచెను.

తలుపుదీసి లోనికిబోవ ప్రయత్నించుచుండెను. పులిందకు గుండెలు దడదడ కొట్టుకొనుచుండెను. శరీరమంతయు నడకుచుండెను. ఎట్టి ఘోరకృత్యము జరుగునో యని భయపడుచుండెను. పాపమా నిర్దోషియొక్క రక్తమును తనతండ్రి కన్నులజూడక వదల డని నిశ్చయించెను. ఆమెకు తల దిరుగుచుండెను. కాని కదలలేదు. ప్రక్కగ నిలువబడి యున్నది. అట్టి విషమపరిస్థితి యందామె యేమి చేయగలదు? రానున్న భయంకర పరిణామమున కెదురుచూచుచుండెను.

3 వ ప్రకరణము

—॥ సరసము ॥—

మల్హారరావు తలుపు సందునుండి సర్వము గమనించుచుండెను. తానున్న విషమ పరిస్థితిని తెలుసుకొనెను. మరియొకడైనచో నాసమయమున భయకంపితుడై విషమ సంకటమునకు చిక్కగలడు. కాని మల్హారరావట్టివాడు కాడు. పులిందనియొక్క భయమును గమనించి జేబులో నున్న రుమాలును తీసి చేతపట్టుకొని తలుపులను తీసి గోవర్ధనున కెదురువచ్చి యిట్లనియె. "మహాశయా! గైకొనుము. ఈ గుడ్డతో కట్టుగట్టుడు."

గోవర్ధనుడు భీతవిస్మిత హృదయుడై నాలుగడుగులు వెనుకకు వైచెను. వాని హృదయ సంచలనమును గ్రహించి మరల నిట్లనెను. "రండు, చేతికి కట్టు కట్టెదను. గాయములకు పట్టీవేయుటలో నాకు నేర్పు కలదు."

గోవర్ధనున కీమారు మాట్లాడుటకు ధైర్యము వచ్చెను. సాహసించి యిట్లనియె. "చోరుడా! హంతకుడా! నీవెవ్వడవు చెప్పుము. సత్వరముగ చెప్పుము."

మల్హా:—నేనెవడనో చెప్పిన మీరు గుర్తింపగలరా? నా పేరు మదనజీ! తెలిసినదా! తొందరపడకుడు. గాయమునకు కట్టుగట్టిన పిదప నేనెవ్వడనో, ఎట్లు వచ్చితినో సావధానముగా తెలియజేసెద.

గోవ:—నీమర్యాదతో నాకేమియు నవసరము లేదు. నిసక్క విషయ

ములను విని మోసపోవునంత బుద్ధిహీనుడనుగాను. నీవు కేవలము సరళస్వభావయగు నాకన్యను ప్రేమించితివి. నేను లేనప్పుడు మీరిద్దరు భోగ విలాసములతో మునింగి తేలుచుంటిరి. నేడిక పట్టు బడితివి. నీవు చేసినపనికి ప్రతిఫలము నిచ్చెదను. కాచుకొనుము.

మల్హా:—పొరపాటు నీయుద్దేశ్యము కేవలము సత్యదూరము. నేను పరదేశిని. త్రోవను పోవుచుండ నీకుటీరము కన్పించినది. ఎవ్వరుండిరాయని చూడవచ్చితిని. లోనికిరాగ నెవరును కాన్పింపలేదు. ఇంతలో నీకుమార్తె యెచ్చటినుండియో ద్వారము దగ్గరకు వచ్చినది. నన్నుజూచి దొంగయని కేకలువేసినచో నలువురువచ్చి నిష్కారణముగ నన్నుశంకింతురను భయముతో నేనీ గదిలోనుండి తలుపులువేసుకొంటిని. సమయముజూచి తప్పించుకొన దలచితిని. గాని వీలుచిక్కినది కాదు. అంతియే కాని నేను దొంగను కాను. ఇంతగోల. నీయింటగలవస్తువులను జూచుకొనుము. ఉన్నవో లేవో తెలియును.

గోవర్ధనుడు ఇంటిని నలుదిశలపార జూచెను. ఎచ్చటివన్నవట్లే యున్నవి. అతనుచెప్పినది నిశ్చయమే. కాని గుడ్డను తెచ్చుటకు పులిందకేల సంశయముకలిగినది? అంత మాలస్యమేల చేసెనాయని యనుమానము కలిగినది. వెంటనే కూమార్తెను జూచి

గోవ:—నీవేమి చెప్పుదావు?

పులిందకు మల్హారరావు చెప్పినదానిని సమర్థించుటయే కర్తవ్యము. లేకున్న యదార్థము బయల్పడిన హత్యజరుగునని భయము. అందు వలన నిట్లనియె.

చల్లగాలికై బయటికి వెళ్ళితిని. కొంచెము సేపటిలో తిరిగి వచ్చితిని. ఇంటిలో నెవ్వరిని చూడలేదు. ఇతడెప్పుడు గదిలో ప్రవేశించెనో నాకు తెలియదు. ఇతడు చెప్పినది నిజమేనని నాయభిప్రాయము.

గోవర్ధను డెంత గా కసుడై నను పులింద మాటలను విశ్వసించుచుండును. ఆమె అసత్యమాడదని వాని విశ్వాసము. కాని తాను వచ్చినపుడామె తెల్లబోయి నిల్చుండుటయు, ప్రక్కకు గుడ్డ నమ్మనిన నాలసించుటకు కారణమేమాయని మంత్రము వానికి సంశయము పీడించుచునే యుండెను. కొంచెము కాలము విచారించిన* పిదప పులింద చెప్పినది నిజమని నమ్మెను. తనచేతి గాయమును జూచి యట్లుండెనని తలంచెను. ఆయువకుడు పరదేశి. అపరిచితుడు. కావున వాని మాటలు నమ్మవలయునా లేదాయని ఆలోచించుచుండ మల్హారరావు వానియోచనల కడ్డువచ్చి యిట్లనియె. ఇంకనైన గాయమునకు కట్టు కట్ట వచ్చునా!

గోవర్ధనుని కోపమంతయు శాంతించుటచే కట్టుకట్టుటకై చేయి చాపి ప్రక్కనున్న బల్లపై కూర్చుండెను పులింద దీపమును పట్టుకొని నిల్చుండెను. మల్హారరావు చేతిపై నున్న వస్త్రమును తొలగించి గాయమును చూచెను గాయము సాంఘాతికము గాని మరియొకటి గాదు. కత్తి గురితప్పి చేతిమీద బడుటచే గాయమైనట్లు స్పష్టమైనది. మల్హారరావు గాయమును కడిగి కట్టుకట్టుచు తనమనస్సులో వీని నిప్పుడు బంధింపవలయునా లేదా యని తలంచెను. కాని కొన్ని కారణములవలన వదలుటయే యుక్తమని తలపోసెను.

పూర్తియైన పిదప గోవర్ధనుడు మల్హారరావును బల్లపై కూర్చుండ బెట్టి పులిందను ఆహార వస్తువులు తెమ్మని పంపెను పులింద

పండ్లు మిఠాయిదినుసులు కొన్నింటిని పళ్లెరములో తెచ్చి యెదుట నుంచెను. మృదుస్వరముతో మల్హారరావును భుజింపుమని చెప్పెను. అతడు సందనెను. కాని పులింద మాటిమాటికి బలవంతము చేయుటచే నెుద కంగీకరించెను. ఇర్వురు కలసి ఫలహారము చేయుచుండ గోవర్ధను డిట్లనియె.

గోవ:—నీవు మాయింటికి వచ్చిన విధానముంగూర్చి నాయను మాన మింకను తీరలేదు.

మల్హా:—అంత యనుమానించవలసిన యవసరములేదు.

గోవ:—నేను నీమాటలను నమ్మక నిన్ను గౌరవింపక తుపాకితో కాల్చియుండిన నీవేమిచేసి యుందువు?

మల్హా:—ఏమిచేయ గలను? ప్రాణముల గోల్పోయెదను.

గోవ:—(గంభీరముగా) నీవు నామాటలను పరిహాసముగ దలంచు చుంటివా?

మల్హారరావు గోవర్ధనుని ముఖభావమును గ్రహించి యిట్లనియె. లేదు. నినుబోలు ధర్మాత్ము లెన్నడు నసత్యమాడరు. నాకట్టి యనుమానము లేదు.

గోవర్ధనుడు తటాలునలేచి గోడప్రక్కనానించిన తుపాకిని దీసుకొని మల్హారరావునకు సూటిగ గురిచేసి యిట్లనియె. నిర్భాగ్యుడా! నీచమత్కారము నాదగ్గిర సాగదు. అసత్యమాడుట నాస్వభావమునకు విరుద్ధము. నేను పేదవాడను. నాకిప్పుడు డబ్బుతోనవసరము కలిగినది. నూరురూపాయల నక్కడ పెట్టితివేని సురక్షితముగ పోగలవు. అట్లీయ వేని తుపాకిగుండు నీప్రాణములదీయగలదు.

గోవర్ధనుని ప్రయత్నమునుజూచి పులింద నోటినుండి యొక అస్ఫుట— ఆర్తనాదము— బయలుదేరెను. కాని గోవర్ధన మల్హారులలో

నొకరైన నాయార్తనాదమును వినలేను. మల్హారరావు శాంతభావముతో నిట్లనియె. బంధువరా! నేనింతవరకు కూర్చుండి కష్టపడి నీ గాయమునకు కట్టుగట్టగా నీవుచూపించవలసిన కృతజ్ఞత యిట్టిదా? నాయుపకారమునకు బదులు నాప్రాణములదీయదలంచితివే! మంచి బహుమానమే! లేదా ఒకవేళ పరదేశవాసినగు నన్ను పరిహాసమాడుచుంటివా? ఇదియే నిజమైన మీ దేశపురసములు పరిహాసోక్తులు విచిత్రమై ఖరితో నొప్పుచున్నదని చెప్పవచ్చును. సందేహము లేదు.

గోవ:—గ్రుడ్డివాడా! పరిహాసము కాదు. నేననినమాటలోని ప్రత్యక్షరము నిజముగ దలంపుము. రూపాయలనిచ్చుటయో ప్రాణములను వదలుటయో స్థిరపరచుకొనుము.

మల్హా:—నేను డబ్బిచ్చుటకు సంసిద్ధుడను గాను. ప్రాణములను పోగొట్టు కొనుట కెంతమాత్ర మిష్టము లేదు.

మల్హారరావు ప్రత్యుత్తరమును విన గోవర్ధనుని ముఖము మరియు వికృతమయ్యెను. కన్నులు నిప్పులు గ్రక్కుచుండెను. ఒక్క కేకవైచి గోవర్ధను డిట్లనియె. నీకిష్టము లేకున్నను చావు తప్పదు. ఒక్క నిముసము సమయమిచ్చితిని; మరణమునకు సంసిద్ధుడవై యుండుము. తుపాకి గుండు దెబ్బ కెదురు చూడుము.

ధనవాంఛచే మనుష్యుల ప్రాణముల దీయుటలో గోవర్ధనుని వంటి పైశాచిక ప్రకృతికి మహోత్సాహ మను సంగతి నెఱింగియు చలింపక చిరునవ్వుతో మల్హారరా విట్లనియె. మిత్రమా! ఇంకను కాలవిలంబన మేల? వెంటనే కాల్చివేయుము. నామాట యొకదానిని వినుము. నీవు కాల్చెదవు. నేనిట్లే నిల్చుందును. ధ్వనియగును కాని ప్రాణములు మాత్రము పోవు. కారణ మేమనగా, నీవింత బుద్ధిమం

లేడవని యెంచితివేమో యింతకు ముందు నీవు గృహమును పరిశోధించి చూచుచున్నప్పుడు నీకు కట్టుకట్టుచున్నప్పుడే నీ తుపాకీలోని గుండ్లు నా జేబులో జేరినవి. కనుకనే కాల్చుమని నేనింత గట్టిగా నొక్కిచెప్పు చున్నాను.

మల్హారరావుమాటను విన గోవర్ధనునిగుండెలు చెదరిపోయెను. వెంటనే తుపాకీగొట్టమును పరిశీలించి చూచెను. గుండ్లులేవు. విపరీతమైన భయముకలిగెను. ఆప్రదేశమునుండి పారిపోవతలంపు కలిగి ప్రక్క ప్రక్కల పరిశీలింపసాగెను. మల్హారరావు వెంటనే తన జేబులో నున్న పిస్తోలును పైకిదీసి గోవర్ధనునివైపు గురిచేసి అనగా వక్షస్థలమునకు లక్ష్యముంచి గంభీరస్వరముతో నిట్లనియె. మహాత్మా! దయచేసి శాంతముగా కూర్చుండుడు. ఆ తుపాకీని పారవేయుడు. పారిపోవ ప్రయత్నింపవలదు. అట్లొనర్చితిరా! ఇదిగో! నా చేతిలోని పిస్తోలు నుపయోగింపవలసి వచ్చును. వజ్రప్రహారతుల్యమైన గుండు దెబ్బతో తమ ప్రాణము లెగిరిపోవును. పాపజీవన మంతయు సమాప్తము కాగలదు.

గోవర్ధనునకు స్వసామర్థ్యమునందు నమ్మకమెక్కువ. అతని నస్త్రహీనునిగా జేయగల వారింతవరకును గానరాలేదు. నేటికీయపరిచితవ్యక్తి బలమందును - నేర్పరితనమునందును - మోసమునందును దనకన్న పైచేయివలె నున్నాడని గోవర్ధనుడు తలచెను. ఆక్రాంత వ్యక్తి - ఆక్రమణకారి యయ్యెను. వేరుపాయము తోచక మృదువాక్యములచే ప్రాణముల దక్కించుకొన దలంచి యిట్లనియె. మిత్రమా! మంచివాడవే నీసామర్థ్యమును పరీక్షింపదలచి చేసిన పరిహాసమును నిజమని దలంచితివే! మంచి సరసము. నిశ్చయముగ నిన్ను జంపుదుననియే దలంచితివా?

మల్లా:—నీ పరిహాసమునకనేక వందనములు. నేను మాత్రము యదార్థమే తెలుపుచుంటిని. నీవు కృతఘ్నుడవు. హంతకుడవు. క్షుద్ర నరక కీటమవు. నేను నిన్నిదినములో చూడలేదు గాని నీ పేరు మాత్రము వినియుంటిని. గొంతుకలు నులిమి చంపు గోవర్ధనుడవు. వినినదానికిని చూచిన దానికిని సరిపోయినది.

గోవ:—(విస్మయముతో) నేను పరదేశినని చెప్పితిని గాదా?

మల్లా:—నిన్ను గూర్చిన విషయములు నాకు చాల తెలియును. చుట్టు ప్రక్కల పర్వతముల మధ్యలోక ధననిక్షేపము కలదు. నీవు పేదవాడవుకావు. ఆ నిక్షేపమునుండి నీకు అవసరము కలిగినప్పుడెల్ల కావలసిన ధనము తెచ్చుకొని ఆనందముగ గడుపుచుందువు. గొప్ప భాగ్యశాలివి.

గోవ:—ఇట్లు మాట్లాడుటలో నీ యభిప్రాయమేమి? నీ వెవ్వడవో దయచేసి తెలియ జేయుము.

మల్లా:—దేవరవారి వృత్తాంతమింకను కలదు. సావధానముగ నాలకింప వలయును. మీనివాసస్థానమిది కాదు. తమ నామధేయము గోవర్ధనుడు కాదు. రావల్పిండి - లాహోరు వైపుల నుండి - గాలి నీరు మార్పునకై - అధికారుల కన్నులలో దుమ్ము జల్లి దేవరవారి శుభాగమన మీవైపునకు మరలినది.

గోవర్ధనునకు గుండెలు కొట్టుకొను చుండెను. కట్టెదుట నున్న శత్రువు సామాన్యుడు కాడని తెలుసుకొని కర్తవ్యమునుగూర్చి తల పోయుచుండెను.

మల్లా:—నీ జీవితములోని పెక్కు రహస్యములు ఇంకను గలవు. వానిని నేనిప్పుడు చెప్పదలంచుకొనలేదు. నీవిప్పుడు నావిషయమై

చూపిన దుర్వ్యవహారమునకై క్షమింప దలచితిని. కాని ఇక మీదనైన నీవీ పాపమార్గమునువదలి మంచి త్రోవకు రమ్ము. లేదా జాగ్రత్త. పశ్చాత్తాప పడవలసి వచ్చును.

పులింద మల్హారరావు చెప్పు వాక్యములను వినుచుండెను. తన తండ్రి రాక్షసప్రకృతిగల బందిపోటుదొంగ యని యెరుంగును. గాని ప్రపంచకమున నామెకు నావారని చెప్పుకొనదగిన వ్యక్తి గోవర్థనుడుగాక వేరెవ్వరును కానరానందున నా యభాగిని వాని సుఖదుఃఖములతో పాటు తన భాగ్యపాత్రమును బంధించి బంధురతమోమయ జీవితమును గడుపుచుండెను. ఇంతకాలమున కీయువకుని దర్శించుట వలన పులిందయొక్క జీవిత నాటకములో ద్వితీయ రంగము ప్రారంభమయ్యెను.

గోవ:—నీవొక రాజకీయ గూఢచారివని తలంచుచుంటిని. నాయభిప్రాయము నిజమేనా?

మల్హా:—నిశ్చయమే. నేను అపరాధ పరిశోధకుడను.

గోవ:—అట్లయిన నీవు నా యింటినుండి దాటిపోజాలవు. నీప్రాణములు సంకటములో జిక్కెనని యెంచుము.

మల్హా:—నేనెవ్వడనైననేమి. ఆత్మ సంరక్షణ మొనర్చుకొను శక్తి నాకు భగవంతుడిచ్చియున్నాడు.

గోవ:—ఆ శక్తి యెట్టిదో చూచెదను. నీ పేరు మల్హారరావుకాదా?

మల్హా:—అందులకు సందేహమేమి?

ఇంతలో వెలుపల అడుగులు చప్పుడు వినవచ్చెను. గోవర్థనుని భీత హృదయమున ధైర్యాంకురము లొదవెను, ఒక మిత్రుని రాకకై నిరీక్షించుచుండెను. అడుగుల ధ్వనివిని తిరిగిచూడ తలుపులు దెరుచుకొని యొక పురుషుడు నిలువబడెను. గోవర్థనుని నేత్రములు ప్రకాశమాన మయ్యెను. ఆవచ్చినవాడు గోవర్థనుని పాపకార్య సహచరుడగు మదనజీ!

4వ ప్రకరణము

—: కాలూరాయి :—

కాలచక్రము తిరిగిపోవుచున్నది. గోపాలరావు చనిపోయి రేడు సంవత్సరములైనది. ఈ రేడు సంవత్సరములలో చాల పరివర్తనము కలిగినది. బందిపోటుదొంగయైన కాలూరాయిని పట్టుకొనుటకై పెక్కుమంది నియోగింపబడిరి. కాని యొకడైనను వాని జాడను కనుగొన జాలడయ్యె. ప్రజలందరు కాలూరాయిచేయు ఆకస్మికాక్రమణము వలన భీత చిత్తులైయుండిరి. మల్హారరావు పరిశోధక శాఖలో జేరి ప్రఖ్యాతి వడసెను. గవర్నమెంటు వారతనిని వేరు వేరు పనులకై నియోగించుచున్నారు. కాలూరాయిని బంధించు ప్రయత్న మాతని హృదయమును వదలలేదు. అతడు తన దేహబుద్ధి బలములను రెండుభాగములుగ జేసి యొకభాగము రాజకార్యనిర్వాహణమునకును రెండవభాగము కాలూరాయిని బంధించు విషయమునను వినియోగ పరచుచుండెను. కాలూరాయిని పట్టుటయే తన జీవితమునకు పరమావధియని దృఢ పరచుకొనెను.

పూనాలో కార్యస్థానము కట్టివేయబడిన తరుపరి మల్హారరావు తారను శివనివాసగ్రామములో తన తండ్రికి మిత్రుడైన యశవంత సింహుని యింటనుంచి తాను పరిశోధక శాఖలో జేరెను.

యశవంతసింహుడు తనమిత్రుని పుత్రికను తన కుమార్తె వలెనే దలంచి ప్రేమతో పోషించుచుండెను. మల్హారరావు తన యుద్యోగమునుండి సమయము దొరికినప్పుడు వచ్చి ప్రియసహోదరి యగు తారను చూచి పోవుచుండెను.

మధుసూదనరావు వసంతపురమందలి యొక గొప్పసిల్కుషాపులో ఉద్యోగమునకు కుదిరెను. నాలుగేండ్లా యుద్యోగములోనుండి కొంతద్రవ్యమును సంపాదించిన తరువాత దానినివదలి కమీషను వ్యాపారము చేయుచుండెను. మధుసూదనరావుకూడ యశవంతసింహునకు మిక్కిలి పరిచయుడగుటచే తరుచు శివనివాసగ్రామమునకు వచ్చి మిత్రునితో మాట్లాడి గుణవతియైన తార మంచిచెడ్డలను విచారించి పోవుచుండును. ఒప్పులకుప్పయైన తార అందరికిని ప్రేమాస్పదయయ్యెను. యశవంతసింహునకు పురుష సంతతి లేదు. ఒక్కకుమారిత కలదు. ఆమె పతిగృహమున నివసించుచుండెను. భార్యయు తారయు గాక యశవంతుని మేనల్లుడొకడు గలడు. వాని పేరు శంభూసింహుడు. దాసదాసీజనము పెక్కుమందికలరు. గుణవతియైన తార అందరికిని కన్నులచందమామయై తనజీవితము సుఖమయముగ వెళ్లించుచుండెను. శంభూసింహుడు తారయొక్క సుందరరూపమునుగాంచి ముగ్ధుడై పోయెను. ఆమెను త్రికరణశుద్ధిగ వలచి యామెకై ప్రాణములనైన ధారపోయ నుండెను.

శంభూసింహుడు నవయువకుడు. సుందరుడు. శ్రీమంతుడేగాని తారకేమి కతముననో వానిమాటయన్న నయిష్టముగ నుండును. శంభు ప్రసంగ మామెకు విషశరములవలె తోచుటయేగాక వాని మాటలలో నొకదానినైన నామె విశ్వసింపదు. ఇంతకన్న నామె కాయింట నెట్టికష్టమును లేదు.

నాటిసాయంకాలమున తార యింటికెదురుగనున్న బాట కవ్వలి భాగమునగల యొకవృక్షవేదికపై గూర్చుండెను. ముఖము చింతాభరమున నుదాసీనమైయుండెను. ఇంతలో నొకపురుషుడు వచ్చి తారకెదురుగ నిలువబడి పలుకరించెను. సోదరీ! కూర్చుంటివా? యని యడిగెను.

ఆ వచ్చిన పురుషుడు తారకు సంపూర్ణ పరిచితుడగు భిల్లుడు. పేరు మిఘువా. మధ్య వయస్కుడు కాడు. పాతిక సంవత్సరముల వయస్సుండవచ్చును. అడవి జంతువుల జంపుటయే యతని పని.

తార:—మిఘువా! ఎక్కడికి వెళ్లుచుంటివి?

మిఘు:—నీకొరకే వచ్చితిని. అన్న నేడు వచ్చునో లేదో తెలిసికొనవచ్చితిని.

తార:—సరిగా చెప్పజాలను. రావచ్చును, రాకపోవచ్చును.

మిఘు:—రావచ్చునని నానిశ్చయము. వచ్చినచో వెంటనే మా యింటికి బంపుము. మరచిపోవలదు. అన్నయైన మల్హాన్ నేడు రావచ్చును.

తారా:—అట్లనే పంపెదను. మరచిపోను.

మిఘువా వెడలిపోయెను. రెండుమూడు నిముసములకు మరియొక పురుషుడా ప్రదేశము నలంకరించెను. ఇతడొక గొప్ప యింటి యువకుడు. వయస్సు ఇరువదినాలుగు సంవత్సరములు. పేరు ధనేశ్వరుడు.

శివనివాసము గ్రామమైనను వ్యాపారులకు తావు. రాత్రుల యందు పెక్కుమంది విదేశవ్యాపారులు బాటసారులు వచ్చి నాలుగైదు దినములుండి పోవుచుండుట కలదు. అట్టివారి వసతికై కొన్ని భోజనశాలలు (హోటల్సు) కలవు. వానిలో లాలా రామగోవిందుని హోటలు చాల పెద్దది. రెండు అంతస్థుల మేడ. బాటసారులు నివసించుటకు చాల గదులు గలవు. పనివారు, దాసదాసీలు, గుమాస్తా, మేనేజరు మొదలగు వారు కలరు. అచ్చటి కార్య నిర్వాహకవర్గములో ధనేశ్వరుడు ప్రధానుడు. యశవంతునకు నతని భార్యకు నతనియందు మిగుల వాత్సల్య భావము కలదు. తత్కారణమున అప్పుడప్పుడు

వచ్చి పోవుచుండుటయు తారతో ప్రసంగించుటయు కలదు. తార యీనాడేలకో ప్రతి దినముకన్న విచారముగా నున్నట్లు గమనించి ధనేశ్వరుడిట్లు ప్రశ్నించెను.

ధనే:—తారా! కృష్ణచతుర్దశినాటి ప్రభాత సమయ శశిబింబము వలె నీనగుమొగము వన్నె దొరిగియున్న దేమి?

తార:—నీయూహ నిజమే. యీదినమున నామనస్సు సరిగా లేదు.

ధనే:—కారణమేమో నేను తెలిసికొన వచ్చునా?

తార:—శంభూసింహుని గూర్చి నిన్ను కొన్నివిషయముల నడిగెదను. సరియైన ప్రత్యుత్తర మిచ్చెదవా?

ధనే:—నిస్సంశయముగ నడుగుము. అతని విషయమేమి?

తార:—అతడు నీక్షేమాభిలాష గాడా?

ధనే:—నేనీవిషయము నిదివరకే యెఱుంగుదును. ప్రత్యక్ష విరోధి నెవడైన ప్రేమించునా! వాని క్షేమము కోరునా! నీవు నాయందభిమానముతో నుంటివని వినినది మొదలు శంభూ నాకు పగవాడైనాడు.

తార:—అంగసతి నతడు గ్రహించినట్లైతే నేనదృష్ట వంతురాలను. నేటి యుదయమున నన్ను కలియవచ్చి పెక్కు విషయములను ప్రసంగించి తుదకు నీవిషయములో జాగ్రత్తగా నుండుమనియు మోసపోవద్దని చెప్పినాడు. మరియు నీమాటలకు మోసపోవలదనియు నీవంటి భ్రష్టయువకుడు వేరొక డుండడనియు చెప్పెను.

ధనే:—అంతకన్న నేమియు చెప్పలేదా! నేనే హంతకుడ ననియు - బందిపోటుదొంగ ననియు - వేయేల సుప్రసిద్ధ చోరుడగు కాలూరాయినే నేననియు చెప్పలేదా?

తార:—అదేమియు చెప్పలేదుకాని నీవెనుకటి చరిత్రయంతయు కలుషమనియు నారహస్యములను బయల్పరచినచో నీ యీప్రస్తుత జీవితమంతయు సర్వనాశనమగుననియు నీభావియభ్యున్నతికి వేరుమార్గము లేదనియు నీ పేరు ధనేశ్వరుడు కాదనియు చెప్పెను.

తారవాక్యములను వినుచున్నకొలది ధనేశ్వరునకు హృదయమున కలవరము గలిగెను. కాని దానినడంచుకొని శుష్కహాస్యమును జూపుచు నిట్లనియె.

నాపేరు ధనేశ్వరుడుకాకున్న నష్టమేమి? ఇప్పుడుకాకున్న మరియొకప్పుడైన నేనే కాలూరాయినని చెప్పును.

ఆ యువతీయువకు లిర్వురు మాట్లాడుకొనుచు నింటి సింహద్వారమును సమీపించిరి. ఇర్వురి వీపులు వీధివైపున నున్నవి. ఇంతలో వారివెనుకనుండి యీవాక్యము గంభీరముగా వినపడెను.

నిన్నే కాలూరాయి అని చెప్పినచో నానిర్భాగ్యునితో అసత్యమని చెప్పి వాని యబద్ధమును నిర్ధారణ చేసెదను.

ఇర్వురు వెనుకకు తిరిగిచూచిరి. శరీరమాపాదమస్తకము నీలవస్త్రాచ్ఛాదితుడై రెండుచేతులలో బారుచేయబడిన పిస్తోళ్లుధరించి యొకపురుషుడు నిలువబడి యుండెను.

ఆ వ్యక్తిని కాలూరాయి యని పాఠకులు గుర్తించియే యుందురు. నలువైపుల నొక్కమారు నిశ్శబ్దముగా నుండెను. పెక్కుమంది పరిశోధకుల కన్నులలో దుమ్మొజల్లి పోలీసువారికి జిక్కకుండా తిరుగు బందిపోటు దొంగ నేడాకస్మికముగ ప్రత్యక్షమగుటచే వారి

ర్వరుని తెల్లబోయిరి. ధనేశ్వరుడు బలముగల యువకుడే. అయిన నేమి. కాలూరాయి చేతిలోని పిస్తోలును చూచి భయపడెను. ఇక తార మాత్రమేమి చేయగలదు! తన సర్వమును హరించి పర గృహములకు బంపిన యా కాలూరాయి స్వరూపమును జూచి తన కోపము లోన నడంచుకొనెను. ఆ సుకుమార శరీర నిశ్చేష్ట యయ్యెను.

కాలూరాయి గంభీరధ్వనితో నిట్లనియె. నన్ను జూచి మీరేమియు భయపడవలదు. నేను రెండుమూడుమాటలాడి వెడలిపోయెదను.

ధనే:—నీవెవడవు. ఈ చిత్రవేషమేల ధరించితివి?

కాలూ:—నేను కాలూరాయినని నావేషమే చెప్పుచున్నది. మరియు నామశ్రవణము మీకు క్రొత్తగాదు.

ధనే:—వినియుంటిమి. ప్రస్తుతమరణ్యావాసమును బరిత్యజించి పట్టణ సంచారము చేయుచుంటివా?

కాలూ:—అదంత గొప్ప సంగతికాదు. నేను సర్వ వ్యాపిని.

ధనే:—నీకొరకు పోలీసువారు చాల శ్రమపడి యుండుటచే వారికి శ్రమ లేకుండ నీకుగా నీవే యాత్మ సమర్పణము గావించుకొన వచ్చితివి కాబోలు.

కాలూ:—నన్ను బట్టగల సాహసవంతుడున్నాడా!

ధనే:—నేనే నిన్నడ్డగలను.

కాలూ:— ఆ-హా-హా-హా-యని వికట హాస్యము జేసెను.

ధనే.—నీ శరీరబలమును నే నెరుంగనిదిగాదు. అందులకు నేను భయ పడుటయును లేదు. నీ చేతనన్ను పిస్తోల్ల యాధారమును జూచు కొని యిట్లు మాట్లాడుచుంటివి. ఇచ్చటినుండి పోవునప్పుడు నీ శరీర బలమెంతవరకో పరీక్షించెదను.

కాలూ:—ధనేశ్వరా ! నీయట్టి సుందరయువకున కిట్టి వాక్యములు శోభ నొసంగవు. మన యిద్దరికిని శత్రుత్వము కల్గుటకు నీకు నేనేమియు కీడు సేయలేదు. ఒకవేళ నాకు విరోధముగ నీవేమైన జేయదలంచినను వ్యర్థమే. ఏమందువా నిన్ను జయింపగల దివ్యాస్త్రము నాదగ్గిర నున్నది. దాని పేరు విని దలంతువా ?...కు-బే-ర-సిం-హ.

ఆకస్మికముగ బాకుపోటు తినిన వాడెట్లు కూలబడునో యట్లే కాలూరాయని దివ్యాస్త్ర నామము వినిన వెంటనే ధనేశ్వరసింహుడు తటాలున ప్రక్కనున్న కుర్చీలో కూలబడెను.

కాలూ:—సుందరీ ! తారా ! మీ సోదరుడెక్కడ నున్నాడు ?

తార:—(కోపముతో) ఇంటిలో లేడు.

కాలూ:— నేనతనిని కలియవలయునని కోరుచుంటిని. అతడును నన్ను జూడ గోరుచున్నాడని వింటిని.

తార:—ఇంతవరకు నీ గ్రహగతి క్రమముగ నున్నది. గనుకనే మీకిరువురకు బరస్పర సాక్షాత్కారము కలుగలేదు. నీవంటి మహా పురుషుని కలసికొనుటకు తొందరపడుచుండుట నీవు కలియవచ్చుటయు క్రియా సిద్ధికే యని తలంచెదను.

కాలూ:—నీ మాటలను వినిన నవ్వు వచ్చుచున్నది. రాబోవు పూర్ణిమనాడు సూర్యాస్తమైన పిదప భద్రగిరి క్రిందకు వచ్చి నచో కాలూరాయి యొక్క సాక్షాత్కారము కలుగునని మీ అన్నతో చెప్పుము.

కాలూరాయి మాటలను విని తార నిరుత్తర యయ్యెను. ధనేశ్వరునకు భయము కలిగెను. కాలూరాయి ధనేశ్వరుని ముఖమున లక్ష్యముంచి యిట్లనియె. ధనేశ్వరా ! నీ దుర్బుద్ధి యింకను

పోలేను. అందరివలె నేనును కఠినుడనైనచో నీ సరళ హృదయ సుకుమారియైన తార యెదుట నీ వెనుకటి రహస్య మెంతయో వెల్లడి చేసియుందును. దానితో నీ యదృష్టరేఖ యెంతవరకు విస్తరించియుండునో గ్రహించియుందువు. మిత్రమా! ప్రస్తుతము నా పాప ప్రవర్తనమును గూర్చిన చింతను విడచి వెనుకటి జీవితమును కొంచెము విమర్శించుకొంటివేని చాల నుపకారమగును.

అని చెప్పి కాలూరాయి వెనుకకు తగ్గుచుండెను. చేతిలోని పిస్తోలు ధనేశ్వరునివైపునకు లక్ష్యముంచెను. కొంతదూరమట్లు వెనుకకు నడచి గిరుక్కున వెనుకకు దిరిగి పారిపోతలంచెను. కాని వెనుక నుండి కాలూరాయి కుడిచేతి మనికట్టు నెవ్వరో బిగించి పట్టుకొనిరి.

బందెపోటు దొంగా! ఎక్కడకు పోయెదవు? నీ అత్యాచారమునుండి దేశము రక్షింపబడినది.

అని వెనుకనున్న యాగంతుకుడు కేకవైచెను.

5వ ప్రకరణము

—రామేశ్వర పాండేయ—

ఆ చీకటిలో నూతన పురుషుడొకడు వచ్చి కాలూరాయి యొక్క ముంజేతిని గట్టిగ పట్టుకొనెను. ఈ సంగతిని గమనించి ధనేశ్వరసింహుడు కాలూరాయిపై లంఘింపబోయెను. తన జనకుని సర్వస్వమపహరించిన దుష్టునికి శిక్షయగుననియు లోకమీ దుష్టుని యత్యాచారమునుండి రక్షింపబడునని తార తలంచుచుండెను. కాని యామె తలంపు నెఱవేరలేదు. కాలూరాయి వెంటనే తనకు రా

నున్న యాపదను గ్రహించి తన చేతిని పట్టుకొనిన వాని శిరముపై రెండవచేతిలోని రివాల్వరు మడమతో బలము కొలది కొట్టెను. పిడుగువంటి యా దెబ్బతో వాని చేతి పట్టు వదలెను. మెరపు మెరసినట్లు కాలూరాయి మాయమయ్యెను. వ్రాయుటాలస్యము కాని కనులుమూసి తెరుచునంతలో నీ కార్యము పూర్తి యయ్యెను. కాలూరాయి కొట్టిన దెబ్బ మాడుపట్టున తగులుటచే వాడు సహింప జాలక క్రిందపడిపోయెను. ధనేశ్వరుడు దొంగ– బందిపోటు దొంగ– పట్టుకో అని అరచుచు వాని వెంటబడెను. ఎంతమంది ప్రయత్నించినను కాలూరాయి చిక్కక పోవుటయుండ వాడు పోయిన మార్గమైన తెలియలేదు. ధనేశ్వరుడు తిరిగి వచ్చి తారను కలసికొనెను. ఇర్వురును ఆ హతవ్యక్తి పడియున్న చోటికి బోయిరి.

తార దీపమును వెలిగించుకొనివచ్చెను. దీపపు వెలుగున ధనేశ్వరుడతనిని గుర్తించి "ఇతడు సోమేశ్వర పాండ్యా. హోటలులోని నూతన కర్మచారి. నన్ను పిలువవచ్చియుండును. ఇంతలో నీ విపత్తు సంభవించినది."

వానినిర్వురు పట్టి యొక గదిలోనికి గొంపోయి పరుండబెట్టిరి. సేవకుడు వచ్చి ముఖమున శీతలోదకమును జల్లి విసరుచు తెలివి వచ్చుటకు తగిన యుపచారముల సల్పుచుండెను. ఇంతలో ధనేశ్వరుడు తారతో నిట్లనియె. తారా! కాలూరాయి చెప్పిన మాటల నన్నింటిని వింటివా ?

తార:—విన్నాను.

ధనే:—నేటి యుదయమున శంభూ నీతో నేమని వచించెనో అదియే కాలూరాయి కూడ చెప్పియున్నాడు. మాటలభేదమే గాని

అభిప్రాయమంతయు నొకటే. కావున నింకమీఁద నీ దృష్టి
లో నేనొక పరమపాపినై యుండఁగలను.

తార:—నేను వారిర్వురి వాక్యములలో నొకదానినైన నమ్మలేదు.

ధనే:—భగవంతుఁడు నిన్ను రక్షించుఁగాక. నాకొక సంశయము
కలుగుచున్నది. నా విషయమై నీ చెవుల కెట్టి భయంకర
వార్త వినఁబడినను నాయందనుమానము పెట్టుకొనక వెనుకటి
ప్రేమయు నమ్మకమును సుస్థిరముగ నిలుపఁగలవా ?

తార:—దృఢచిత్తము గల స్త్రీ యొక్క ప్రేమమంత శీఘ్రముగా
సంతరింపఁజాలదు. నేనంత యవివేకినికాను.

ధనేశ్వరుఁడు ప్రసన్న చిత్తుఁడై తారతో నిట్లనియె. తారా !
నేను ప్రతిజ్ఞాపూర్వకముగ వచించుచున్నాను. నేను నా జీవిత
మధ్యమందెట్టి భయంకర పాపకార్యమును చేసియుండలేదు. కాని
నా ప్రారంభ జీవితమునందొక కళంకము సంభవించినది. ఒకానొక
యత్యాచారము వలన నేను పీడింపఁబడుచుంటిని. నాకు సంభవించిన
యా కళంకవార్తను మరియొక సమయమున వెల్లడించెదను. అందు
లకే నేను చాల చింతపడుచుంటిని. అంతవరకు నోపికను బట్టి
యుండుము. నన్ను సందేహింపవలదు.

అని చెప్పినప్పటికి ధనేశ్వరునకు కన్నులనిండ నీరు గ్రమ్మెను.
నోట మాట రాలేదు. మృదుల హృదయయైన తార తన బాహు
వల్లరుల నాతని మెడకు జుట్టి యిట్లనియె. ధనేశ్వరా ! అధైర్య పడ
కుము. నేనెన్నటికిని నిన్ను సందేహింపను. నా హృదయ స్థయిర్య
మును నీవు గమనించినచో నిట్లనవు. నా సంశయము నొకదానిని
మాత్రము పోఁగొట్టుము. నీ పేరు ధనేశ్వరసింహుఁడు కాదా ?

ధనే:—కాదు. ఇది నా కల్పితనామము. నేనిట్లు గూఢముగ సంచరించుటకు తగిన కారణము నొకనాడు చెప్పెదను. నీదగ్గర దాచదగిన దేమియును లేదు. నేటినుండియు సర్వదా నీ ప్రేమకు పాత్రుడనై యుండదగిన యర్హతను సంపాదించుకొనెదను. నా మాటను నమ్ముము.

అని పల్కుచు ధనేశ్వరుడు తారయొక్క బింబాధరోష్టమును దగ్గర దీసుకొని చుంబనమును ముద్రించెను. వీరిద్దరు ప్రసంగముగో నుండగనే సేవకుడు వెడలిపోయెను. వీరిద్దరు మోహప్రవాహము న బడియుండ నట సోమేశ్వరపాండ్యాకు తెలివి వచ్చెను. మెల్లగ కూర్చుండి తల రెండుచేతుల బట్టకొని అబ్బా యని మూల్గెను.

అధ్వనితో వీరిద్వరి మోహనిద్ర వదలెను. ఇద్దరు బాహు బంధములనుండి విడివడి లజ్జారుణ వదనములతో వచ్చి సోమేశ్వరుని కడ కూర్చుండెను.

ధనే:—సోమేశ్వరా! బాధ యెట్లున్నది? నీకు గల్గిన విపత్తునకై చాల చింతించితిని.

సోమే:—అబ్బా! ఎంత దెబ్బ! ఇంకను తల దిరుగుచున్నది? ఆ దస్యు నెచ్చట బంధించినారు?

ధనే:—వాడు పారిపోయినాడు.

సోమే:—పారిపోయినాడా! ఎంత విచిత్రపుమనిషి? ఎంత సాహసము! సాయంకాల సమయమందే ఒక గృహస్థుని యింట దొంగ తనమునకై వచ్చిన వానినెంత ధైర్యశాలి యనవలయును? నిశ్చయముగ వాడు చౌర్యమునకే వచ్చెనా?

ధనే:—వాడేయుద్దేశ్యముతో వచ్చెనో మన మెట్లు నిర్ణయింపగలము? ఇంతకు వాడెవ్వరో తెలిసికొంటివా?

సోమే:—లేదు. నే నెరుంగను.

ధనే:—ప్రఖ్యాతిగన్న బందిపోటుదొంగయైన కాలూరాయి.

సోమేశ్వరున కాశ్చర్యము భయము కలిగెను. ముఖము శుష్కించిపోయెను. ఎవరు అతడు... కా-లూ-రా-యి. వానినా నేను పట్టుకొనదలంచినది?

ధనే:—తెలిసియుండిన నా ప్రాంతములకు రాకయుందువు. అంతే కాదా?

సోమే:—నేను వానిని సామాన్య చోరునిగ దలంచి పట్టనేగితి.

ధనే:—నీవు నన్ను పిలువవచ్చితివా యేమి?

సోమే:—మేనేజరుగారు పిలుచుకొని రమ్మని పంపుటచే వచ్చి యీ దురవస్థకు పాల్పడితిని.

ఇర్వురు బయలుదేరి హోటలునకు వచ్చిరి. ఈ వార్త హోటలంతయు దెలిసెను. వినిన వారెల్లరాశ్చర్యపడుచుండిరి. నోట మాట లేదు. ధనేశ్వరుడు చాల రాత్రివరకు లెక్కలు చూచుకొనుచుండెను. అతని హృదయమునకు శాంతిలేదు. నాటిరాత్రి భుజింపలేదు. శయ్యపై గూర్చుండి ఛాయవలె తన్ను వెన్నాడుచున్న దుర్భాగ్యదశను గూర్చి యీరీతిగ తలపోయుచుండెను. నా వంటి నిర్భాగ్యుడెవ్వడును లేడు. స్వగృహమును - బంధువులను - జన్మభూమిని - నిజ నామమును గూడ పరిత్యజించి యింతదూరము వచ్చి యీ పర్వత ప్రదేశమందైన శాంతముగ కాలము గడుపదలంచితిని. ఇంతైనను నా దురదృష్టదేవత నన్ను వెన్నాడుచునే యున్నది.

ఈ శంభూసింహుడును కాలూరాయి - నా పూర్వచరిత్ర నెట్లో గ్రహించుటయేగాక నా నిజనామమును సైతము తెలుసుకొని నన్ను బాధింపదలంచుచున్నారు. ఇక నేమి సేయవలయును? ఇచ్చటనుండి పారిపోవలయునా? ఎచ్చటికి పోవలయును? మార్గమేది? పోయినచో తారాసందర్శనమెట్లు లభించును? భగవంతుడా! నిర్దోషినైన నా కెట్టి కష్టముల నిచ్చుచుంటివి?

అని తలపోయుచుండ నతని దృష్టి యాకస్మికముగ కొంచెము దూరములో నున్న కాగితముపై బడెను. దానిందీసి జూడ నిట్లు వ్రాయబడియున్నది.

"ధనేశ్వరసింహా! నీవు శీఘ్రముగ శివ నివాసము వదలుము. కారణము చెప్పుటకు వీలులేదు. మూడు దినములలో నీవీగ్రామమును వదలిపోనియెడల నీకు మృత్యువు తప్పదు. నీకు రక్షకులు లేరు. జాగ్రత్త పొరబడితివా నీప్రాణములు నీవికావు. ముందుగనే తెలియ జేయుచుంటిమి. మృత్యువును పేరంటమునకు బిలువకుము.

(షట్చక్రము)"

ధనేశ్వరుని చేతినుండి కాగితము క్రిందబడెను. ఈ షట్చక్ర మెచ్చటిది? దీని నాయకుడెవడు? పై రెండుగాక ఇదియొక మూడవ బెదరింపా! బెదరింపా లేక ఆపదయా! ఏమియు తోచలేదు.

6వ ప్రకరణము

—* మిఘవా *—

మదనజీని చూచిన తోడనే గోవర్ధనున కెక్కడలేని సంతోషము సాహసము కలిగెను. మల్హారరావు గోవర్ధనుని వైఖరి యంతయు గనిపెట్టి చూచుచుండెను. ఒకకంట నా వచ్చినవాడు

మదనజీయనియు గోవర్ధనుడితని రాకకై యెదురు చూచుచుండె ననియు ననుమానించెను. రాత్రి తనపై బడిన ఘాతక త్రయములో మదనజీ యొకడు కాదాయని తలపోయుచుండెను. ఏడు వత్సరముల నుండి మదనజీని సశంకిత దృష్టితో జూచుచుండెను. ఇతనిపై కసి దీర్చుకొనన నెంచి మదనజీ ప్రయత్నించుచుండెను.

మదనజీయొక్క రాక గోవర్ధనుని ధైర్యమును రెట్టింపజేసెను. రావు చేతులనుండి తప్పించుకొనగలనని నిశ్చయించెను. మదనజీ లోన కాలుబెట్టుటతోడనే యతని దృష్టి మల్హారరావుపై బడెను. ఒక విధమైన భయము విస్మయము కలుగుటచే ముందుకడుగు సాగ లేదు. ప్రక్కనే దాగియుండ దలంచెను. కాని గోవర్ధనుడు గాక మల్హారరావు గూడ తనను చూచెనని గుర్తించెను. మరియు పులింద భయకంపిత చిత్తయై తన్ను సావధానముగ వీక్షించుచుండుట గ్రహించెను. ముగ్గురి కంటబడి దాగుట మంచిదికాదని యెంచి లోనికి మెల్లగ వచ్చి తెలియంగనట్లు 'దాహమగుచున్నది. మంచితీర్థము దొరకునా?' యని సన్నని యెలుంగుతో నడిగెను.

మల్హారరావు తన పిస్తోలును గోవర్ధనునివైపు లక్ష్యముంచియే మదనజీని పలుకరించెను. ఎవరు వారు? మదనజీ! లోనికిరమ్ము. ఈ పెద్దమనుష్యుని గుర్తించితివా? అని యడిగెను.

మద: —నేను గుర్తింపలేను.

వ్యంగ్యముగ జూచుచు మల్హారరా విట్లనియె.

రమ్ము. కూర్చుండుము. మీకిర్వురకును పరిచయము కలుగ జేసెదను. ఇతను నాకు ప్రాచీన మిత్రుడు గోవర్ధనసింహుడు.

ఈ వ్యంగ్యసంభాషణము వలన గోవర్ధనునకు మితిలేని కోపము వచ్చెను. మదనజీ తనకు సాయము జేయకపోవుటయుండ యెఱుంగ నట్లూరకుండుటవలన గోవర్ధనుని క్రోధమునకు హృదయసంతాపము నకు హద్దులేకపోయెను.

మద:—నేనెక్కువ కాలముండుటకు వీలులేదు. శివనివాసమునకు బోవలయును.

అని పల్కుచు మదనజీ వెనుకకు తిరిగెను.

మల్హా:—ఉండుము. శ్రమపడి వచ్చితివి. దాహముదీర్చుకొని పొమ్ము. ఇంటికి వచ్చి పానీయమడిగి యూరక వెడలుట గృహస్థునకు మంగళము కాదు.

మల్హారరావు యొక్క ప్రతివాక్యము మదనజీయొక్క హృదయమును గ్రుచ్చుకొనుచుండెను. పులింద జలమును గొనివచ్చెను. మదనజీ త్రాగెను.

మల్హా:—నేనును శివనివాసమునకే వచ్చుచున్నాను. ఇద్దరము కలసి పోవుదము రమ్ము. మిత్రమా! గోవర్ధనా! మరల నెప్పుడైన కలసికొందమా?

గోవ:—అవసరము లేదు.

ఇద్దరు బయలుదేరి శివనివాసమునకు పోవుచుండిరి త్రోవలో వారిద్దరకు బలువిధములైన సంభాషణములు జరిగెను. వానిలో రాత్రి జరిగిన యాక్రమణము గూర్చి గాని గోవర్ధనుని గురించి గాని యొక పలుకైనను రాలేదు. శివనివాసమును బ్రవేశించిన వెంటనే మదనజీ దుర్గాహోటలునకు బోయెను. ఈ హోటలులోనే ధనేశ్వరుడు పనిజేయుచుండెను. మల్హారరా వెచ్చటికేగునో కనుగొనవలయు

నని మదనజీ సంకల్పము. ఇంక మల్హారరావును మదనజీని కనిపెట్టి యుండవలయునా! లేక మరల గోవర్ధనుని కుటీరములోనికేగి మరి కొన్ని రహస్యములను గ్రహింపవలయునా! ఒకమారింటికేగి తారతో మాట్లాడుదునా? ఏమిచేయవలయునా యని తలపోసి తుదకేమియు తోచకపోవుటచే మిఛువా యుండు కుటీరమునకు బోయెను. మిఛువా భిల్లుడైనను వానికడ పెక్కు సద్గుణములుండుటచే మల్హారరా వతనితో స్నేహముగా సంచరించుచుండెను.

మిఛువాయొక్క కుటీరము ఊరికొక మూలగానున్నది. మల్హారరావట కేగిచూడ తలుపు తాళము వేయబడియుండెను. తాళపు చెవియుండు ప్రదేశము నెఱుంగును గాన దానిందెచ్చి తలుపులను దెరచెను. లోపల చీకటిగా నుండుటచే మైనపువత్తిని వెలిగించి చూచెను. ఒక కాగితము పడియుండెను. ఆ దస్తూరీ మిఛువా యొక్క స్వహస్తలిఖితముగా గుర్తించి చదువ నిట్లున్నది. "నేను పైకి వెళ్లుచున్నాను. శీఘ్రముగా కనిపెట్టియుండవలయును."

మల్హారరావునకు నవ్వు వచ్చినది. ఆ కాగితమున వ్రాయబడిన విషయముంగూర్చి కొంతతడవాలోచించిన పిదప తలుపులను యథాప్రకారముగా బంధించి తాళము వేసి కొండమీదకు వెళ్లెను.

మిఛువా సాయంకాల సమయమున తారతో మాట్లాడి తన యింటికేగెను. కొంతకాలము విశ్రమించి యొక కాగితముపై పైనవ్రాసిన మాటను వ్రాసి తిన్నగ పర్వతము మీదకేగెను. ఆకాశము స్వచ్ఛముగ నుండెను. చీకటి దట్టమయ్యెను. మిఛువా పర్వతము నెక్కుచుండెను. శీతలవాయుపాతమున నతని హృదయము ప్రఫుల్లమగుచుండెను. స్వభావముచేతనే భిల్లయువకుడగుటచే నతని

కంటికి పర్వతశిఖరమున నొక మనుష్యాకృతివలె కన్పడెను. కాని దూరమగుటచే నిశ్చయింప జాలకపోయెను. కుతూహలము మెండ గుటచే నా మనుష్యాకృతివైపు లక్ష్యముంచి పైకెక్కుచుండెను. కొంచెము కాలమునకు గమ్యస్థానము జేరి చూడ నట మనుష్యుడెవ డును లేడు. అతనికి సందేహము బలమయ్యెను. తాను చూచినది మనుష్యాకృతి యని యతని నమ్మకము. ఎటకేగియుండును?

ఆలోచించుచుండగా నతని చెవులకు అడుగులచప్పుడు వినవచ్చెను. మిఖువా మెల్లగ నా యడుగుల ధ్వని వినపడినవైపునకు నడచెను. పది గజముల దూరము నడువ నతనిముందొక మనుష్యుడు నడచి పోవుచున్నట్లు కన్పడెను. చీకటియగుటచే నా మనిషి యెవరో గుర్తించుటకు వీలు కలుగలేదు.

ముందు నడుచుచున్న పురుషుడా పర్వతమందలి నిమ్నోన్నత ప్రదేశము జేరి యొక సమచతురమగు శిలపై గూర్చుండెను. ఈ చీకటిరాత్రిలో నీ నిర్జన పర్వత ప్రదేశమున నీ మహాత్ముడెవరి రాకకో వేచియుండెనని మిఖువా గ్రహించెను. ఆ రహస్యమేమో తెలిసి కొనవలయునన్న కుతూహలముతో మిఖువా ఆ పురుషుని వెనుకభాగ మున నెత్తుగా పడియున్న రాళ్లగుట్ట చాటున దాగుకొనెను.

ముగ్గురు మనుష్యులు గుట్ట ప్రక్కనుండియే నడచిపోయిరి. చీకటిలో మిఖువాను వారు చూడలేదు. కాని వారినీతడు చూచుచునే యుండెను. ప్రథమమున కూర్చున్న పురుషుడీ ముగ్గురను జూచి నిల్చుండెను. క్రమముగ నల్వురు నొకచోటికి జేరిరి. ముగ్గురిలో నొకడు మొదటివానిం జూచి యిట్లనియె.

"నీవు వచ్చితివా? గుహకు వెళ్లలేదా?"

"అచ్చటికే బయలుదేరితిని. ఇక్కడ కూర్చుండి కొంచెము విశ్రాంతి తీసుకొనుచుంటిని."

మిర్జా చెవియొగ్గి వారి మాటల నాలించుచుండెను.

మొదటి:—ధనేశ్వరుని గూర్చి నీవేమైన తెలిసికొంటివా ?

రెండవ:—విశేషమేమియును లేదు. అతడొక పారిపోయివచ్చిన అపరాధి. అతనిని పట్టుకొనుటకు వారంటు బయలు దేరినది. పోలీసులనుండి తప్పించుకొనుటకీ ప్రాంతమును జేరెను. ఒకరిద్దరు సి. ఐడి. పోలీసులు అతనికొరకీ ప్రదేశమునకు వచ్చినారు. ఈ సంగతి నొక మిత్రుని వలన వింటిని. ఇది నిజమైన సంగతి.

మొదటి:—మనము గూఢచారులవలన రెండు విషయముల దెలుసుకొనవలయును. ధనేశ్వరుని అసలు పేరేమి ? ఇతడే యపరాధముపై పట్టుకొనబడుచున్నాడు ? ఈ రెండు విషయములు మీరు తెలుసుకొనవలెను.

రెండవ:—ఈ రెండు విషయములను తెలుసుకొనుటంత లాభము కాదు. కారణమేమనగా, ఈ విషయములు పోలీసువారి వలన తెలుసుకొనవలయును. పోలీసులకు మనకు సర్పములకు ముంగిసలకున్నంత సంబంధము.

మొదటి:—వ్యక్తిగత విరోధమును సాధించుటకే మన నాయకుడీ విషయములను సంగ్రహించుచుండెనని నా యనుమానము. ఇంతకును షట్చక్రమున కీవిషయముతో సంబంధమున్నదా లేదా యను సంగతి తేలవలయును. రామేశ్వరా ! నీ యభిప్రాయమేమి ?

రామే:—నీ యనుమానము నిజమే. వ్యక్తిగతవిరోధముతో పట్నక్రమున కెట్టి సంబంధమును లేదు. వారి కనేక జరుగురుగా చేయదగిన పనులున్నవి. వానిని వదలి ధనేశ్వరుడెవరు? ఎక్కడివాడు? ఎందులకు వచ్చెను? ఈ విషయముల వలన నేమి లాభముండునని ప్రయత్నింతురు?

మొదటి:—అక్కడి వృత్తాంతమేమి? డబ్బు-జాగ్రత్తగా

రెండు:—(గూఢోక్తిలో) ఇట్టి ప్రదేశమందు మనమా చర్చను జేయరాదు. గుహలోనికి రమ్ము. సర్దారు రాగలడు. అచ్చట సంగతులన్నియు మాట్లాడుకొనవచ్చును.

రామే:—ఉండుము. మాట్లాడకుము. ఏదియో ధ్వని—

మిఘువాయొక్క పొరపాటువలన రాళ్లు కదలుటచే చప్పుడైనది. రామేశ్వరుడు పిల్లివలె బయలుదేరి ధ్వనియైన ప్రదేశమునకు వచ్చుచుండెను. ఆకస్మికముగ సంభాషణ మాగుటచే మిఘువాకు భయము కలిగెను. రెప్పపాటులో రామేశ్వరుడు వచ్చి మిఘువా మెడపై చేతితో గట్టిగా నొక్కెను. ఒక్క విసరుతో రామేశ్వరుని క్రింద పడత్రోసి మిఘువా పరుగెత్త నారంభించెను. రామేశ్వరుడు దొంగ, గూఢచారి, పోలీసు, పట్టుండి, పిస్తోలు పేల్చుండి. అని యరచుచు తోడివారితో గలసి వాని వెంట బరువెత్తుచుండెను.

ఆ సమయముననే మల్హారరావు కొండ యెక్కి యా ప్రదేశమునకు ప్రక్కగ నిల్చుండి చూచుచుండెను. ఒకడు ముందు పరువెత్తుచుండ నల్వురు వెన్నంటి పిస్తోళ్లు ప్రయోగించుచుండిరి. మల్హారరావుచూచి ముందు పరుగెత్తువాడు మిఘువాయని అనుమానించి తన రివాల్వరు పైకిదీసి తూటాలతో బారుచేసి మిఘువా! మిఘువా! ఇటురమ్ము - నేను మల్హారరావును. అని కేక వేసెను.

మిఘువా లేడివలె ప్రక్కకు తిరిగి యొక్క పరుగున మల్హార రావును కలిసికొనెను. వెన్నాడుచున్న నలుగురిని జూచి మల్హార రావొక యుక్తిని జేసెను. జేబునుండి రెండురకముల యీలలను తీసి యొక్కసారే నోటబెట్టి యూదెను. రెండుమూడు విధములగు ధ్వనులు బయలుదేరెను. చేతిలోని రివాల్వరును సూటి జూచి ప్రేల్చెను. వెన్నాడు నల్వురును భయపడి గూఢచారులు నల్వురైదు గురున్నారను భ్రమలో పడి వెనుకకు బోయిరి. మల్హార రావీయుక్తి వలన శత్రువులను తరిమివేసెను.

మిఘువా నిట్టూర్పు విడిచి యిట్లనియె. సోదరా! నీవు తరుణమునకు వచ్చితివి. వారి విస్తోళ్లముందు నా తుపాకి యేమి పని చేయగలదు? దాని కొకటే గొట్టము.

మల్హా:—వారెవ్వరో గుర్తించితివా?

మిఘు:—గుర్తునకు దొరకలేదు కాని షట్చక్రము - అని తరుచుగ వారి నోటనుండి వచ్చినది.

మల్హా:—షట్చక్రమా?

మిఘు:—ఔను. అది యొక గుంపునకు పేరు కాబోలు మిఘువా తాను వినిన సంగతులను మల్హారరావున కెరుకపరచెను.

మల్హా:—మిఘువా! నేటినుండియు నా శిరమున మరియొక కార్య భారము పడినది. కొన్ని దినములవరకు శివనివాసమందే యుందును. ఈ షట్చక్రమన నెవరు? ఎంతమంది? వీరి కార్యక్రమమేమి? దీని నడుపువాడెవ్వడు? ఈ విషయము లన్నియు సాధ్యమైనంత త్వరలోనే తెలుసుకొనెదను.

7వ ప్రకరణము

సోదరీ సోదరులు

మిఛువాను గృహమునకుబంపి తాను యశవంతసింహుని యింటికి బయలుదేరెను. మధ్య మార్గమున దుర్గా హోటలు కలదు. హోటలున కెదురుగ వచ్చునప్పటికతని కేదియో యాలోచన తట్టెను. వెంటనే తలయెత్తి చూచెను. ధనేశ్వరుని గదిలో నింకను దీపము వెలుగుచుండెను. రాత్రి చాలభాగము గడచినను నతని గదిలో దీపమే వెలుగు చుండెనాయని అనుమానము కలిగెను. తాను మిఛువావలన వినిన సంగతులు జ్ఞప్తికి వచ్చెను. మనస్సు పరిపరి విధముల యోజన సేయదొడంగెను.

ధనేశ్వరుడు సద్గుణవంతుడు సౌమ్యుడు స్ఫురద్రూపియను విశ్వాసము కలుగుటచే తన సహోదరియైన తారకు ధనేశ్వరుడు భావి భర్తగా నిశ్చయించి యుండెను. కాని తాను వినినసంగతులను బట్టి యతని విషయమున మల్హారరావునకు గొప్పసందేహము కలిగెను. ధనేశ్వరుడు నిశ్చయముగ నపరాధియా? పోలీసులనుండి తప్పించుకొని వచ్చుట నిజమగునా? ఏకారణమున నతనిపై వారంటు జారీ చేయబడి నది? అని తలపోసెను. ఇంతకాలమునుండి పరిశోధక శాఖలో పనిచేసి నిపుణతను సంపాదించితిని. అనేకమంది మనుష్యుల స్వరూప స్వభావ ములనుబట్టి నిరూపణ జేయుటలో సమర్థుడని పేరుగన్న నాయట్టివాడు ధనేశ్వరుని గ్రహించుటలో పొరబడుట విచిత్రముకాదా? ఏదియెట్లు న్నను నాసోదరియొక్క భాగ్యసూత్ర మేయువకుని సుఖదుఃఖములతో జోడింపబడ నున్నదో యట్టివాని మంచిచెడ్డలను వాని భూతకాలప్రవ ర్తనమును తెలిసికొనుటలో దోషమేమియును లేదు.

అని తలపోయుచు యశవంతసింహుని గృహమున కేగెను. అందరు మేలుకొని కూర్చుండి యేదియో యాలోచించుచుండిరి. అందరి ముఖముల యందు నుదాసీనభావము కనపడుచుండుటకును - అందరు కానవచ్చిరిగాని శంభూ మాత్రము కానరాకపోవుటకును–మల్హారరావు చిత్తము కలవరపడ జొచ్చెను. ఏదియైన భయంకరకాండ జరిగెనా యని భయపడుచు లోపలప్రవేశించెను.

తార సోదరునిజూచి వికసితవదనయై ఇట్లనియె. అన్నా! వచ్చితివా! మేమందరమును నీరాక కెదురు చూచుచుంటిమి. నీవు వచ్చుటయే మంచిదయ్యెను.

మల్హా:—ఏమి జరిగినది ?

తార:—ఏమియును లేదు. కాలూరాయి యిచ్చటకు వచ్చెను.

మల్హా:—ఇచ్చటకు కాలూరాయి వచ్చినాడా ?

తార:—నిశ్చయముగ వచ్చినాడు. నాటిబందిపోటు సమయమున నెట్టి వేషముతో వచ్చెనో అదియే వేషము. ఏమియును భేదము లేదు.

మల్హా:—ఎప్పుడు వచ్చెను ?

తార:—సాయంకాలమైన తరువాత వచ్చినాడు.

మల్హా:—పోలీసులకు పట్టీయ లేదా ?

తార:—వానినెవరు పట్టజాలక పోయిరి. చేతికందియు తప్పించుకొని పాఱిపోయెను.

మల్హా:—నీకెవ్వరును సాయము రాలేదా? యశవంతబాబు గృహమున నుండెనా ?

యశవంతసింహుడు ముందునకువచ్చి యిట్లనియె. నేనా సమయమున నింటిలోలేను. వచ్చినతరువాత జరిగిన సంగతియంతయు

తారవలనవింటిని. ఆదుర్మార్గుని దౌష్ట్యము నానాటికి హెచ్చుచున్నది. వానివలన పెక్కుకొంపలు గూలుటయేగాక వానిబారినుండి తప్పించుకొని జీవించుట దుర్భరమగుచున్నది.

కొంతసేపుండి యశవంతసింహుడు భార్యతోగూడ నిద్రింపనేగెను. సోదరీ సోదరులు గూర్చుండి పెక్కువిషయముల నాలోచించుచుండిరి.

తార:—నేనొక్కతెనుంటిని. ఇంతలో ధనేశ్వరుడుకూడ వచ్చెను. ఏదిగూ మాట్లాడుచుండ నాదుష్టుడెచ్చటనుండియో యూడిపడెను.

మల్హా:—ధనేశ్వరుడు వానినిపట్టుటకు ప్రయత్నించెనా?

తార:—ప్రయత్నింపకేమి? సమయమనుకూలము కాలేదు. వానిరెండు చేతులలోరెండు పిస్తోళ్లున్నవి. ఎట్లుసమీపింపగలడు?

మల్హా:—పిరికివాడు బలహీనుడు చూచుచుండియూ దొంగను వదలివేసినాడు.

తార·—అన్నా! ఒక్కడేమిచేయగలడో చెప్పుము. వానిని పట్టుకొనబోయి వానిచేతి పిస్తోలుగుండునకు తనప్రాణమర్పింప లేదని నీకూ నీ యనుమానము!

మల్హా:—అదికాదు. లోకులందరును ధనేశ్వరుడు కాలూరాయికి సహచరుడేగాక యతని పాపకార్యములలో భాగస్వామియని తలంచుచున్నారు.

తారకన్నులు దుఃఖబాష్పములచే నిండిపోయెను. కొలది నిముసములాగి మల్హారరావిట్లనియె. జరిగిన యావద్వృత్తాంతము నెఱింగింపుము. తార జరిగిన సంగతియంతయు చెప్పెను గాని ధనేశ్వరుని రహస్య వృత్తాంతము మాత్రము మరుగుపరచెను. అంతయును విని

మల్హారరావిట్లనియె. అతనికా సంకల్పమేయున్నచో నేదియో యొక యుక్తివలన నతనిని బంధింపగలడని నా నమ్మకము. తారకీమారుకోప మువచ్చెను. అభిమానపూరిత స్వరముతో నిట్లనియె. కాలూరాయి నీకొరకే వచ్చియున్నాడు. రాబోవు పూర్ణిమనాడు భద్రగిరి క్రిందకు వచ్చిన యెడల తన సందర్శనమగును. కావున నిన్నచ్చటికి రమ్మని చెప్పిపోయెను. శక్తియున్నచో వెళ్లిబంధించి తీసుకొనిరమ్ము.

మల్హారరావునకు మనస్సులోని నవ్వు నడంచుకొని యిట్లనియె. తారా! కాలూరాయి నాయెదుటకి రాజాలడు. రేపుగాకున్న నెన్నడో యొకనాడు వాడు నాచేతికి జిక్కకతప్పదు. అదట్లుంచుము. ధనేశ్వరుడు సహాయమునకై ఏల కేకలు వేయలేదు.

తార:—తోచకపోవచ్చును. లేదా కేకలు వేసినచో రివాల్వరునుప యోగించునేమోయని సంశయింప వచ్చును.

మల్హా:—తోచలేదా? నోరెత్తుటకు సాహసములేదా?

సోదరుని మర్మాహత వాక్యములు తార హృదయమును భేదించుచుండెను. తుదకు విధిలేక తనతో శంభూసింహుడు చెప్పినవిష యమును కాలూరాయని వాక్యములను ధనేశ్వరుని మనోవ్యథ నెఱిం గించి యిట్లనియె. అన్నా! నీవెన్ని చెప్పినను ధనేశ్వరుని విషయమై యాదుర్మార్గులు చెప్పినంత దౌష్ట్యముండునని నేను నమ్మజాలను. ఇతని రహస్యమేదియో వారు గ్రహించి బెదరించు చున్నారని నాతలంపు.

మల్హారరావు యోజనామగ్నుడయ్యెను. షట్చక్రదళము చెప్పిన మాటలనే కాలూరాయి-శంభూసింహుడుకూడ చెప్పియుండు టచే సంశయము మరియు బలమగుచున్నది. ఇతరులకు తెలియని విష యములు వీరికెట్లు తెలిసినవి? వీరికి పరస్పర సంబంధమెట్లు? శంభూ

సింహాన కీవివరమంతయు తెలిసియుండును. అతడు నివృత్తిచేయ గలడు. కాలూరాయి - షట్చక్రదళము - వీరల రహస్యము లెరింగి యుండును అని తలపోసెను.

మల్హా:—సరియేగాని తారా! శంభూ మదనజీతో కలసియుండ జూచితివా ?

తార:—చూచితిని. వారిర్వురును తరచుగ కలియుచుందురు. అతడు కూడ ధనేశ్వరునకు శత్రుకోటిలో వాడేనా?

మల్హా:—చెప్పజాలను. కాని శంభూసింహుడు-కాలూరాయి - ఇర్వురును ధనేశ్వరునిపై నొక విధమైన ప్రసంగమే చేసియున్నారు. ఇందువలన ధనేశ్వరునకు వీరితో పూర్వ పరిచయముండునని తలంచెదను. మరి శంభూ మదనజీతో కలసి తరుచుగ సంచరించు చుండుటవలన మదనజీ కాలూరాయియై తిరుగు చున్నాడేమోయని నాయనుమానము. కానిమ్ము. విమర్శన మీదగాని దీనిలోని రహస్యము బయటపడదు. రాత్రి చాల గడచినది. పోయి పరుండుము.

అని చెప్పి మల్హారరావు గదిలోనికిబోయి పరుండెను. తార - ధనేశ్వరునిగూర్చి పెక్కు విధముల తలపోయుచు తనగదిలోనికి బోయి పరుండెను.

8వ ప్రకరణము

(షట్చక్రదళము)

మరునాడుదయము మల్హారరావు శంభూ సింహుని గలసెను. ఇర్వురకును సద్భావములేకున్నను స్నేహితులవలెనే సంభాషించిరి. నాటిరాత్రి మల్హారరావువిషయమై తానొనర్చిన కార్యమున కాతని

మనస్సు మిక్కిలిలజ్జించుచుండెను. మాట్లాడునపుడు భయశంకా కులితు డగుచుండెను. మల్హారరావుయొక్క సూక్ష్మదృష్టికి శంభూ సింహుని హృదయభావము గోచరముకాకపోలేదు. మల్హారరావుతో నతనికి శత్రుత్వమేమియునులేదు. మరియు నతనిసహోదరియైన తారను పరిణయ మాడదలంచుచుండెను. అట్లయ్యును మదనజీ—గోవర్ధనుల కుట్రకులోబడి యతనిని హింసించుటలో బాల్గొనుచుండెను. అందువలన మనస్ఫూర్తిగ మాట్లాడశక్తుడు కాకపోయెను. ఇంతేగాక తన్ననుమానించుచుండెనేమోయని భీతికలిగెను చతురుడైన మల్హారరావు శంభూసింహుని కట్టియనుమానము కలుగకుండునట్లు నవ్వుమొగముతో మాట్లాడుచుండెను.

కొంతకాలము వారిర్వురు మాట్లాడుకొని విడిపోయిరి. శంభూ సింహునియొక్క మాటలలోని తొట్రుపాటును బట్టియు ముఖలక్షణమునుబట్టియు నాటిరాత్రి తనపైబడిన ఘాతకత్రయములో శంభూ ఒకడాయని సంశయము కలిగెను. కానితనయనుమానమును హృదయగోళమునుదాటి పైకిరానీయ లేదు.

దినమంతయు గడచెను. సంధ్యా సమయమున మల్హారరావు దుర్గాహోటలును సమీపించి ద్వారముకడ నిలువబడెను. వెంటనే యొక బండివచ్చి హోటలుముందు నిలిచెను. అందుండి నల్వురు పురుషులు క్రిందకుదిగిరి. వారిలో మొదటివాడు మధుసూదనరావు. మల్హారరావు మధుసూదనరావును చూచెను. మధుసూదనుడు తరుచు శివ నివాసమునకు వచ్చుచుండుటయు వెళ్ళునపుడు తారతో మాట్లాడుటయు కలదు. ఈ సంగతిని మల్హారరావెరుంగును. తత్కారణముననే మధుసూదను రాకకేమియు విస్మయపడలేదు.

మల్హారరావు సమీపించి నమస్కరించెను. కాని మధుసూదనుని యందు వెనుకటి ప్రసన్నభావము కానరాలేదు. ముఖవైఖరి మారి

నట్లు తోచుచుండెను. పరధ్యానముగ నున్నట్లుండి నమస్కారమందు కొనెను.

మధు:—నీవు కనబడితివా ? మేలయ్యెను. నేనిప్పుడు గొప్ప సంకటమున జిక్కుకొంటిని.

మల్హా:—మరల కాలూరాయి మూలముననే?

మధు:—లోనికిరమ్ము-సావధానముగ సంభాషింతము.

ఇర్వురు కలసి హోటలులోనికి వెళ్లి నిర్మానుష్యమైన యొక గదిలో గూర్చుండి మాట్లాడ నారంభించిరి.

మధు:—మల్హార్ ! నేను తిరిగి బందిపోటు జరిగినది. బందిపోటు దొంగలాక్రమించినారు అయిదువందల రూపాయలు పోయినవి.

మల్హా:—ఈ దుర్మార్గము కాలురాయనిదా ?

మధు:—కాదు. ఈసారి అయిదుగురున్నారు. అందరి ముఖమున ముసుగులున్నవి. వెనుక నొకసారి కాలూరాయి వలన సర్వస్వము గోల్పోయితిని. మరల ఎట్లెట్లో కష్టపడి నాల్గు రూపాయల కూడబెట్టుచుండ నీసారి అయిదువందలు పోయినవి. ఈదుర్మార్గమున కంతులేదా! కష్టపడి సంపాదించుకొనిన ద్రవ్యము ననుభవించుటకు ప్రాప్తిలేకున్నది.

మల్హా:—శాంతింపుడు. ఆదొంగలను బంధించుటకు మార్గమేమియు లేదా అని యోజించుచుంటిని.

మధు:—సంపాదించిన దంతయు వారికి ధారపోయుటతప్ప వేరు మార్గము కానరాలేదు. ఇంతతో పోయినదా! వారు ప్రదేశము నొకదానిని ఏర్పాటుచేసి నేటికి మూడవనాటికి ఒక వేయిరూపాయల నచ్చటికి గొనిరమ్మనియు లేకున్న నీకు చావు దప్పదనియు శాసించి పోయినారు.

మల్హా:—భయంకర వృత్తాంతము. కాని మీరొక్క పైసయైన నీయ వలదు. చూతము. వీరి బెదరింపు లెంతవరకు పనిచేయునో!

మధు:—ఇచ్చుటకు నాదగ్గర నేమియున్నది? మరణమునకు సిద్ధపడ వలసిన దే.

మల్హా:—వేయిరూపాయల దీసికొని యొంటిగ రమ్మనెనా? లేక యితరులెవరైనా—

మధు:—ఆవివరము నాకు తెలియదు. సర్దారు పిస్తోలును నాతలకు గురిచేసి యిట్లనియె. జాగ్రత్త. డబ్బు తెచ్చుట మరువకుము. తెలివితేటల నుపయోగించితివా? చచ్చితివనుకొనుము.

మల్హా:—సరిగనే చూతము. నిశ్చింతతోనుండుము. దానివిషయమై నేనుస్వయముగనాలోచించెదను. మీరుమాత్రమీవిషయము నితరులకెవరికిని తెలియనీయరాదు. నేనుమీకుతోడ్పాటు జేయు సంగతి ఒరులు వినగూడదు. జాగ్రత్త, ఇంకొకమాట. ఆ దొంగలు తమపేరేమైన జెప్పినారా?

మధు:—షట్చక్రదళమనుపేరు నొకదానిని చెప్పినారు.

మల్హారరావామాటనువిని యోచనామగ్నుడయ్యెను. కొంత తడవాలోచించి యిట్లనియె.

మల్హా:—మధుసూదనబాబూ! మీరిదివరలో మదనజీని కలసినారా?

మధు:—నాలుగైదుదినములక్రింద పూనాలో కలసితిని.

మల్హా:—సంభాషణము జరిగినదా!

మధు:—ఎక్కువ ఏమియునులేదు. మామూలు కుశలప్రశ్నలే. మన వ్యాపారము ముగిసినప్పటినుండియు నేనతనితో మనసిచ్చి మాటాడుటమానితిని.

మల్హా:—మీరుడబ్బుతీసుకొని శివనివాసమునకు ప్రయాణమైన సంగతిని మదనజీ కెఱుకపరచితిరా!

మధు:—ప్రయాణముసంగతి చెప్పితినిగాని డబ్బుమాట చెప్పలేదు. పట్టుతానులుగలకోట్లు విక్రయింపబడుచున్నవనివింటిని. అందు కొరకు వెళ్ళుచుంటినని చెప్పితిని.

మల్హా:—మదనజీని నేనింతవరకు కాలూరాయి వేషధారియని నే యనుమానించుచుంటిని. ఇప్పుడు షట్చక్ర సంచారకుడని కూడ యూహింపవలసి వచ్చుచున్నది.

మధుసూదనరావు త్రుళ్లిపడి ఇట్లనియె. మల్హారీ! ఇదంతయు నీయనుమానముగాని వేరుకాదు. నీవు మొదటినుండియు మదనుడే కాలూరాయి అని తలంచియుంటివి. ఈ యెనిమిదేండ్లనుండియు నీవిషయమును ప్రమాణముగా నిరూపింప జాలకుంటివి. నీయనుమానము ప్రమాదము, పొరబాటుగాని వేరుకాదు. షట్చక్ర నాయకుడనుట గూడ మిథ్యయని నాయభిప్రాయము. ఒక నిరపరాధి దండింపబడుట న్యాయముకాదు.

మల్హా:—నాయూహ-లక్ష్యము వ్యర్థము కాజాలదు. తగినంత నిదర్శనము లేకుండా-ప్రమాణములను సంగ్రహించకుండ-నేనెవరిని దండింపజేయ ప్రయత్నింపనని నమ్ముడు.

తదుపరి వారిద్దరకు మరికొంతకాల మితర విషయములను గూర్చి సంభాషణము జరిగెను.

పిమ్మట మధుసూదనరావు తారను జూడ నేగెను. మల్హారరావు వేరుపనిమీద వెడలిపోయెను.

9వ ప్రకరణము

దృఢచిత్తము

మల్హారరావు హోటలునుండి బయలు దేరునప్పటికి చీకటి పడెను. మధుసూదనుడు చెప్పిన విషయముంగూర్చి యోజించుచు నూరుదాటి నడచుచుండెను. నడచుచున్నకొలది ప్రాంత మందలి పర్వతపంక్తి సమీపించుచుండెను. మల్హారరావు బాటనుదాటి యొక పర్వతము క్రిందకేగెను. దూరమున వృక్షములచేత గప్పబడినట్లున్న గోవర్ధనుని కుటీరము గాన్పించెను. అందుండి సన్నని దీపపు వెల్తురు కూడ మినుకు మినుకుమని ప్రకాశించుచు గన్పట్టుచుండెను. వెంటనే పులిందయొక్క సుందరవదనారవిందము జ్ఞప్తికి వచ్చెను. తనగాయమునకు చికిత్సజేసి నప్పటినుండియు నతడా కరుణార్ద్రహృదయ-మహోదారచరిత్ర-సుందర బాలికయొక్క వదనారవిందమును మరువజాలక పోయెను. గోవర్ధనునివంటి వికృతాకారునకు-నరరూప రాక్షసునకిట్టి సౌందర్య ఖనియైన కుమార్తెయెట్లు జనించెను? ఆయమాయకురాలిపైనాతడు చూపించిన క్రౌర్యమును దలంచినకొలది నతనిహృతయమునకట్టి నీచుడు-క్రూరుడు నృశంసుడైన తండ్రికిట్టి దేవస్వరూపిణి యగు కన్యకయా? పులింద నిశ్చయముగ నతని పుత్రికయేనా? అను సందేహము కలిగెను. ఒక్కమారామె వదనమండలమును జూచు వాంఛ బలమయ్యెను. మెల్లగ కుటీరమును సమీపించెను. ఒక్కమారు నలుదిశలు సావధానముగా బరికించెను. విపత్తునకేమియు కారణముగాని సూచనలుగాని లేవని నిశ్చయించుకొనెను. కుటీరమునకు ముందుగాని చుట్టుప్రక్కలగాని యెట్టి ధ్వనియును లేదు. సాహసించి కుటీర ద్వారమును చేతుతోత్తటెను. వెంటనే తలుపులను తెరచుకొని పులింద యెదురయ్యెను. మల్హారరావును చూచుచుటవలన నామెహృదయ

కమలము సంతోషముచే ప్రఫుల్లితమాయెను. కాని క్షణకాలముననే యాసంతోష చిహ్నమునశించెను. నేత్రము లశ్రుపూరితములగుటచే తలవంచుకొని నిలువబడెను. మల్హారరావు సాహసించి పలుకరించెను.

మల్హా:—పులిందా! కుశలముగనుంటివా? మీతండ్రిఎచ్చటనున్నాడు?

పులిం:—కుశలముగ నేయుంటిని. మాతండ్రితో నేమిపని? ఎచ్చటికో పోయినారు.

మల్హా:—అతిథినై నచ్చిన నన్ను లోపలికి బిలువ దలచుకోలేదా?

పులిం:—(గద్గదస్వరముతో) ఈ భయంకర ప్రదేశమునకు మీవంటి వారురాకూడదు. గతించిన విషయమును దలంచిన మిమ్ము లోనికి బిలువభయమగుచున్నది. శీఘ్రముగ వెడలుట శ్రేయము.

మల్హా:—పులిందా! మొన్నటివృత్తాంతము నాకుక్రొత్తగాదు. ఇట్టి పరిస్థితులు నాకిదివరకెన్నియోతటస్థించినవి. ముందెన్నియో రానున్నవి. ఇంతమాత్రముననే భయపడవలయునా! నీతో కొంచెము కాలముమాట్లాడవలయునని వచ్చితిని. నావలననీకే మైన కష్టముగాని, అవమానముగాని కలుగునని భయమున్న స్పష్టముగ వచింపుము. నాసంకల్పమును విరమించెద. పులింద మనస్సిప్పుడు పరధ్యానమున నుండెను: అన్యమనస్కయై యుండి ఆమె రెండుమూడడుగులు వెనుకకునైచెను. మల్హార రావు దానినంగీకృతిగ దలంచి లోనప్రవేశించి తలుపును బంధించెను. పులింద సమీపమున నిలువబడియుండెను.

మల్హా:—నేనిచ్చటికి వచ్చుట వలన నీకెట్టివిపత్తుగాని, అపాయము గాని రాదుగదా!

పులిం:—నాకేమియు భయములేదుగాని నాతండ్రివచ్చినచో మీరు నిర్భయముగా నిరపాయముగ నిచటనుండి పోజాలిరని నా

యనుమానము. దైవేచ్ఛవలన నిన్న సురక్షితముగ మీరు వెళ్ళినను నేడట్టియవకాశము లభించుట కష్టమని నాకుతోచు చున్నది.

మల్హా:—నన్నుగూర్చిన చింతను వదలుము. కష్టముల నెదుర్కొనుట యే నాతలంపు. వచ్చినపని పూర్తిచేసుకొనక మరలువాడను గాను. నీవొనర్చిన యుపకారమును నాజన్మమధ్యమునమరువను. నీవైఖరిచూడ జీవితమునుచాల కష్టముగ గడపుచుంటివని తలంచెదను. కావుననీజీవితము సుఖమయమగుట కేమిచేయ వలయునో తెల్పితివేని నాశక్తికొలది ప్రయత్నించి నీకష్ట మును తొలగించెదను.

పులిం:—నేను దుఃఖినినని మీకెవ్వరనిరి? ఒకవేళ మీరే యూహించినచో నా యూహను పరిత్యజింపుడు. నేను నాప్రా రబ్ధమునమభవించుచున్నాను. దాని ననుభవింపకతప్పదు.

మల్హా:—ఇది యొకభ్రమ. ఇంతకును నీవీచెరనుండి విముక్తురాలవు కాదలంచుకొనలేదా ?

పులింద వదనమున విషాదచ్ఛాయ లలముకొనెను. చింతాభర స్వరముతో నిట్లనియె. అయ్యా! మీరుదయారస భరితులు నాక్షేమ ముకోరి చెప్పియున్నారని నేనెఱుంగుదును. కాని యదృష్టము నెది రించు సాహసము నాకు లేదు. అట్లుచేసినను లాభములేదు.

మల్హా:—పులిందా! నీతండ్రి స్వభావము నీస్వభావమును గుర్తించి తిని. నీవు దేవీస్వరూపిణివి కరుణామయివి. కోమల స్వభావవు. నీతండ్రి కేవలము రాక్షసుడు. పిశాచ స్వరూపుడు. అట్టి వానికి నీవు పుత్రిక వెట్లగుదువు? ఒకవేళ నాదస్యుని పుత్రిక

యైనను-నీవు సుగుణాల కుప్పవు. అట్టి దుష్టునితో నుండుట వలన చిరకాలము నీవు నీహృదయ కోమలమును-నీపవిత్రతను-నీసద్గుణ పుంజమును సురక్షితముగ నిలుపుకొన జాలవని నా యనుమానము. ఎంతవారికిని సహవాస దోషములంటకో మానవు. నేడు-ఆపన్నులను జూచి కన్నీరు నించు నీవు కొన్ని దినములు జరిగిన పిదప పరదుఃఖమునుజూచి సంతసింపగలవు. సాంగత్యదోషము మిక్కిలి చెడ్డది. ఆదోషపంకమున గూలితివా! వెలికివచ్చుట నీశక్తికి మించినపని. కావున సావధానవుకమ్ము. పడిపోవుటకు ముందుగనే యాత్మరక్షణోపాయము నాలోచించుకొనుము. నిన్న నన్నురక్షించితివి. నేడునిన్నుద్ధరింపవచ్చితిని.

పులిం:—ఆర్యా! క్షమింపుము. నాకర్మఫలితమును నేననుభవింప వలయును. నన్నువదలుడు.

మల్హా:—నీవుబుద్ధిమంతురాలవు. నిష్కారణముగ నాయుపదేశమును త్రోసివేయుచుంటివి. పోనిమ్ము. నీవిట్లుండుటకు వేరొకరహస్య కారణమేమైనగలదా?

పులిం:—ఏమియునులేదు. నాకుతెలిసిన దానిని వివరింపుచుంటిని. నేను గోవర్ధనసింహుని కుమార్తెను. దుష్టుడైనగానిండు విశ్వమున నాకాతనికన్న నాత్మీయు లెవరునులేరు. అందువలన నేను నాతండ్రిని వదలజాలను. వదలను.

మల్హా:—ఏమిటంటివి? నీవామహాపాతకుని సాహచర్యమును వలదవా?

పులిం:—అయ్యా! వ్యర్థవాక్యములతో ప్రయోజనములేదు. పితృనిందను వినజాలను. నాకుకష్టము గల్గింపక మీరు వెడలి పొండు. నాతండ్రి వచ్చువేళ యైనది.

మల్హా:—అట్లయిన నేనింకమీద నిన్నుజూడ రావచ్చునా?

పులిం:—రాకుండుటయే మన ఉభయులకుమ క్షేమము. మీహృదయము గంభీరమైనదనియు మీయుపదేశము లమూల్యము లనియు నేనెరుంగుదును. కాని నేను చేయగల్గినది లేదు. నన్ను మరచిపొండు. నేటినుండియు మన మిర్వుర మపరిచితులము. ఇంక వెళ్లుడు. ఇట్లు పల్కినందులకు క్షమింపుడు. ఒక్క క్షణమైన నిలువవలదు.

అనిపల్కి పులింద లోనికి బోయెను. మల్హారరావు వ్యథిత హృదయుడై కుటీరము దాటివెడలి పోయెను.

10 వ ప్రకరణము

—:కాలూరాయి కల్పనాచతురత:—

జాముగాత్రి దాటెను. శివనివాసగ్రామమంతయు నిశ్శబ్ద మగుచుండెను. ఊరిలో ప్రవేశించుటకు ముందొక-ఇటుకలతో కట్ట బడిన పాతయిల్లును దానికెదురుగ నొకవృక్షమును కలవు. వాని రెండింటిమధ్యనుండి సన్నిమార్గములోనికి బోవును. తత్సమయమున నొక పురుషుడామార్గమునుండి భీతచిత్తునివలె నలుప్రక్కల జూచుచు నడచుచుండెను. నలుప్రక్కల చీకటి వ్యాపించియుండెను. ఆకస్మిక ముగ నాపురుషున కడుగుల చప్పుడు వినపడెను. ఎవ్వరో బాట సారియై యుండునని తలంచి ప్రక్కకుతిరిగి చెట్టుచాటున దాగెను

వెనుకనుండి వచ్చుచున్న బాటసారి సమీపించుటయే తడవుగ చెట్టుచాటున దాగిన పురుషుడు వెనుకనుండి పోయి యాబాటసారిపై

బడి రహస్యముగ దాచిన పిస్తోలును పైకితీసి గురిచేసి యిట్లనెను. జాగ్రత్త. కదలవలదు. కదలితివా! ఒక్కదెబ్బతో ప్రాణములను గోల్పోయెదవు.

బాటసారి భయకంపిత స్వరముతో నీకేమ కావలయును? అని యడిగెను.

పురు:—దగ్గరనున్న ధనమునుచూపుము మొత్తమంతయు నిచ్చిన వేయుము. లేకున్న పిస్తోలు చూచితివా?

బాట:—ఈ మాత్రమునకేనా! ఇంతతొందరయా! మొదటనే చెప్ప కూడదా! ఇదుగో లెక్కపెట్టుకొనుము.

అని పల్కుచు బాటసారి జేబులోనుండి రూపాయలను తీసి చూపుచు లెక్కపెట్టుచుండెను. ఆక్రమకారియగు పురుషుడు లోభ దృష్టితో రూపాయలను జూచుచుండెను. బాటసారి తరుణము గని పెట్టి యాపురుషుని కంఠమును కుడిచేతితో గట్టిగపట్టి వెనుకకు త్రోసెను. ధనమును జూచుచు నజాగ్రత్తతో నుండుటవలన నాత్రోపు నకు 3 గజములు వెనుకకు పడిపోయెను. అట్లు పడుటవలన శిరమునకు గట్టిగ దెబ్బతగిలెను. దెబ్బతగిలినను సహించుకొని లేచి యొడలిపై నున్న దుమ్ము దులుపుకొనుచుండెను. ఇంతలో మన బాటసారి వానిని గట్టిగ బట్టి చల్లని వస్తువునొకదానిని గుండెలకానించెను. మొదటి వాడు తడిమిచూచి దానిని పిస్తోలని తెలుసుకొనెను. క్రిందపడుటలో తన పిస్తోలు ఎచ్చటపడెనో కానరాలేదు. తన యాయుధము వ్యర్థ మగుటయేగాక తిరిగి తనపై మరియొక రివాల్వరు ప్రయోగింపబడుట కతడు వెలవెలబోయెను. బాటసారి తనచేతి రివాల్వరును అట్లేపట్టి యుంచి శాంతభావముతో నిట్లనియె. మిత్రమా! దయచేసి నిలువబడు ము. చెప్పినట్లు వినవేని నాచేతి రివాల్వరు నీజీవితమును గైకొనును.

మొదటివాడు లేచి నిలువబడి మన బాటసారింజూచి నన్ను క్షమింపుము. ప్రాణము తీయవలదు అని పల్కెను.

బాట:—నీవు బందిపోటు దొంగవా?

దొంగ:—కాదు. కాను. ఇంకమీద దొంగనుగాను.

బాట:—బాటసారులను దోచుకొన వలయునను బుద్ధి ఇంత శీఘ్రముగా మారిపోయినదా?

దొంగ:—నీ ముఖమునగల ముసుగునుజూడ నా కనుమానముగల్గుచున్నది. మరియు నీవు సహజమైన కంఠధ్వనినిమార్చి పల్కుచున్నట్లు తోచుచున్నది. చూడగా నీవుగూడ మావృత్తికి సంబంధించిన వాడవేమోయని తలంచుచున్నాను.

బాట:—నేనెల్లప్పుడును ముసుగుతోనే దిరుగుచుందును. నన్ను నీవు గుర్తించ లేదా?

దొంగ:—లేదు.

బాట:—నా పేరు కాలూరాయి.

పేరు వినినంత దొంగ కమితభయము కలిగెను. ఓహో! ప్రమాదము. భయంకర చోరాగ్రేసరా! నన్ను రక్షింపుము. నీసంగతి నెఱుంగక ఎవరో పథికుడని తలంచితిని.

బాట:—(నవ్వుచు) నీసామర్థ్యమింతయే ట్టణములు మొదలు కుగ్రామములవరకు నెవరిపేరు విని గడగడ వడకుచుందురో యట్టి కాలురాయినగు నన్నే దారిగాచి దోచుకొన దలంచితివే? సోదరా! నీపేరేమి?

దొంగ:—నా పేరు రామేశ్వరుడు.

కాలూ:—నీవు షట్చక్రదళమునకు సంబంధించిన వాడవా,

రామేశ్వరుడు త్రుళ్లిపడెను. ఇది యెక్కడి సంకటమాయని విచారించుచుండెను.

కాలూ:—నామాటలను వినుము. నీవు షట్చ్రక్రదళమునకు సంబంధించినవాడవైనచో వారందరితోనిట్లు చెప్పుము. మీదళమునకు సంబంధించిన వారెవ్వరును నావైపునకు రాకూడదు. శివనివాసము నాదృష్టిలోనున్నది. ఆగ్రామమునుగూర్చి మీ రాసపడగూడదు. మీ గుంపంతయు గలసి మరియొక ప్రదేశమును వెదకికొనుడు. మరియొక సంగతిని వినుము. నేటివరకు నాశరీరమున జేయివైచినవాడు సురక్షితముగ దాటిపోలేదు.

రామే:— వలదు. వలదు. నన్ను వదలుము. నీవు దొంగలకెల్ల రాజవు. నావంటి క్షుద్రప్రాణినిజంపి నీచేతికి కళంకముగల్గించుకొనవలదు. రక్షింపుము. ఇంకమీద నీనీడనైన చ్రొక్కను.

కాలూ:—నీకు ప్రాణములపై యాసగలదేని నేను చెప్పినట్లు చేయవలయును. అట్లొనర్చిన నిన్ను రక్షించెదను.

రామే:— చెప్పుము. నీయాజ్ఞను పాలించుటకు సంసిద్ధుడనై యున్నాను.

కాలూ:—నీవు నావలెనే వేషమును ధరించి దుర్గాపూరోటలునకుబోయి నేనే కాలూరాయినని చెప్పుము!

రామే:—అక్కడనున్న వారు నన్ను బంధింపరా?

కాలూ:—ఆమాటనుచెప్పినవెంటనే పారిపొమ్ము.

రామే:—ఒకవేళపట్టుబడిన యెడల?

కాలూ:—పట్టుబడిన వారిచేత జచ్చెదవు. నేనుచెప్పినట్లు చేయకున్న నాచేత జచ్చెదవు. ఎట్లయినను తప్పదు. కాని నేను చెప్పినట్లు చేసితివేని తప్పించుకొనుట కవకాశములభించును. ఆయుర్దాయమున్న బ్రదుకగలవు.

రామే:—నాకాదుస్తు లెట్లులభించును?

కాలూ:—ఇదిగో దీసుకొనుము.

తనముసుగులోనుండి నల్లని దుస్తులను తీసి రామేశ్వరుని చేత నుంచెను. రామేశ్వరుడు ప్రాణముల నరచేతబట్టుకొని రామనామ ధ్యానము జేయుచు దుర్గాహోటలునకు బోయెను.

తత్సమయమున దుర్గాహోటలులో జాము రాత్రిగడచి రెండవ జాము ప్రవేశించుటచే చిరస్థాయిగ నున్నవారును కాలోచితముగ వచ్చిన పరదేశీయులుకూడ భోజనాదికముల దీర్చుకొని క్రిందశాలలో నొకప్రక్కనాసీనులైయుండిరి. కొందరు ధూమపానమును-మరికొందరు తాంబూల సేవనమును-కొంతమంది యిష్టసల్లాపమును జేయుచుండిరి.

ఇంతలో సింహద్వారమునుండి యొక పురుషుడు నల్లని ముసుగుతో ప్రవేశించెను. చేతపిస్తోలును ధరించి గంభీర స్వరముతో నిట్లనియె. మహాశయులారా! మీలో నెవరైన కాలూరాయనిజూడ దలంతురేని మీపాపపుకన్నులతో జూచి నేత్రములను సఫలము జేసికొనుడు.

అచ్చట గూర్చున్న వారందరొక్కమారు త్రుళ్ళిపడి చూచిరి. అందరి నోళ్లనుండియు, కాలూరాయి అనునామము బయలుదేరెను. అట గూర్చున్నవారిలో ముందుగా నొకడు బయలుదేరి కాలురాయి వేషధారిపై బడనేగెను. అతనివెంట మిగిలినవారందరును బయలుదేరి పోయిరి. క్షణకాలములో దుర్గాహోటలంతయు జనశూన్యమయ్యెను. ఆముందువెళ్లిన పురుషుడు పాఠకులకు పూర్వపరిచితుడగు మల్హారరావు.

నిజమైన కాలూరాయి చీకటిలో నొకప్రదేశమున దాగియుండి అందరువెళ్లిన తదుపరి మేడమీదకు బోయెను. తత్సమయమున ప్రధాన కర్మచారియైన సోమేశ్వరపాండ్యా తనగదిలోనుండి వేరొక

చోటికి పోబోవుచుండ కాలూరాయి తటాలున ద్వారము నడ్డగించెను. సోమేశ్వరుడాశ్చర్యముతో "కాలూరాయి" అనిపల్కెను.

కాలూ:—(పిస్తోలుగురిచేసి) నన్ను గుర్తించితివా?

సోమే:—గుర్తింపకేమి? మొన్నటిదినమున నీవు కొట్టినదెబ్బను మరతు మన్నను మరపురాలేదు. లేకున్న నిన్ను పట్టుటకందరును పరువెత్త నేనిట్లూరకుందునా?

కాలూ:—చాలబుద్ధిమంతుడవు. కాలూరాయిని బట్టుకొనుటకై పరుగెత్తిరి. కాని, నేను నిజమైన కాలూరాయిగాను. నేనేవాని కట్టి వేషమునువైచి పంపితిని. వాడొకవేళ పట్టుబడినయెడల నీవు వారితో యథార్థమును చెప్పి నిజమైన కాలూరాయినగు నేనులోపలికివచ్చి వెళ్లిపోయినని చెప్పుము. జాగ్రత్త! చమత్కారము నుపయోగపరచితివా! నీప్రాణములు నీవి కావు. ఇంక నీదారిని నీవుపోవచ్చును.

సోమేశ్వరుడు వేరొకగదిలోనికేగెను. కాలూరాయి నిర్విఘ్నముగ తనకార్యమును దీర్చుకొననేగెను.

సుమారు ఇరువది నిముసములకాలము గడచునప్పటికి కాలూరాయి వేషధారిని వెన్నాడిన వారందరు తిరిగివచ్చిరి. సోమేశ్వర పాండ్యావచ్చి కాలూరాయి చెప్పిన సంగతి యంతయు దెలియపరచి మరియు నిట్లనియె. కేకలువేయుటకైనను నాకాతడు సమయ మీయక పిస్తోలుచూపించి నాకు వాగ్బంధనము గావించినాడు.

సోమేశ్వరుని మాటను వినినవెంటనే అటనున్నవారెల్లరు తమ సామానులను జూచుకొన గదులలోనికేగిరి. చూడగా తేలినసారాంశమేమి? కొందరి విలువగలవస్తువులు పోయినవి. మరికొందరి సొక్కము పోయినది. మరికొన్ని వెండి బంగారపువస్తువులు పోయినవి. అన్నిటికన్న

పెద్దవి శేష మింకొకటిగలదు. మధుసూదనరావు గదిలో నచేతనుడై యుండెను. మల్హారరావు మరికొందరును సమీపించి యుపచారములు సల్పుచుండిరి. కొంతసేపటికి తెలివివచ్చిచూడ మల్హారరావు ప్రక్కను గూర్చుండి యుపచారములు సల్పుచుండెను. తెలివివచ్చుట గనిపెట్టి మల్హారరావు పలుకరించెను.

మల్హా:—మధుసూదనబాబూ! ఎట్లున్నది? మీకీస్థితి యెట్లుకలిగినది? ఇందులకుగూడ కారకుడు కాలూరాయి అని తలంచెదను.

మధు:—ఏమి జరిగినదో నాకు తెలియదు. నేను ద్వారమువైపునకు వెన్నుంచి కూర్చుండి వ్రాసుకొనుచుంటిని. వెనుకనుంచి అడుగుల చప్పుడు వినబడినది. నీవు వచ్చుచుంటివని తలంచి వెనుకకు తిరిగితిని. ఆకస్మికముగ నెవ్వరో నాతలపై గట్టిగా కొట్టిరి. తలతిరిగి పడిపోయితిని. తదుపరి యేమైనదో నాకు తెలియదు. ఇచ్చటికి కాలూరాయి వచ్చినాడా?

మల్హారరావు జరిగిన సంగతినంతయు తెలియజేసి మీతాలూకు వస్తువు లేమైనా పోయినవేమో చూచుకొనుడని హెచ్చరించెను.

మధు:—ఎత్తుకొని పోవుటకు నాదగ్గర నేమి మిగిలినది. ఉన్నదంతయు చోరుల కప్పగించితిని. ఇంతమంది పోలీసువారు, పరిశోధకులు కనిపెట్టియున్నను దుర్మార్గుడైన కాలూరాయివచ్చి యిట్టి భయంకరకృత్య మొనర్చెననిన నింకేమనవలయును? తుదకు వీరందరాతనిబట్ట నసమర్థులని తేలినది.

మల్హారరావు శిరఃకంపము జేయుచు నచటినుండి క్రిందకు వచ్చుచుండ సింహద్వారముకడ ధనేశ్వరు డెదురయ్యెను. ఇంతవర కెచ్చట నుంటివని ధనేశ్వరు డడిగెను.

ధనేశ్వరుడు వెంటనే ప్రత్యుత్తర మిచ్చుటకు శంకించెను. ఒక నిముషమాగి కొంచెము పనియుండి వెలుపలికేగితిని అనెను.

మల్హా:—నీవు కాలూరాయుని చూడలేదా?

ధనే:—నేనెట్లు చూడగలను?

లోపలనుండి సేవకుడొకడువచ్చి దొంగ వెళ్లిన తరువాత ధనేశ్వరుడు వచ్చెనని మల్హారరావుతో తెలిపెను. ఆమాటతో ధనేశ్వరుని ముఖము సంకుచితమయ్యెను.

మల్హా:—(ధనేశ్వరునితో) నీ వెచ్చటికి వెళ్లితివి?

ధనే:—తూర్పువైపునకు వెళ్లియుంటిని.

మల్హా:—త్రోవలో నిన్నెవ్వరును కలిసికొనలేదా?

ధనే:—లేదు. నన్నిట్లు ప్రశ్నించుటకు కారణమేమి?

మల్హా:—ఏమియును లేదు.

ఇర్వురును చెరియొకవైపు వెడలిపోయిరి. ధనేశ్వరుని ప్రవర్తనమును బట్టియు సంకుచితభావమునుబట్టియు మల్హారరావున కతనిపై సంశయము వృద్ధికాజొచ్చెను. కాలూరాయితో నితనికేదియో సంబంధముండితీరవలయును. కావున నితనిపై సొకకన్నుంచవలయు నని నిశ్చయించెను.

11వ ప్రకరణము

—: ధనేశ్వరుని సంకటము :—

రాత్రి రెండుయామములుదాటినది. దుర్గాహాటలులో నందరును తమతమగదులలో నిద్రించుచుండిరి. సింహద్వారము బంధింపబడియుండెను. ప్రతిప్రాణియు నిద్రాబద్ధమైయుండెను. ధనేశ్వరునకు

దగ్గరకు బోయిచూడ తలుపు కొంచెముగ తెరువబడియుండెను. సందు లనుండి తొంగిచూడ దీపపు వెల్తురున నిర్వురు పురుషులు జూద మాడు చుండిరి. ధనేశ్వరుడు వారిర్వురినిగు ర్తించెను. వారిలో నొకడు గోవర్ధనుడు, రెండవవాడు తనకు ప్రతిద్వంద్వియై తనప్రేమైక నిధాన మైన తారాపాణిగ్రహణమునభిలషించుచున్న శంభూసింహుడు. శంభూ శివనివాసమందలి యొక గౌరవనీయ వ్యక్తికి మేనల్లుడు. అట్టి వాడీ నీచునితో గూడి ద్యూతమాడుట యా? శంభూసింహుని వెనుకటి స్థితినిదలంచి ప్రస్తుత నూతని కార్యక్రమమును జూచునప్పటికి ధనే శ్వరున కసహ్యము కలుగుటయేగాక సప్పోహుండ నచ్చెను. కాలుకదల్పక గట్టిగ నిట్టూర్పైన విడనక ద్వారముకడ నుండి వారిమాటలను వినదలంచెను.

లోపల పందెములపై పందెములు పడుచుండెను. శంభూ సింహుడు నూటికినూటికి నోడిపోవుచుండెను.' తనదగ్గిరనున్న ధన మంతయు ఖర్చుపడినది. ఇంకవిరక్తిపుట్టుటచే నిట్లనియె.

శంభూ:—ఈదినమున నీకు చాలలాభముకలిగినది. ఆట చాలింతము.

గోవ:—నాకు నష్టమేదినమున కలిగినది? ఒక్కనాడైన నీవు నన్నో డింపగల్గితివా ?

శంభూ:—నేనోడిపోవుచుంటిని గనుక నే నీకు దినములుగడచుచున్నవి. నీపొట్ట నేటికిఁబడుచున్నది. లేకున్న నీపనియేమగునో ?

గోవ:—ఎన్నటికి నట్లుదలపకుము. ఇతరులసహాయము నాకక్కర లేదు. భగవంతునిదయవలన నాకొక నిక్షేపము దొరకినది. నాకు కావలసినధనము నందుండి తెచ్చుకొని జీవితము గడుపు కొనగలను.

శంభూ:—నేనీసంగతి నితరులవలన వింటిని. గాని నమ్మలేను. నీకా ధనము దొరకి యెంతకాలమైనది?

గోవ:—సుమారు ఆరుసంవత్సరములక్రింద.

శంభూ:—అనగా 1925 సం॥రము వైశాఖమాసములో.

పల్కిన మాటను వినునప్పటికి గోవర్ధనుని కన్నులెఱ్ఱబడెను. నిదానించి శంభూసింహుని ముఖమును వీక్షించుచుండెను. శంభూ దానినిగమనింపక నిట్లనియె. ఏనాడు పూనాలోని గోపాలరావు మధుసూదనరావుగార్ల కంపెని ఖజానాకు రు 150000లు కాలూరాయిచేతికి జిక్కినవో యానాడే నీకీనిక్షేపము లభించినదా?

గోవ:—నీవిట్లేల మాట్లాడుచుంటివో? నీయభిప్రాయమేమో నాకర్థము కాలేదు?

శంభూ:—అర్థము కాలేదా! అనుమానపడకుము. మాటవరుస కనుచుంటిని. నేను విన్నదానినిబట్టి సమయము నిర్ధారణ మొనర్చితిని. కాలూరాయి ధనమును కొల్లగొట్టుటయు నీకు నిక్షేపము దొరకుటయు నొకసమయముననేగదా!

గోవ:—అట్లయిన నేనే కాలూరాయినని నీయభిప్రాయము. శంభూ మాటాడక నవ్వుచుండెను. గోవర్ధనుని దృక్కులు మారిపోయెను. ముఖము వికృతమయ్యెను. కన్నులు చింతనిప్పులవలె నెఱ్ఱబడెను. ధనేశ్వరున కతని భావసంచలనముచూడ మనస్సు భీతికలిగెను.

గోవ:—శంభూ! జాగ్రత్త. ఇట్టిమాట నింకమీద నెన్నడును పలుకవలదు. నీతలంపుచూడ నన్నే కాలూరాయియనిచెప్పి పోలీసులకు పట్టీయ దలంచితివని తెలియుచున్నది.

శంభూ:—నీవొకదినమున నాతో నే నేపరిశోధకుడనైన యెడల గోపాలరావు మధుసూదనరావుగార్ల ధనము నొక్కనిముసములో తెప్పించనాయని పల్కియుంటివిగాదా?

గోవ:—మరల నదేమాటయా! నీవునన్నురికంబమున కెక్కించిగాని శాంతిజెందవు కాబోలు.

శంభూ:—మిత్రమా! భయపడకుము. నేనీరహస్యము నెవ్వటికిని బయల్పరచను. నామాటను నమ్ముము.

గోవ:—వెల్లడిచేసితివా చచ్చితివని తలంపుము. కాలూరాయికి నాకు నేమిసంబంధము? వాని నెవ్వరు గుర్తింపగలరు?

శంభూ:—గోవర్ధనా! నామాటనువినుము. నాకిప్పుడు సమయము బాగుగాలేదు. చేతపైకము లేక చాలకష్టపడుచుంటిని. నీకు లభించిన దానిలో నాకుగూడ కొంచెము భాగమొసంగుము. మిత్రునకు కష్టకాలమునందోడ్పడుము. తరువాత ఈ రహస్యము బ్రహ్మయైన తెలిసికొనజాలడు. చిక్కు తీరిపోవును.

గోవర్ధనుడు తటాలున బొడ్డునగల కత్తినితీసి యిట్లనియె. నీగుండెలలో దీనిని గ్రుచ్చినయెడల నన్నిచిక్కులు తీరిపోవును. తెలిసినదా?

గోవర్ధనునియాకారము భయంకరమైపోయెను. వెలుపలనుండి కనిపెట్టియున్న ధనేశ్వరునకు కాలుసేతులు వడకుచుండెను. గోవర్ధనుని ప్రకృతి నెరింగియున్న శంభూసింహుడు జాగ్రత్తపడినే నిల్చుండెను. ప్రక్కను బడియున్న బలమైన లాటీకర్రను చేతబట్టి యిట్లనియె. గోవర్ధనా! జాగ్రత్త. నీస్వభావము నెఱుంగని వాడనుగాను! నీకత్తినిజూచి భయపడి నీపాదములపై పడెదనని తలంచితివి కాబోలు.

గోవర్ధనుడు కోపముతో గ్రుడ్లురిమి చూచుచుండెను. శంభూ వానికెదురుగ స్థిరదృష్టితో జూచుచు నిల్చుండెను. ఇంతలో మరియొక సంగతి జరుగుటచే వారిద్దరి ముఖములు మారిపోయెను.

ధనేశ్వరుడు బలవంతుడేగాని బుద్ధిబలముతక్కువ. లోపలి కలహమును జూచుచు శ్వాసనుసైతము బంధించి నిల్చుండెనేగాని వెనుక చూపులేదు. ఆకస్మికముగ నెవరో వెనుకనుండి యతనిని ముందుకు పశువట్లు తన్నుటచే ధనేశ్వరుడు శరీరము లోపలిభాగమునకువచ్చి పడిపోయెను. శంభూ-గోవర్ధనులు భ్రాంతచిత్తులై చేతిలోని యాయుధములను క్రిందబడవైచి చూచుచుండిరి. నూతనపురుషుడు లోనికరుదెంచి తలుపునుబిగించి పిస్తోలును చేతధరించి నిల్చుండెను. ధనేశ్వరుడు క్రిందపడిన వెంటనే లేచి ఒడలుమలుపుకొని చూడగా తన్ను పడద్రోసిన వ్యక్తి మదనజీయని గ్రహించెను. శత్రువులు మువ్వురుండుటయు నాయుధహస్తులై యుండుటవలన తనబలప్రయోగము వలన లాభము లేదనియు, తనయజాగ్రతకు ఫలితమనుభవింప వలయు ననియు, దుఃఖించియూరక నిల్చుండెను. మదనజీ కర్కశస్వరముతో నిట్లనియె.

మూర్ఖుడవలెను. పారిపోవుటకు ప్రయత్నించితివా ? చచ్చితివి. జాగ్రత్త.

గోవ:—జరిగిన సంగతియేమి ? ఇతడెవరు ?

మద:—ఏమియును లేదు. ఈపురుషుడు ద్వారమున పొంచుండి మీ మాటల నాలించుచున్నాడు.

గోవ:—(కత్తిదీసి) నీచుడు- దొంగ- గవర్నమెంటుగూఢచారి. పొడిచివేయుము. ముక్కలు క్రిందనరుకుము.

మద:—ఆగుము. ఇతడు చెప్పనదేమో వినవలయును. ఓయీ నీవింతయర్ధరాత్రివేళ నీయింటివాకిటదాగి మాటల నాలకించు చుండుటకు కారణమేమి?

ధనే:—నే నీతో ప్రవనుబోవుచుండగా దీపముకనపడుటచే నింతరాత్రి వేళ నీగారవనీయ వ్యక్తు లేమిచేయుచుండిరో తెలిసికొన కుతూహలము కలిగి నిల్చుంటిని.

మద:—నీవటకువచ్చి యెంత కాలమైనది.

ధనే:—ఇప్పుడేవచ్చితిని. ఇంకను మూడునిముసములైన కాలేదు.

మద:—అబద్ధము. నేను వేరుపనిమీద వచ్చుచు వాకిట నిన్నుజూచి నీవెనుకనే దాగియుంటిని. అయిదునిముసములుజూచి నీకుర్చ్రు దిసి గ్రహించితిని. అంతకుముందెంత కాలమైనదో? సందేహము లేదు.

గోవ:— సందేహము లేదు. ఇతడు నామాటలన్నియు విన్నాడు. శంభూ! చూచితివా? నీవలన నెంతయనర్ధము సంభవించినదో గ్రహించితివా?

శంభూ:—భయమేమియును లేదు. గోవర్ధనా! తలపెట్టినపని పూర్తి గానిమ్ము. తదుపరి భయమున కవకాశము లేదు.

శంభూ ధనేశ్వరుని గుర్తించెను. వీనివలన తార తనకు స్వాధీనము కాలేదు. కాన వీనినిటతుద ముట్టించిన తనసంకల్పము నెఱవేరును. అనితలంచి ధనేశ్వరునిజంప గోవర్ధనుని బ్రోత్సహించెను. గోవర్ధనుడు శంభూ పల్కినమాటలోని రహస్యమును గ్రహించి చేతనున్న కత్తితో ధనేశ్వరుని పొడుచుటకై మీదకువచ్చుచుండెను. ప్రక్కగదిలోనుండి ఆగుము చంపవలదు. అనుపల్కులు వినబడెను. వెంటనే శరవేగమున పులిందవచ్చి తండ్రికిని ధనేశ్వరునకు మధ్యనిలువబడెను.

సనశ్వరముతో నిట్లనెను. వలదు. నరహత్యను నేను చూడజాలను. చంపవలదు.

గోవ:—రాక్షసీ! పిశాచినీ! పొమ్ము. నిన్నిచ్చట కెవ్వరు రమ్మనిరి. పొమ్ము. లేకున్న వానినేగాక నీప్రాణములగూడ దీసివేసెద.

పులిం:—చంపెదవా? ఇదిగో సిద్ధముగనున్నాను. ముందునన్ను చంపి యాపురుషుని వధింపుము. స్త్రీహత్యాపాతకమునకు సిద్ధపడు చుంటివా? రమ్ము. నన్ను జంపక పతిని చంపజాలవు. రాతిగుండెలుకల శంభూ మదనుల కిర్వురకును పులింద వాక్యములను విన హృదయము చలించెను మారాడక నిలుపబడిరి.

ధనే:—సుందరీ! నిష్కారణముగ నాకొఱకు నీప్రాణముల నేలగోల్పో యెదవు? తొలగుము. నేను మరణించుటకు సిద్ధముగ నుంటిని. నన్నొంటిగ మరణింపనిమ్ము.

గోవర్ధనుడు పులింద నావలకుద్రోసి ధనేశ్వరుని జంపనెంచు చుండెను. గోవర్ధనుని యాపుట తనశక్తికి మించినపనియని యామె తలంచెను. పాప మాదీనుని రక్షించుటెట్లాయని తలపోయుచుండ గోవర్ధనుడామెనావలకు ద్రోసెను. పులింద వెనుకకుబడుటయే తడవుగ బల్లపై వెలుగుచున్న వత్తిని కాలితోత్రోసివేసి తనగదిలోనికి బోయెను. ఆమెయుద్దేశ్యము దీపము నార్పినచో నాయువకుడు చీకటిలో నాత్మసంరక్షణ మొనర్చుకొనగలడనియే.

కుటీరమంతయు చీకటికోణమయ్యెను. పులింద తనగదిలోనికి బోయి కూలబడెను. జరిగిన భయంకర పరిదర్శనమువలన నామెకు స్మారకము తప్పియుండును.

---

12 వ ప్రకరణము

—: తారా + పులింద :—

మరునాటి ప్రాతఃకాలమున దుర్గాహోటలులో నందరును మేల్కాంచిరి. ధనేశ్వరుడు లేవలేదు. సేవకుడొకడువచ్చి ధనేశ్వరుడు పరుండు గదితలుపులు తెరువబడియున్నవి. కాని యతడు లేడని యట నున్న వారితో చెప్పెను. క్రమముగ నీవార్త హోటలులోనున్న ప్రతివానికిని తెలిసెను. మదనజీకూడ నటనుండెను. ధనేశ్వరుని యంతర్ధానమును విని ఎచ్చటికో బోయెను రాగలడని వచించుచుండెను.

మదనజీ చెప్పినమాటల నందరువిని యూరకుండిరిగాని మల్హారరావునకు మాత్రము సందేహము కలిగెను. ధనేశ్వరుడు పారిపోయి వచ్చిన ఆసామీ (నేరస్థుడు) అయియుండును. రాత్రి కాలూరాయి వేషమున హోటలులో ప్రవేశించి సోమేశ్వరునితో నబద్ధములాడి చేతికిజిక్కినంతవరకు స్వాధీనము జేసికొని తానటనుండిన రహస్యము బయల్పడునను భయముతో తన కాలూరాయి వేషమును పారవేసి పారిపోయెను. అంతియేగాని రాత్రివచ్చిన యిరువురిలో నొకరును నిజమైన కాలూరాయి కాదని మల్హారరావు తలంచుచుండెను. రాత్రి తాను ధనేశ్వరుని వెన్నాడి యతడొనర్చిన కార్యమును కన్నులార గాంచుటచే యతనిసందేహమిదేవిధముగ దృఢపడుచుండెను. ఇంతలో హోటలులోని ద్వితీయకర్మచారియైన సోమేశ్వర పాండ్యావచ్చి శంభూసింహుని చేతికొక కాగితమునిచ్చి యిట్లనియె. ఈకాగితము ధనేశ్వరుని శయ్యపైనున్న తలగడక్రింద దొరికినది. తీసికొని వెళ్లుట మరచి యుండవచ్చును.

ఆకాగితమేమనగా షట్చక్రదళము ధనేశ్వరునకు బంపినజాబు. శివనివాసము వదలివెళ్లుము. లేకున్న నీప్రాణములు పోవునని వ్రాయబడియున్నది. మల్హారరావు దానినిదీసికొని చదువుకొనెను. వెంటనే యతని వెనుకటి యభిప్రాయమంతయు మారిపోయెను. ముఖము గంభీరమయ్యెను నిష్కారణముగా శంకించితినని తలంచెను. వెంటనే యటనుండి బయలుదేరి పోవుచుండగా శ్రోత్రియ మిఘువా యెదురయ్యెను. మల్హారరావు ధనేశ్వరుని సంగతియంతయు నెఱుకపరచెను.

మిఘు:— నేనుతలంచినది నిజమైనది. అతడు చంపబడినాడు.

మల్హా:— ఆఁ! ఏమంటివి? ధనేశ్వరుడు చంపబడినాడా! నీకెట్లు తెలిసినది?

మిఘు:— ప్రాతఃకాలము కాకమునుపు నేను కొండదగ్గరనున్న జలపాతము వైపుగా పోవుచుంటిని. కొన్నిగజముల దూరములో నొకడు కొండక్రిందిభాగమున త్రవ్వుచుండెను. గోతియొక్క స్వరూపమునుబట్టి యొకచంపబడిన మనుష్యుని పూడ్చుటకే యని నిశ్చయించితిని.

మల్హా:— గోతిని త్రవ్వుచున్నవారెవరో గుర్తించితివా?

మిఘు:— గుర్తింపలేను. దూరమగుటచేతను-ఇంకను బాగుగా తెల్లవారక పోవుటచేతను గుర్తింపజాలక పోయితిని. కాని ఆస్థలము నుచూపగలను.

మల్హా:— నాకాప్రదేశమును చూపుము.

ఇర్వురుకలసి నియమిత స్థానమునకు జేరిరి. మట్టినిజూడగా గోయి క్రొత్తగాత్రవ్వినట్లున్నది. మల్హారరావు మిఘువా చేతిలోనికుపాకిని తీసుకొని దానియంచుతో మట్టికుప్పను తొలగించ నారంభించెను. కొంచెముకాలముననే గోయిబయట పడినదిగాని అందులో శవమేమి

యును లేదు. నెత్తురుతో తడిసిన గుడ్డపీలకలుమాత్రమున్నవి. మల్హార రావు నిస్పృహుడయ్యెను.

మల్హా:—మిచువా! ఆమనుష్యులు నిన్నుగుర్తించిరా?

మిచు.—చెప్పజాలను.

మల్హా:—నిన్నుచూచిరని యే నాయభిప్రాయము. నిన్నుచూచి గుర్తించుటచేతనే ఇందలిశవము వేరొకచోట పూడ్చబడినది. కాని అది ధనేశ్వరుడనుట కేమిప్రమాణము? మరియొకరిది కాగూడదా?

ఆలోచించుకొనుచు నిర్వురుకొండదిగిరి. వెంటనే మల్హార దృష్టి గోవర్ధనుని కుటీరముపై బడెను. ఆకళేబరము ధనేశ్వరుని శరీరమే యైనచో నీకార్యముతో గోవర్ధనునికేమయిన సంబంధముండునేమో తెలిసికొనవలయును.

మల్హా:—మిచువా! నీవిచటనే యుండుము. నేనొకసారి గోవర్ధనుని గుడిసెలోనికి బోయివచ్చెదను

మల్హారరావు దూరముననుండిచూడగా పులింద ద్వారముకడ నిలువబడియుండెను. క్రమముగ గుడిసెను సమీపించెను. ద్వారముకడకేగి చూడ తలుపు తాళము వేయబడియుండెను. పులింద కానరాలేదు. పేరుపెట్టిపిలిచెను. చుట్టుప్రక్కల వెదకెను. కాని యామె కనపడకపోవుటచే తిరిగి మిచువాను సమీపించెను. వారిర్వురును ప్రస్తుతాంశమునుగూర్చి తలపోయుచు వెడలిపోయిరి.

ఇంటికిజేరినతదుపరి మల్హారరావు తారకు యావద్వృత్తాంతమును తెలియజేసెను. ఆమెయొక్క మనోవేదన కంతులేకుండెను. త్రికరణశుద్ధిగ ధనేశ్వరుని వరియించియుండుటచే ధనేశ్వరుని మరణవృత్తాంత మామెకు పరమదుఃఖకరమయ్యెను. పావుగంటకాలము

గడచిన పిమ్మట తార లేచి కన్నుల నీరు తుడుచుకొని యొక ముతక వస్త్రమును దీసి శరీరము నిండ గప్పుకొని మేలిముసుగు వైచుకొని బయలుదేరెను.

మల్హారరావు వెళ్లిన తోడనే పులింద ద్వారమును దీసి లోన ప్రవేశించెను. ఆమె కన్నుల నుండి దుఃఖబాష్పము లవిరామముగ గారుచుండెను. గన్నులను దుడుచుకొని ముందునకు జూడ కట్టెదుట నొక సుందరి నిలువబడి యుండుట గనుగొనెను. పులింద యామెను కూర్చుండు మని చెప్పక మునుపే తార యట నున్న బల్లపై కూర్చుండెను.

తార:—ద్వారము నీవారు బంధింప లేదు. కారణ మేమి?

పులిం:—ఎందులకు బంధింపవలయును?

తార:—ఇంతకు ముందు మల్హారరావు వచ్చినపుడు నీవే కారణమున బంధించితివో ఆకారణమే. దాని కేమి? అదటుండనిమ్ము. నే నొక యవసరమైన విషయమును దెలిసికొనుటకై వచ్చితిని.

పులిం:—ఆ విషయ మేమి?

తార:—ధనేశ్వరు డెచ్చట నున్నాడు?

పులిం:—నాకేమి తెలియును? అత డెప్పుడు నిటకు వచ్చువాడు కాడు. నే నెట్లు గుర్తింప గలను?

ఈ మాటలు చెప్పుచున్నప్పుడు పులింద కంఠస్వరము కంపించుచుండెను.

తార:—నీవు బాగుగా గుర్తించితివి. బుద్ధిపూర్వకముగ నసత్య మాడుచుంటివి. నిన్నరాత్రి యతనిని మీరందరును కలసి హత్యజేసి యెచ్చటనో పాతిపెట్టినారు. నిజముగునా కాదా!

పులిం:—మే మాతని చంపి శవమును పాతిపెట్టితిమా? ఈ యసత్య వృత్తాంతమును చెప్పినవా రెవ్వరు?

తార:—నీ తండ్రి బందిపోటుదొంగ. నీచుడు. హత్య చేయుటయే అతని వృత్తి. కావున నీ కార్య మతడే చేసియుండును. నీ వా తండ్రికి కూతురువు కావా? నీకు తెలియకుండునా?

పులిందకు కన్నుల నిండ నీరు గ్రమ్మెను. మర్మాహతిపీడచే వ్యథితయై యిట్లనియె. "నా తండ్రి చేసిన దుష్కర్మమునకు నేను జవాబు చెప్పవలయునా? ఆతని పాప పుణ్యములలో పాలు పంచుకొనునది నేనా?"

తార:—నీవే. నీ తండ్రియొక్క పాపకార్యములకు సహకారిణివి. పులిందా! నీ వా లోక హంతకుని కుమార్తెవు కాని యెడల మీ రందరు గలసి నా జీవితము నెట్లు నాశన మొనర్చిరో నీవు తెలిసికొని యుందువు. నా హృదయమున గల మహాజ్వాలను స్త్రీ వైన నీవు గ్రహింపకపోవు.

పులిందకు శోకముచే కంఠము రుద్ధ మయ్యెను. జవాబు చెప్ప జాలకపోయెను. తార మరల రెట్టించెను. "పులిందా! చెప్పవా? ధనేశ్వరుని శవము నెచ్చట దాచితివో తెలియ జేయవా?" పులింద తన బట్టలో దాచిన ఖడ్గమును తార పాదముల కడ నుంచి యిట్లనియె. "సోదరీ! నిష్కారణముగ నిందావాక్యములచే న న్నేల జంపెదవు. ఈ ఖడ్గముతో నా ప్రాణమును గైకొనుము. ఇదే నా వక్షస్థలము. పొడువుము. నా కష్టముల కంతము కలుగును." తార భీతచిత్తయై వెనుకకు జరిగెను. "లేదు లేదు. నే నందులకు రాలేదు." అని పల్కెను.

పులిం:—అట్లయిన నాపై నీవింతముగ మిథ్యాపవాదము నేల మోపెదవు? హంతకుని కుమార్తెను నన్ను జంపుటలో నీ కా భయ మేల! రమ్ము. చోరపుత్రికనగు నాకై కన్నీరు విడుచువారు లేరు. నీ మనోవ్యథను చూడజాలను చంపుము.

తారయొక్క హృదయము చలించెను. పులిందవాక్యములను విన్న పిదప నామెపై గల విరోధభావము మారెను. ఆమె హస్తముల జేతబట్టి స్నేహార్ద్రహృదయముతో నిట్లనియె. "పులిందా! దుఃఖ భరముచే నున్మాదినినై ముందువెనుక లరయక నీ విషయమున కఠినాత్మనై ప్రవర్తించితిని. నీకీ ప్రదేశమున జీవితము సుఖమయముగా లేదని గ్రహించితిని. సోదరీ! నాపై దయయుంచి చెప్పుము. ధనేశ్వరుని సమాచారమును నీ వెఱుంగవా."

పులిం.—(కన్నీరు తుడుచుకొనుచు) యథార్థముగ నే నెఱుంగను.

తార:—నిన్నడుగవలసిన దేమియును లేదు. నావలన నీ హృదయమునకు వ్యథకల్గినది. కాని నాస్థితిలో నీ వుండినయెడల నీవును నావలెనే ప్రవర్తించియుందువు.

ప్రతిగమనమున తార వెడలిపోయెను. పులింద చతికిలబడి రెండుచేతులతో ముఖమును గప్పుకొని యేడువ నారంభించెను. ఎంతకాల మామెకన్నుల నుండి నీరు ప్రవహించెనో - ఎంతకాల మామె దుఃఖించుచు గూర్చున్నదో యామెకే తెలియదు. ఆకస్మికముగ తలుపుత్రోసిన చప్పుడగుటచే పులిందయొక్క శోకముద్రకు భంగము కలిగెను. తలయెత్తి చూచెను. అపరిచితుడైన అపూర్వ వ్యక్తి కట్టెదుట నిలువబడియుండెను. పులింద భీతచిత్తయై నిలువబడి గద్గద స్వరముతో "మీరెవ్వరు?" అని ప్రశ్నించెను.

'నా పేరు కాలూరాయి'.

పులింద 'అమ్మో!' అని యరచెను.

కాలూ:—సుందరీ! భయపడకుము. కాలూరాయి అసహాయలై, ఆర్తలైయున్న స్త్రీలను బాధించెనన్న సంగతి నెప్పుడైన విని

యుంటివా? ధైర్యముగ నుండుము. నావలన నీ కెట్టి కీడును కలుగదు.

పులిం:— నీ వెంతసాహసమునకు బూనుకొంటివి? లోకు లెవ్వరైన నిన్ను జూచిన యెడల తక్షణము బంధింతురు

కాలూ:— ప్రజలకు నాపై నెంతదయయున్నదో నే నెఱుంగుదును. నేను వచ్చిన వృత్తాంతమును చెప్పుచున్నాను వినుము. చాల దినములనుండి నీవు నీ తండ్రితో నిట నుంటివి. మధ్యమధ్య మీతండ్రి కొన్నిదినములవరకు నెచ్చటికో వెళ్లివచ్చుచుండను. ఆ సంగతి నితరు లెఱుంగకి పోయినను నే నెఱుంగుదును 1925 సంవత్సరం చైత్ర శుద్ధ సప్తమినాడు మీతండ్రి యెచ్చటికి పోయెనో నేను తెలుసుకొనగోరుచున్నాను

పులిందకు ముఖము మలినమయ్యెను ప్రత్యవయవమును భయ కంపితమగుచుండెను. ధైర్యమును చిక్క బట్టి యామె యిట్లనియె.

నీవు చెప్పునదేమో నాకు తెలియదు. మే మీ గ్రామము వదలి వెలుపలి కెన్నడును వెడలియుండలేదు.

కాలూ:— నీవు నీ తండ్రిచేసిన నీచతర పాపకార్యమును దాచుచుంటివి. నీ హృదయము మహాస్థిరమైనది. కాని యబద్ధమాడి పాపమును మూటగట్టుచుంటివి. అసత్య మాడినంతమాత్రమున పాపము దాగదు. నీరూప మెంతసుందరమో నీ హృదయ మంతి మెత్తనిది. కనుక నే గోవర్ధనునివంటి క్రూరజనకుని నిష్కళంకునిగా వచింప సాహసించుచుంటివి. ఆసమయమున నీవును నీతండ్రియు నిటలేరు. ఏకారణమువలన నతడు వెడలి యుండెనో యా వివరము నెఱుంగవా?

పులిం:—అంతలకు నన్ను రోషభాయిష్ఠునుగా నెంచితివా ?

కాలూ:—లేదు. అది నీ రోషము కాదు, అతడు చేసిన పాపమును దాచుట వలన నిన్ను రోషయుక్తునుగా జెప్పవలసి వచ్చినది. చైత్ర షష్ఠినాడు నీ తండ్రి వెలుపలకు బోయెను. అష్టమి నాటికి వచ్చెను, వచ్చినప్పు డతనికడ చాల రొక్కము, కరెన్సీ నోట్ల కట్టలు కలవు. ఆనాడే పూనాలోని వర్తకుల సొమ్ము దొంగిలింపబడెను, మరియు రక్షకభటుడు మరణించెననియు నీవు వినియుంటివి. ఇట్టి స్థితిలో నీ తండ్రి యెచ్చటికి పోయెనో నీకు తెలియలేదా ?

ఈ మాటలు వినునప్పటికి పులిందకు మిక్కిలి కోపము వచ్చెను.

పులిం—నా తండ్రిపై దోషారోపణ మొనర్చినచో నా సాహసమునకు హద్దు లేకున్నది. పూనా వర్తకుల ధనము పోవుటను గూర్చి నా తండ్రి కంటె నీవే యీ విషయమును పూర్తిగ నెరింగింపగలవు. ఎవని ఘోర కృత్యములకు తాళలేక జనులు గోలున నేడ్చుచు నిద్రాహారాదుల పరిత్యజించిరో యట్టి నీవు నీ పాపము నితరునిపై త్రోయ నెంచుట లజ్జాకరము కాదా ?

కాలూ —'క్షమించుము. నేనింకను చెప్పదలచిన మాటను చెప్పలేను.' అర్థోక్తిలో వాకిట తలుపు నెవ్వరో కొట్టిన చప్పుడయ్యెను.

పులిం—మా తండ్రి వచ్చినాడు. ఇప్పుడేమి జరుగనున్నదో పరాత్పరు డెరుంగవలయును.

కాలూ:—ఇప్పుడు మీ తండ్రిని కలుసుకొనుట నా మతము కాదు, కలుసుకొంటిమా ఎవరో యొకరు చావకతప్పదు. దాని నడ్డదలంచినచో నన్ను దాచుము. పులిందా! నేను నీ శత్రువును కాను.

పులిందయొక్క ప్రత్యుత్తరమును వినకయే కాలూరాయి గదిలోనికి బోయి తలుపు బిగించుకొనెను. పులింద ద్వారము తెరచెను. గోవర్ధనుడు లోనికి వచ్చెను. తినుటకేమైన బెట్టుమని యడిగెను, పులింద ఆహార పదార్థములను ముందుంచెను. భోజనమైన తర్వాత గోవర్ధనుడు వీధి తలుపు బిగించి పులిందను పిలిచి పండ్లు కొరుకుచు నిట్లనియె. ఈ దినమున నీ కొరకెవరెవరు వచ్చి యున్నారు !

పులిం:—తార వచ్చినది. మల్హారరావు వచ్చినాడుకాని అతనిని నేను లోనికి రానీయలేదు. నన్నతడు చూడలేదు.

గోవ.—అబద్ధము. నీవు నన్నంత బుద్ధిహీనునిగ దలంచుచుంటివా? నే నాకొండచాటున దాగి సర్వముజూచితిని.

పులిం:—బాబా ! నే నెన్నడైన నసత్యమాడితినా ! నేను మల్హారరావును చూచినవెంటనే తలుపులను బంధించితిని.

గోవ:—మరల నదే యసత్యమా ! ఈ యింటిలో బ్రవేశించుచుండ నేనుచూచితిని. ఓసీ! రాక్షసీ!నన్ను నాశనముజేయ దలంచితివా! వాడు నీకాప్తుడయ్యెను. నేను నీకు పరుడనైతినిగాదా ! నా రహస్యమంతయు వాని కెఱింగించి నన్నురికంబమున కెక్కింప దలంచుచుంటివా ! దుర్మార్గురాలా ! నిన్నింక బ్రదుకనిచ్చిన నా ప్రాణము దీయుదువు. నిన్నిప్పుడే యముని సన్నిధికి బంపి నే నిచ్చటనుండి ప్రయాణమై పోయెదను.

అనిచెప్పి వాడిగల కత్తిదీసి పులింద ముందుంచెను. హతభాగ్యురాలైన పులింద దీపపు వెలుగున మెరయుచున్న కత్తిని జూచి గడగడ వడకుచుండెను.

---

13 వ ప్రకరణము

పులింద పాఱిపోయెను

పులింద గోవర్ధనుని భయంకరాకారమును జూచి గడగడవడ వణకుచుండెగాక మాట్లాడజాలక పోయెను. తుద కామె జీవితాశను పరిత్యజించి సాహసము నంతయు నొక్క చోటికి జేర్చి యిట్లనియె.

"బాబా! చివరకు నీవు కన్నకుమార్తెనుగూడ జంప సాహసించితివే? ఇంత దయావిహీనుడవా?"

గోవర్ధను డామెను జూచి వికటాట్టహాసము చేయుచు నిట్లనియె: 'ఓహోహో! నీవు నా కుమారికవా! రాక్షసీ! మరణ సమయమున యథార్థమును దెలుసుకొనుము. నీవు నాకుమారికవు కావు. నారక్తము నీ శరీరమున నొక్క చుక్కయైనను లేదు. నిన్నుజూచిన నా కసహ్యము. నిన్ను వధించి నాప్రాత శత్రుత్వమును నిర్మూలించెదను.'

గోవర్ధనుని మాటలను విని పులింద తెల్లబోయెను. తాను చోర పుత్రిక కాదనియు గోవర్ధనుడు యదార్థమునే వచించె నని తెలుసుకొనెను. కాని లాభ మేమి? తప్పించుకొనుటకు వీలు లేదు. మృత్యు వదన గహ్వరమున కేగుచుగ నున్నది. కాని హంతకుని పుత్రిక యను దుర్భర కళంకము తొలగినందులకు మనస్సునకు కొంచెము శాంతి కలిగెను.

గోవర్ధనుడు తటాలున పులింద కేశపాశము నెడమచేత పట్టుకొని పైకి లేవదీసి కత్తిని చేత బట్టి యిట్లనియె. "హతభాగినీ! గోవర్ధనునితో శత్రుత్వమును సాధింప దలంచిన వారి కెట్టిఫలము లభింపగలదో యోచించుకొనుము, విశ్వాసఘాతినీ! నీ ప్రాణములు

పోవుచున్నవి. చూడుము.' అని కత్తితో పొడువబోవుచుండ వెనుక నుండి—'ఆగుము. చంపవలదు.' అను కేక వినబడెను.

గోవర్ధను డుల్కిపడి వెనుకకు తిరిగి చూడ ప్రాణమిత్రు డైన మదనజీ నిలువబడి యుండెను.

ఆకస్మికముగ తన కార్యమున కాటంకము కలుగుటచే నా క్రూరరాక్షసున కెంతయో విసుగుదల కలిగెను. కోపము వచ్చెను. రూక్షస్వరముతో ని ట్లనియె. 'నా కార్యమున కడ్డు వచ్చెద వేమి? ఇందువలన నీ కేమియు నష్టము లేదు.'

మద:—నిరపరాధిని యగు బాలికను చంపుచుండ నే నెంతమాత్ర మంగీకరింపను. తెలిసినదా? కాపురుషుని వలె ప్రవర్తింపకుము.

గోవ:—నిరపరాధిని యా! పొరబడుచుంటివి. ఈ పిశాచిని నేను నా రహస్య మంతయు బహిర్గత మొనర్చినది. దీనిం జంపక మానను.

మద:—గోవర్ధనా! నీ యట్టి గ్రుడ్డివానిని చూడలేదు. ఇంతికాలము నుండి నీ యండ నుండి నీ రహస్యములను కడుపున పెట్టుకొని భరించి సంచరించుచున్న యీ బాలికను విశ్వసింపకపోవుట గాక కృతఘ్నుడవై చంప దలంచు చుంటివా?

గోవ:—ఈ పాపాత్మురాలు మల్హారరావునకు మన రహస్య మంతయు దెలియ జేసెను.

మద:—ఒక్కమాటనైనను చెప్ప లేదు. అతనిని కుటీరము లోనికి రానీయ లేదు. నేను చాటుననుండి యీమె చేయు ప్రతికార్యమును జూచుచుంటిని. పులిందవంటి విశ్వాసముగల బాలిక

నీకిక దొరకబోదు. నా మాటను నమ్ముము. నీయూహ పొరపాటు. అంతియేగాని యీ బాలిక నీ విషయమై విశ్వాసఘాతినియై ప్రవర్తించియుండలేదు.

గోవర్థనునకు విశ్వాసము కలిగెను. కోపము తగ్గెను. పులిందను వదలి మదనజీతో గూడి సారాయి త్రాగుటలో మగ్నుడయ్యెను.

పులింద మృత్యుముఖమునుండి తప్పించుకొని వంటగదిలోనికి బోయెను. ఆమె కిప్పుడు మరియొక అనుమానము కలిగెను. గోవర్థనుడు రాకముందు తనతో మాట్లాడుచున్న కాలూరాయి సామాను గదిలోనికి బోయి తలుపులు బిగించుకొనుట యామె కన్నులార జూచెను. ఇప్పు డా గదిలోనుండి మదనజీ వచ్చియుండుట గన్గొనెను. అందువలన నామెకు మదనజీ స్వయముగ కాలూరాయి అను మారు పేరుతో సంచరించుచుండెనా యన్న సంశయము బలమయ్యెను. ఇట్లు తలపోసెను. "సందేహము లేదు. కాలూరాయి అనువాడు మదనజీ కాని వేరెవ్వరును లేరు. ఆహా! ఎంత భయంకర కార్యక్రమము? ఎట్టి నరరూప రాక్షసుల మధ్య సంచరించుచుంటిని? సమయమునకు కాలూరాయియో లేక మదనుడో, ఎవడైననేమి? వాడువచ్చి యడ్డుపడుటవలన నా ప్రాణములు నిలిచినవి గాని లేకున్న యీ నరరూప రాక్షసుని చేతిలో జచ్చియుందును. ఇట్టి పాపాత్మునకు నేనెట్లు కుమారికనైతినా యని భగవంతుని దూరుచుంటిని. ఇన్నిదినములకు నేను తన కుమార్తెను గానను రహస్యమును గోవర్థనుడే స్వయముగ వచించియుండుటచే నా హృదయశల్య మూడిపోయినది. ఎంత నీచుడైనను, క్రూరుడైనను, హంతకుడైనను, మదీయజన్మదాత యనియు, కన్నతండ్రి యనియు దలంచి, చేయుచున్న పాపములను కడుపున నిముడ్చుకొని, పెట్టిన బాధలను సహించి దినములను గడుపుచుంటిని. ఇంకమీద

వీనితో నా కేట్టి సంబంధము? వీని ఘాతుక కృత్యములతో నే నేల జోక్యము కల్గించుకొని పాపమును మూటకట్టుకొనవలయును?"

అని తలంచుకొని యొక్కమారు లేచి నిలువబడెను. ఇప్పు డామె హృదయమున నెచ్చోట వెదకినను గోవర్థనుడు లేడు. పంజర ములో నుండి పారిపోదలంచిన పక్షివలె నా కుటీరమునుండి పారి పోవుటకై నిశ్చయించెను. "శుభస్యశీఘ్రం" అనునట్లు కార్యవిధాన మెట్లా యని తలపోయ నారంభించెను.

పులింద నిల్చున్న వంటగదికి వెనుకనున్న గోడ కొక గూడు న్నది. ఆ గోడ చాల శిథిలమై యున్నది. ఆ గూడు నొకమారు పార జూడ నామె కొకయుక్తి తోచెను. వెంటనే గదివెలుపలి కొకమారు పోయి నలుప్రక్కల పరికించెను. గోవర్థనుడు మదనుడు సురాపాన మత్తులై సల్లాపములతో దేలుచుండుటచే నా సమయము తన కెంతయు ననుకూలమయ్యె నని తలంచి మరల వంటయింటిలోనికి బోయి యినుపసాధనము నొకదానిని గొని యా గూడును పొడిచెను. శిథిలమైన గోడ యగుటచే ఒకటి రెండుపోట్లతో అండ యూడి పడిపోయెను. పులింద రెండుమూడు నిముసములలో నా గూడు నొక కన్నముగ దయారుచేసెను. మార్గము దొరకుటయే తడవుగ నందుండి గుభాలున వెలుపలికి దూకెను. అప్పు డామె కంటికనంత తారా గణసమేతమైన వియత్పథము పైభాగమునను, క్రింద వసుంధరయును, నలుప్రక్కల మహోన్నత పర్వత పంక్తియు వృక్షములు కనపడెను. ప్రపంచకమున పులింద యీ సమయమున స్వాధీనురాలు. నా యన్న వారెవ్వరును లేరు. కాని గృహవిహీన. దిక్కులేనిది. అరక్షకురాలు. భగవంతునిపై భారముచైచి యామె పర్వతములవైపునకు నడచి పోయెను. గమ్యస్థాన మేమో తెలియదు. ఏదియైన నొక రహస్య

ప్రదేశమున మూానవుల కంటబడకుండ దాగవలయు నని తలంపు. ఇట గోవర్ధనుఁడును మదనుడును సారాయిత్రాగుచు సంభాషణకు ప్రారంభించిరి.

గోవ:—ఈ పరిశోధకులకు మంత్రము లేమైన తెలియునా యేమి ? మృత్యుముఖమున బడియు బ్రతుకుచున్నారు.

మద:— అట్లనేయున్నది. లేకున్న మనచేతుల బడి నెట్లా రావు బ్రతుకుచెట్లు? నన్ను కాలూరాయనిగా నిర్ధారణజేయ వలయు నని పదేండ్లనుండి ప్రయత్నించుచున్నాను.

గోవ:— నిజమునకు నీవుగాక నింకెవరు?

మద:—నీకు పిచ్చియెత్తెనా యేమి ? వాని ముఖముగూడ నేను చూడ లేను. వానిని పట్టిన పదివేల రూపాయలు బహుమతి యని గవర్నమెంటువారు ప్రకటించిరి. జాడ తెలిసిన చెప్పెదవా? దరిద్రము తీరిపోవును.

గోవ:—నాకు తెలిసిన నే నూరకుందునా ? వెంటనే పట్టిచ్చియుందును.

మద:—శంభూసింహుడే కాలూరాయి యని నా యనుమానము.

గోవ—అసంభవము.

మద:—ఈ దినములలో నసంభవము సంభవ మగుచున్నది. సంభవ మసంభవ మగుచున్నది. మన మాతనిపై నొక కన్నుంచ వలెను.

త్రాగుచున్న సారాయిబుడ్డి పూర్తి యగుటచే మరియొక బుడ్డి తెచ్చుటకై వంటయింటిలోనికి పోయెను. పోవుటయే తడవుగ గిరుక్కున వెనుకకు మరలి స్నేహితుని జూచి "మిత్రమా! కొంప మునిగి నది. సర్వనాశన మైనది." అని వగర్చుచు పల్కెను.

మదనుడు వెంటనే వంటగదిలోనికి వెళ్లి చూచెను. ఇంకే మున్నది? పులింద పారిపోయినది. "గోవర్ధనా! నీ మూర్ఖత్వము వలన నెంతపని జరిగినదో చూచితివా?"

గోవ:—ఛీ! స్త్రీలను నమ్మరాదు. కృతజ్ఞత యనునది శూన్యము.

మద:—ప్రతి దానికిని హద్దుండవలయును. నీ వలన నామె యెంత కష్టమును సహించినదో తెలియునా? నీ రహస్యముల నెన్నింటిని కడుపులో నిముడ్చుకొని దాచినదో గుర్తించితివా? అట్టి బాలికను హత్య జేయుటకై కత్తిని ధరించి బయలుదేరితివి. పాప మా బాలిక యేమి చేయగలదు. ప్రాణభీతిచే పారిపోయెను.

గోవ:—ఇప్పు డేమి యుపాయము? ఆమె యెటు పోయినదో తెలియు విధాన మేమి? ఆమె నోటి నుండి యొక్క మాటయైన మన విరోధుల చెవులబడినదా! ఇక మన పని శూన్యమే.

మద:—నే నొక యుక్తి చేసెద నుండుము. టామీని పిలుచుకొని వచ్చెద.

టామీ మదనజీ పెంపుడుకుక్క. అది వేటకుక్కల జాతిలోనిది. దాని ముఖము పెద్దపులి ముఖము వలె నుండును. వాసనను బట్టి యెంత రహస్యప్రదేశమున కైన బోయి వేటజంతువులను పట్టగలదు. మదనజీ దానిని గొని వచ్చి వంట యింటి లోనికిం గొంపోయి పులింద ధరించు వస్త్రము నొకదానిని వాసన చూపి వదలి పెట్టిరి. టామీ యజమాని అభిప్రాయమును గ్రహించి గురు గురు మనుచు పులింద త్రవ్విన కన్నపుగూడు నుండి యావలకు దుమికి నడువసాగెను. మదనజీ గోవర్ధను లిర్వురును దాని వెన్నంటి పోవుచుండిరి.

టామీ వాసన జూచుచు పులింద వెళ్లిన మార్గమున [illegible] నడుచుచుండెను. పోనుపోను టామీయొక్క గమన [illegible] యగుటచే మదన గోవర్థనులు దానిని కలుసుకొన [illegible] కనుపడి నంత వరకు వెన్నాడుచుండిరి. టామీ వీరి నిద్దఱను [illegible] కనే దిగవిడచి కొండలను దాటి లోయను సమీపించి భయంకర[illegible] మొరుగ నారంభించెను. మదనజీ తత్కాలపు పరిస్థితిని గమనించి కుక్కను వెనుకకు పిలువవలయు నని తలంచి, 'టామీ! టామీ!' అని కేక వైచెను. కాని యాజంతువు యజమాని కేకను వినిపించుకొనక గర్జించు చుండెను. మదనజీ గోవర్థనునితో నిట్లనియె "పరిస్థితి విషమించినది. టామీ పులిందను గాయపరచక మరింక ఒకవేళ కరచి చంపినను చంపవచ్చును......అని చెప్పి మరల 'టామీ!' అని కేక వేసెను.

టామీ క్రమముగ కొండక్రిందకు బోయెను. మదన గోవర్థనులు టామీ యొక్క సంగతి తెలిసికొని పోవ నిశ్చయించి యట నిల్చుండిరి. పులిందకు టామీ యొక్క గర్జనము చెవులబడెను. ఆమెకు భీతిచే పై ప్రాణములు పైకి పోయినట్లుండెను. తన కిక మరణము తప్ప దని నిశ్చయించి, 'ఈశ్వరా కరుణింపు' మని రోదనము చేయుచు పరువెత్తు చుండెను. కుక్క వెన్నాడు చుండెను పులింద ప్రాణభయముచే పరువెత్తుచు కాలు జారి యొక గోతిలో పడెను. గోయి విశేషము లోతు లేని దగుటచే దెబ్బలు తగుల లేదు. ఆ గోతిలో నొక రాళ్లకుప్ప యుండుటచే పులింద దాని చాటున దాగెను. టామీ గోతిని సమీపించి నిలువబడి భయంకరముగ గర్జించు చుండెను. పులింద కొక యుక్తి తోచుటచే దైవముపై భారము వైచి 'టామీ! టామీ!' అని పిలిచెను. పులింద పిలుపుతో టామీ యొక్క కంఠధ్వని మారెను. ఆ తిర్యగ్జంతువు కంఠధ్వని విని తన కర్తవ్యమేమా యని యాలోచించు చుండెను. పులింద తిరిగి 'టామీ'

యని కేక వేసెను. టామీ యీ మారు బాగుగ గుర్తించి సంతోష ముచే గురగుర లాడుచు తోక త్రిప్పుచు గోతిలో దిగుటకై ప్రయ త్నించు చుండెను. పులింద టామీయొక్క చైఖరిని గమనించి రాళ్లచాటుననుండి వెలుపలికివచ్చెను. పులిందను జూచి టామీ ఒక్క యురుకున నామె యొడిలో జేరెను.

గోవర్థనుని కుటీరములో నున్నప్పుడు మదనజీ వెంట టామీ కొన్ని పర్యాయములు వచ్చియుండెను. తత్సమయమున పులింద దానికి కడుపునిండ నాహారమును బెట్టి ముద్దులాడి పంపించుట కలదు. కృతజ్ఞతకును విశ్వాసమునకు పుట్టినిల్లైన యా శ్వానము పులిందను చూచిన వెంటనే యానందము పట్టలేక యజమానుని యాజ్ఞను సైతము మరచి యామె పాదములను నాకుచు తన విశ్వాసమును గనపరచెను. పులింద సంతోషపరవశయై టామీని కౌగలించు కొనెను. మదన గోవర్థనులు కొండ పైభాగమున నుండిరి. పులింద పడివగోయి కొండకు చాల క్రిందుగనున్నది. పులింద కిప్పుడును సురక్షితస్థానమేది? అను చింతకలిగెను. కొలది నిముసములు యోచిం చిన పిదప నామె కొక గుహాప్రదేశము మనస్సునకు తోచెను. రెండేండ్లకు ముందొకమారు విహారార్థమై పోయినప్పుడు పులింద యా గుహను చూచియుండుటచే నిప్పుడది జ్ఞప్తికి వచ్చెను. సురక్షిత ప్రదేశము దొరకెను గాని, క్షుద్బాధా నివారణ మెట్లు ? భగవంతునిపై భారమువైచి పులింద కుటీరమునకు బయలు దేరెను. టామీ వెంట వచ్చుచుండెను. కొలదికాలమున నామె కుటీరము జేరి లోనికేగెను. మదన గోవర్థనులు కొండపైనుండి రాలేదు. పులింద మారుత్రోవను వచ్చుటచే వారిద్దరు టామీ రాకకై నిరీక్షించుచు నట నుండిరి.

పులింద లోనికేగి కొన్ని రొట్టెలు సుమారు ఎనిమిది దిన ములు భోజనమునకు సరిపడిన పిండి మొదలగు నాహార పదార్థము

లను మూట గట్టుకొని వెంటనే తన సంకేతస్థానమైన కొండ గుహ లోనికి బోయి తెచ్చుకొనిన రొట్టెలను కడుపునిండ తిని, టామీకి గూడ బెట్టెను. కొండగుహకు వచ్చునప్పుడు కుటీరము ముందామె కొక పిస్తోలు క్రిందబడియుండి కాన్పించెను. ఆత్మరక్షణమునకై పులింద దానిని వెంట తెచ్చెను. ఆమె గుహకు చేరునప్పటికి సుమారు ఆర గంట పట్టెను.

---

14 వ ప్రకరణము

—పూర్ణిమనాటి రాత్రి—

రెండు దినములు గడచెను. రెండురాత్రులు జరిగినవి. కాని ధనేశ్వరుని జాడ తెలియదు. అందరు నతనిరాకకై చింతించుచుండిరి, తార నిద్రాహారములను బరిత్యజించి లోలోన దుఃఖపడుచుండెను. మల్హారరావు పలువిధములైన ప్రయత్నములను జేసెనుగాని యతని జాడ తెలియ లేదు. తార పులిందతో దానొనర్చిన ప్రసంగములను సోదరున కెఱింగించి యుండుటచే, ధనేశ్వరుని రహస్యము పులిందకు తెలిసియే యుండునుగాని, తారతో చెప్పుటకు సంశయించి అసత్య మాడెనను ననుమానము కలిగి, మల్హారరావు గోవర్ధనుని కుటీరమున కేగి ద్వారమును త్రోసి చూడ బంధించి యుండుటయేగాక తాళము బిగించి యుండెను. రెండు మూడు మార్లు పిలిచెను. ప్రత్యుత్తరము రాలేదు. తారయొనర్చిన ప్రమాదమువలన గోవర్ధనుడు పులిందతో గూడ నటనుండి పరారియయ్యెనా యని యనుమానించెను. అంతతో నూరకుండక కుటీరము నలుప్రక్కల పరీక్షింప నారంభించెను. వెనుక వైపునకు బోయిచూడ గోడకు కన్నము పడియుండెను. మల్హారరావా కన్నమును జూచి శంకిత చిత్తుడై దానిలోనుండి కుటీరములో ప్రవే

శించెను. వంటగదిలోనుండి ముందుభాగమునకు బోయెను. దీప మింక కను వెలుగుచునేయుండెను. నేలమీద రెండుమూడు నెత్తురుచుక్కలం పెద్ద డాగులు పడియుండెను. నెత్తురు డాగులు చూడగనే మల్హార రావునకు భయము కలిగెను. ఈ నెత్తురుడాగులు ధనేశ్వరునికి సంబంధించినవి కావు. పులిందకు సంబంధించినవై యుండును. గోవర్థనుడాన, ర్చేడి భయంకర కార్యములకడ్డువడి యుండును. లేదా! లోకమునకు వెల్లడి చేసెదనని భయపెట్టి యుండును. ఆ కారణమున నా రాక్షసుడు పులిందవలన నాకపత్తు రాగలదని శంకించి సంహరించి యుండును.” అని తలపోసెను.

పులిందను సంహరించి గోవర్థనుడెటకు బారిపోయెనా యని సంశయముతో నా కుటీరములోనుండి వెలుపలకువచ్చి యైదు నిముసముల కాలము యోచించుచు నిల్చుండెను. ఆకస్మికముగ నతని యోచన కాటంకము కలిగెను. దూరమున నిల్చుండి తన్ను జూచుచున్న యొక పురుషునిపై నతని దృష్టి పడెను నిదానించి చూచి సోమేశ్వరుడని తెలుసుకొనెను. వెంటనే సమీపించెను.

మల్హా:—సోమేశ్వరా! ఇచ్చటి కేమిపనిమీద వచ్చియుంటివి?

సోమే.—నే నీవైపుగా పోవుచుంటిని. నీవు కనుపడుటచే ఏమి సంగతియో తెలిసికొందమని నిల్చుంటిని.

మల్హా:—తుదకు నీ పరిశోధన నావైపునకుగూడ మరలినదా!

సోమే:—(ఎరుగనట్లునటించి) మల్హారబాబూ! నీమాట నాకర్థము కాలేదు.

మల్హా:—సోమేశ్వరా! నా మాటను శ్రద్ధతో వినుము. నేను నీవు తలంచినంత బుద్ధిహీనుడను గాను. భగవంతుడు నాకును కొంచెము తెలివి నిచ్చి యుండుటచే నీవు సోమేశ్వరుడవు

కాననియు సోమేశ్వర నామధారి నగు గూఢచారి ననియు గ్రహించితిని.

సోమే:—నీ కీ యనుమాన మెందులకు కలిగినది?

మల్లా:—నీ చర్యలను బట్టి యనుమానించితిని. నీవు మన్గాహూటలు మే నేజరువో - లేక మరి యొకడవో - ఎవ్వరైనను నీ రహస్యమును బయలు పెట్టెదను. ఒక్క విషయమును తెలుసుకొనుము. నే నూహించి నంతవరకు నీవు నెల్లి మార్గము క్రమముగ లేదు. నీ యభిప్రాయము నాకింగితమైనని యందులకై మన మీద్వారము ప్రయత్నించితిమి. మన ప్రయత్నములు నెరవేరి నచో నీ కోరికయు నా కష్టమును రెండును ఫలింపగలవు.

సోమేశ్వరుడు చిరునవ్వు నవ్వుచు తన యనుమతి నొసంగెను. ఇరువురు కలసి మన్గాహూటలు నైపుణ్యముతో నడిపిరి. క్రోసనాగ నివసి ఔనరై మల్లార రావున కొక జాబు నొసంగెను. దిప్ప నిగవృత్తాన నిట్లు వ్రాయబడి యున్నది.

“పరిశోధకమహాశయా!

నేను పూర్ణిమ. మరువ వలదు. సూర్యాస్తమయ మైన వెంటనే భద్రగిరి క్రీడాశిఖరమునకు వచ్చి నన్ను కలసికొన గలవు.

—కాలూరాయి.”

ఉత్తరము చదివిన వెంటనే మల్లారరావున కాలోచనము తోచ లేదు. వెనుక నొకమారు తార యీ సంగతి చెప్పెను గాని దానిని త్రోసివేసెను. ఇప్పు డీ జాబును జూచి యోజింప నారంభించెను “కాలూరాయి యెట్టి యుద్దేశ్యముతో నా భయంకర స్థానమునకు బిలుచు చున్నాడు? నమ్మి వెడలిన యెడల నేమి జరుగును? హత్య జేయునా? అంత సాహసమా! చాలు చాలు.”

మల్హారరావునకు నవ్వు వచ్చెను. "నే నిప్పు డా ప్రదేశమునకు వెళ్ళకుండిన కాలూరాయి నన్ను పిఱికిపంద యని భావించును. ఇంతియే గాక రంగస్థలమున కాలు బెట్టిన పిదప నెవరిచే పిలువ బడియు నాత్మసంకటమును శంకించుచు పోకుండుట ధీరజన లక్షణము కాదు. కావున కాలూరాయిని కలుసుకొనెదను."

కాలూరాయి సర్వవిధముల సురక్షితుడై యుండును. కావున మనముకూడ నట్లే తగు కట్టుదిట్టములతో పోయిన బాగుండు నని నిశ్చయించెను. కాని మగల నొక యనుమానము తోచెను. సర్వ కాలముల యందు తన్ను వెన్నాడి యున్న కాలూరాయికి తన ప్రయత్నము తెలిసినచో జాగ్రత్తపడగలడు, అను శంకతో మల్హార రావు మరియొక యుక్తిని యోచించి యీ ప్రకార మొనర్ప నిశ్చ యించి సోమేశ్వరునితో గలసి వెడలిపోయెను.

సూర్యభగవాను డస్తాద్రికి జేరు సమయమైనది. మల్హారరావు భద్రగిరి వైపునకు మరలెను. మార్గము వంకరగ నుండుట యేగాక కఠినమై దుర్గమమై యుండెను. గమ్యస్థానము జేరునప్పటికి సంధ్యా కాలముగూడ గడచిపోవు చుండుటచే అంధకారము కొంచెము కొంచెముగా నరుగుదెంచి వ్యాప్తమగుచుండెను. నిర్దిష్టస్థానమునకు వచ్చి నలుప్రక్కల సావధానముగ జూచెను. ఎవరును కానరాలేదు. కాలూ రాయి రాలేదా యని తలపోయుచు నొక పావుగంట కాలము నిలు చుండెను. ఇంతలో నతడు నిల్చున్న ప్రదేశమునకు సుమారు 60-70 అడుగుల పైభాగము నుండి యొక పురుషుడు పిలిచిన ధ్వని వినపడెను. మల్హారరావు విస్మయముతో తల పైకెత్తిచూడ పైభాగ మున నొక మనుష్యాకృతి నిలువబడియున్నట్లు కనపడెను. సంభాషణము ప్రారంభమయ్యెను.

"పరిశోధక మహాశయా! వచ్చితిరా! సంతోషము. పిస్తోలు మాత్రము వెలుపలికి తీయవలదు."

మల్హా:—లేదు. అంతవరకు నవసర ముండదు.

"నన్ను నీవు కలియ నేలకొ వచ్చుచుంటి వని యెంచితిని."

మల్హా:—నిశ్చయమే. ఆ పై భాగమునుండి నన్నిటకే వచ్చిన యెడల చాల సంతసించెదను.

"అంత ప్రేమయుండుట మంచిది కాదు. నేను వచ్చిన విషయమును వినుము. ఏడు సంవత్సరముల క్రింద గోపాలరావు, మధుసూదనరావుగార్ల బ్యాంకుకంపెనీ సొమ్ము రు 1,50,000 లు బందిపోటు జరిగినది. ఆ ద్రవ్యమును నేనే యపహరించితి నని నిదానించి యనుమానము ?"

మల్హా:—నిశ్చయముగ నీవే తీసుకొంటివి.

"నీవు తలంచినది పొరపాటు. నా యొద్ద ద్రవ్యములో నొక్క పైసయైన నాచేతికి చిక్కలేదు. అంతద్రవ్యమే నాచేతికందిన నేనిట్లు బందిపోటుతనము చేయవలసిన గతియేమి? సుఖముగ జీవితమును గడపుకొనుచు నుండెడివాడనే."

మల్హా:—ఈ మాటలు నమ్మదగినవి కావు. పరిహాసములకా నన్ను పిలచితివి?

"నమ్ముము. నమ్ముము. నేను చెప్పునది యథార్థము. మీ ద్రవ్యమొక కానియైన నా చేతికి జిక్కలేదు. వృథా సందేహమును బెట్టుకొని నన్ను బట్టుటకై విశ్వప్రయత్నములను సల్పుచుంటివి.

మల్హా:—నీవు యథార్థమైన కాలూరాయుడవా? లేక వేషధారివా?

"నేనే నిజమైన కాలూరాయుడను నామధారిని. మిగిలిన వారాత్మ రక్షణమున కట్టి వేషమును ధరించు చున్నారు."

మల్హా:—నీవు తీయకున్న నా ద్రవ్య మెవ్వ రపహరించిరి?

"నే నెఱుంగను. ఆ ద్రవ్యమును చేజిక్కించుకొనిన వాడెవ్వరో తెలుసుకొనవలయునని నేనీ యేడేండ్లనుండియు ప్రయత్నించుచున్నాను. ఇప్పుడు నీతో చెప్పున దేమనగా! ఇంకమీాద నీవు వ్యర్థసందేహమును మనమున నిడుకొని నన్ను బట్ట నెంచుచున్న నీ ప్రయత్నమును విరమింపుము. నన్ను బట్టుట నీ వంటి పరిశోధకుల పనిగాదు."

మల్హారరావు వీనితో సంభాషించుచుండుట కాలయాపనము, నిష్ప్రయోజనమని తెలుసుకొనెను. లభించిన యవకాశమును చేజార్చుకొనుట మంచిదికాదని నిశ్చయించి బట్టలలో దాచిన రివాల్వరును పైకి దీసి పైనున్న మనుష్యుని వైపు లక్ష్య ముంచి కాల్చెను. రివాల్వరు ధ్వనికి దిశ లన్నియు మారుమ్రోగెను. ఒక్క నిముస మాగి పైన జూడ నెవ్వరును కానరాలేదు. పర్వతశిఖరము మాత్రము కనపడు చుండెను. మల్హారరావు సాహసించి కాలురాయి నిలువబడి తనతో మాట్లాడిన ప్రదేశమును జేర పై కెక్క నారంభించెను.

యథాస్థానమునకు జేరి పరిశీలించి చూడ నా ప్రదేశమున నొక ముసుగు వేసుకొనిన వ్యక్తి పడియుండెను. ఆ ముసుగు కాలూరాయి ధరించు ముసుగే. కాలురాయి వీడేనా! వీనిని బంధించు ప్రయత్న మింతతో సమాప్త మయ్యెనా యేమి? అని తలంచుచు వాని దుస్తులను తీసి పరీక్షించెను. రివాల్వరుగుండు గుండెలలో నుండి దూసుకొని పోయెను. గాయము క్రొత్తగ దగిలినట్లే యుండెను. ముఖము గూడ పరిచయము గల ముఖము వలె కానవచ్చెను. మల్హారరావునకు చింతయు భయమును సంభవించెను. నిదానించి గాయమును ముసుగును పరీక్షించిన కొలది నతనికి పెక్కు తలంపు లుత్పన్నము లయ్యెను.

“ఈ వ్యక్తి నాచేత జంపబడి యుండడు. కారణ మే మనగా గొండ క్రింద నుండి నేను గురి చూచు నప్పటికి శిరమే కనపడినది. గారివాల్వరు దెబ్బ తలకు దగుల నలయును గాని గుండెల కెల్లు దగులను? అదియును గాక ఒక వేళ నా వలననే యితడు మరణించుచో పైన గల ముసుగునకు ముందు వెనుక భాగములలో గుండు దూసుకొని పోయిన ఛిన్నములు గాని చిరుగులు గాని కనబడవలయును. అట్టి దేమియును లేదు. ఎంత పరీక్షించినను ముసుగునం దెట్టి చిరుగును లేక గట్టిగ నున్నది. కావున వీని నెవ్వరో చంపి శవమును ముసుగుతో కప్పి నట్లున్నది. నేను కాల్చినందువలన నితడు చావలేదని నిశ్చయము.” అని మల్హారరావు తన మనస్సున నిశ్చయించెను. ఈ చంపబడిన వ్యక్తి కాలూరాయి కాదని గ్రహించెను. ఈ విషయమును గూర్చి మల్హారరావు కాలూరాయి మరణించె నని తలంచి గవర్నమెంటువారికి రిపోర్టు పంపును. పోలీసువా రా ప్రయత్నమునుండి విరమింపగల రని తలంచి తన్ను మోసపుచ్చుటకై కాలూరాయి చేసిన యుక్తి యని మనస్సున స్థిరపరచుకొని యిట్లనుకొనెను. వీ డెన్ని యుక్తుల బన్నినను నా కన్నులలో దుమ్ము జల్లజాలడు. పూర్వజన్మార్జిత కర్మవాసనవలె నేను వీనిని వెన్నాడక తప్పదు. కాలూరాయుని కనిపెట్టి బంధించుటయే నా జీవితమునకు ప్రధానవ్రతము.

మల్హారరావు తిరిగి దుర్గాహోటలునకు చేరునప్పటికి రాత్రి యెనిమిది గంటలయ్యెను. హోటలులో అందరును కలరు. ఎరిగినవారందరు కనపడిరిగాని మదనజీ కానరాలేదు. అందువలన మదనుడే కాలూరాయి యనియు ఈ కార్యక్రమ మంతయు నతనిదే యనియు తలంచెను.

మధుసూదనరావు తన గదిలో గూర్చుండి యొక సమాచార పత్రికను చదువుకొనుచుండ మల్హారరావతని సమీపించి యిట్లనియె.

"మధుసూదనబాబూ! కాలూరాయి యెవరా యను విషయము నేట రేపటిలో స్థిరపడగలదు. పిదప నొక వారము దినములలో తగిన ప్రమాణములను సంగ్రహించి వానిని బంధించెదను.

అటు పిమ్మట వారిద్దరకును షట్చక్రదళమును గూర్చి సంభాషణము జరిగెను. వారిని కలుసుకొనవలసిన దినము రేపే గదా యని యనుకొనిరి.

---

15 వ ప్రకరణము

—షట్చక్రదళము యొక్క పలలో—

మరునాడు దిన మంతయు మల్హారరావు షట్చక్రదళమును సమీపించుటకు దగిన సన్నాహ మంతయు జేసెను. సాయంకాలము కాగానే మధుసూదనరావు రిక్తహస్తములతో గమ్యస్థానముం జేర ప్రయాణ మయ్యెను. అతనికన్న ముందే మల్హారరావు, మిచువా, సోమేశ్వరుడు మరి యిద్దరు విశ్వాస పాత్రు లగు భటులు, నిర్దిష్టస్థానమునకు బోయి రహస్యస్థలముల దాగియుండిరి. మిచువా బయలు దేరునపుడే తన నిజ వేషమును మరుగుపరచుకొని నిగూఢ వేషమున బోయి తా నితరులకు గానరాకుండ తన కంతయు గనపడు రహస్యప్రదేశమున దాగెను.

మధుసూదనరావు నిర్దిష్ట స్థానమును సమీపించిన కొలది నతని సాహసము క్షీణించెను. అతని కనేకాలోచనలు కలిగెను. తన దగ్గర ధనము లేని సంగతిని గ్రహించి యా ఘాతకు లేమిచేయుదురో? తన కాత్మరక్షణము కలుగునో కలుగదో! తన్నొకవేళ హత్యచేయుదు రేమో యను సంశయములతో నతని హృదయము నిండిపోయెను. హంతకులతో సమముగ నెత్తులువేయుట ప్రాణముల గోల్పోవ

నెంచుటయే అని తలంచుచు గమ్యస్థానముం జేరి నిల్చుండెను. ప్రదేశము చాల భయంకరముగ నుండెను.

మాటిమాటికిని తలయెత్తి చూచుచుండెను. కాని యెవ్వరును కానరాలేదు. తాను తగు జాగ్రత్తతో వచ్చినసంగతి షట్చక్రదళము గ్రహించియుండునా యను తలంపు కలిగెను. ఇంతలో కొండ పై భాగమునుండి "మధుసూదనరావుగారూ! రూపాయలను దెచ్చితివా?" అను కేక వినబడెను. మధుసూదనరావు త్రుళ్ళిపడి నలుప్రక్కల జూచెను. కేక కొండపైనుండి వచ్చుచుండెను. ప్రత్యుత్తర మిచ్చెను.

మధు:—తీసుకొని వచ్చితిని.

దొంగ.—పైకిరమ్ము.

మధు:—చీకటిలో కొండమీది కెక్కుట నాకభ్యాసము లేదు.

దొంగ:—అట్లయిన దెచ్చినధనమును పైకితీసికొని వచ్చెదవా? రావా!

మధు:—నీవు వచ్చి తీసికొని వెళ్ళుము.

దొంగ:—మధుసూదనరావుగారూ! నీవు నిశ్చయముగా మూర్ఖుడవు. కాకున్న షట్చక్రదళము లోని వారంత బుద్ధిహీను లనియు నీ యుక్తులను గ్రహింపజాల రనియు తలంచెదవా? చాలుచాలు. నిన్నెందుల కిట్లు పిలిపించితిమో నీకా తలంపు నెరవేరినది. నీవింక వెడలిపోవచ్చును.

కొండపైనుండి మాట లాగిపోయెను. మధుసూదనరావు మెల్లగ నడచి ముందునకు వచ్చుచుండెను. ఇంతలో నొక పురుషు డతనిప్రక్క నుండి సత్వరముగ కొండ నెక్కుచుండెను. మరియొక డతని ననుసరించు చుండెను. మొదటివాడు మిచువా—రెండవపురుషుడు సోమేశ్వరుడు. ఇర్వురు ప్రమతగమనమున కొండపైకిబోయి నలుదిశల పరీక్షించి మరలి మధుసూదనుని సమీపించిరి.

మిచు:—ఎట్లనో వారందరు మన రాకను గ్రహించి జాగ్రత్త పడి నారు. సోదరుడు మల్హార్ ఎచ్చట ?

అందరు నౌకచోటికి గూడిరి. కాని మల్హార్ లేడు.

సోమే:—అత డేమాత్రమో ఆచోకీని గ్రహించి దొంగలను వెన్నంటిపోయి యుండును.

తెల్లని ఉండవంటి పదార్థ మొకటి వచ్చి వారి ముందు బడెను. మిచువా దానిం జూచి పైకి తీసెను. కాగితములో చుట్టబడిన రాయి. సోమేశ్వరుని చేతిలో నున్న టార్చిలైటును వెలిగించి చూడ నది యొక జాబు. దానిలో రాతిని పెట్టి పడవైచిరి. చూడగా నందిట్లు వ్రాయబడినది.

"సపరివారు డైన మధుసూదనరావునకు— మీరు చేయు ప్రయత్నముల నన్నింటిని గమనించుచున్నాము. మేము నిన్ను పిలిపించినది ధనము కొరకు గాదు. పరిశోధకు డగు మల్హారరావును బట్టుటకే మిమ్ము పిలిపించితిమి. మా కోర్కె నెరవేరినది. మల్హారరావు మా చేత జిక్కినాడు.

—షట్చక్రదళము"

మధుసూదనరా వా జాబు నందుకొని చదువుకొనెను. శరీర మంతయు కంపితమై చేతిలోని జాబు జారిపోయెను. షట్చక్రదళమును బట్ట వచ్చి మల్హారరావు స్వయముగ వారిచే జిక్కెను. సమయము రాత్రికాలము. ప్రదేశము భయంకరము. ఏమి చేయ వలయు నని తలంచిరి. ఏ యుపాయమును తోచకపోవుటచే నందరును యథాస్థానమునకు మరలిరి. మిచువా కొంతకాల మట నిల్చుండి యేదియో యోజించుకొని శిరఃకంపనము సేయుచు మరియొక త్రోవ నేగెను.

* * * *

మల్హారరావు దుర్గాకోటలు నుండి బయలుదేరి గమ్యస్థానము జేరి తనవారికి దూరముగ నొక రహస్యప్రదేశమున దాగి యుండెను. మాటిమాటికిని నలుప్రక్కల జూచుచుండెను. ఇంతలో కొండపై భాగము నుండి త్రాడుపాము వంటి పదార్థ మొకటి యతని గొంతుకను చుట్టుకొనెను. మరియొక నిమిషమున కతని శరీరము పైకి లేవ నీయబడెను. తప్పించుకొనవలయు నని యెంత ప్రయత్నించినను నతనికి సాధ్యము కాలేదు. తన్ను బంధించి పైకి లాగుచున్నట్లు తెలుసుకొనెను. క్రమక్రమముగ నతని శరీరము బలవంతముగ పైకి లాగబడు చుండెను. వలలో తగుల్కొనిన చేప వలె మల్హారరావు పైకి లాగబడెను. పైకి వచ్చిన వెంటనే ముసుగుల బలాఢ్యు లతని పైబడి చేతులను బలాత్కారముగ వెనుకకు విరిచికట్టి బంధించి యొక సమప్రదేశమునకు గొనిపోయిరి. వారిలో నొకడు మల్హారావును జూచి షట్చక్ర దళముయొక్క సామర్థ్యమును గమనించితివా యని పరిహసించెను. అటనుండి యొక కొండగుహ లోనికి గొనిపోయి కాళ్ళకు ముసుగు వేసి బంధములను విప్పిరి. ఆ గుహాంతరము మాత్రము కాగడాల వెలుగు చుండెను. నలుగురు ముసుగువారు ఆయుధపాణులై యతనిచుట్టు నిలిచియుండిరి. వారిలో నొక డహంకార రవమున మిగిలినవారితో బంధితుని కట్టుకట్ట నిలువబెట్ట నాజ్ఞాపించెను. మల్హారరావు వానిని నాయకునిగా తెలుసుకొనెను. గుర్తించుటకు వీలులేని విధముగ శిరము మొదలు పాదముల వరకు ముసుగులు వేసికొని యుండిరి. సర్దారు మల్హారరావుతో "పరిశోధక మహాశయా! తాము షట్చక్రదళమునకు స్వాధీనులైరి." అనెను.

మల్హా:—ఆ సంగతిని తెలుసుకొంటిని. కాని నీ వెవరవు!
సర్దా:—నే నీదళమున కధికారిని. నన్ను సర్దారు అని పిలిచెదరు.
మల్హా:—నాతో మీ కేమి యవసరము కలిగినది ?

సర్దా:—వినుము. నీకు చాలదినములనుండి నేనే తెలివి గల పరిశోధకుడను, బలవంతుడ నను గర్వమున్నది. ఇంత యహంభావముగల నీవు చాల తేలికగా మాచేత జిక్కితివి. ధనము కావలయు నని భయపెట్టి మధుసూదనరావును పిలిపించినది నిన్ను బంధించుటకే యని తెలుసుకొనుము. నిన్ను పట్టి బంధింప కున్న మాకు క్షేమము లేదు. చిరకాలమునుండి నిన్నును నీ కార్యక్రమమును గనిపెట్టుచుంటిమి. ధీమంతులలో నగ్రగణ్యుడనని తలంచు నీవు మూర్ఖునివలె మాచేత బడితివి. మా యుద్దేశ్యము నెఱవేరెను.

ముగ్వా:—నేను నీచే జిక్కుట నీ తెలివితేటలు కాదు. ఈశ్వరేచ్ఛ యని గ్రహింపుము. నీ రహస్య ప్రవర్తనము మాత్రము దాగు నని తలంచితివా? నీ యదార్థ వృత్తాంతమును గురించి సంశయించుటలేదా! నేను గాకున్న రేపైన నీవు బంధితుడవై న్యాయస్థానమున నీ యపరాధము నంగీకరింపక తప్పదు. దాని కేమి? నన్ను బంధించుటలో నీ యభిప్రాయమేమి?

సర్దా:—నీ తెలివిని గ్రహించితిని. కాలూరాయి యెవరో తెలిసికొనజాలక ఏడేండ్లనుండి శ్రమపడుచుండుటయే గాక నీ యనుమానమునకు బాత్రుడైన ప్రతివానిని కాలూరాయియని యెంచుచుంటివి. ఇట్టి నీవా నన్ను బట్టునది? పట్టుట మాటటుంచుము. మాచేతులలోనుండి యావలకేగి నప్పటి మాట చూచుకొందము. నీవు మాదళమునకు విరోధివి. అందువలన నిన్ను స్వేచ్ఛగ దిరుగ నిచ్చినయెడల చాల చిక్కులు కలుగును. తత్కారణమున నిన్ను బంధించితిమి. కొంతకాలము మా స్వాధీనములో నతిథివై యుండుము.

మల్హారరావు దస్యులనాయకునితో బ్రసంగించుట వ్యర్థమని యెంచి యూరకుండెను. సర్దారు ఆజ్ఞపై మిగిలిన ముగ్గురు ముసుగులును మల్హారరావును పట్టి వెలుపలికి గొనివచ్చి గుహ కావలినైపున గల మరియొక ప్రదేశమునకు దీసుకొనిపోయి యొక గదిలోపలను ద్రోచిరి. మల్హారరావును దానిలోపలికి ద్రోసి యిదియే నీ వుండు గది యని హాసించి తలుపులను బంధించి ద్వారమునకు ఖడ్గహస్తుఁడైన రక్షకు నొకని నిలువబెట్టి వెడలిపోయిరి. ఆ ప్రదేశమంతయును భూగర్భమున నేర్పరుపబడినది. పోవుమార్గమా సొరంగము. నాలుప్రక్కల కొండలు తప్ప వేరులేవు. అట్టి భయంకర ప్రదేశమున కొన్నిగదులు సొరుగ నిర్మింపబడి యున్నవి. అందొకదానిలో మన మల్హారరావు బంధింపబడి యుండెను. చేతు లింకను బంధింపబడియుండెను. మార్గాయాసమును కెంత మాత్రము నవకాశము లేని యా గదిలో బంధింపబడి మల్హారరావు తనకు సంభవించిన యవస్థనుగూర్చి తలపోయ నారంభించెను. ఇట నుండి తప్పించుకొనుటకు మార్గము లేదా! నలుప్రక్కల జూచెను. శిలానిర్మిత కుడ్యములు. ద్వారము బంధింపబడి యున్నది. వెలుపల ఖడ్గపాణి యగు ద్వారరక్షకుడు. తనచేతులు బంధింపబడియున్నవి. ఇట్టి స్థితిలో పారిపోవుటకు ప్రయత్నించుట యనవ్యర్థాయాసముగాని వేరు కాదు.

మల్హారరా వీరీతిగ దలపోయుచు మరల నేమైన గనబడునేమో యని గోడలన్నియు సావధానముగ బరికించుచుండ నొకచోట కొంచె మెత్తుగ నొక చిన్న కన్నము, చేయిదూరునంత రంధ్రము కనబడెను. ఆ రంధ్రము గోడవెనుకటి భాగమునకు ప్రక్కగనున్నది. మల్హారరా వతికష్టముపై నా రంధ్రమువర కెగిరి యందులోనుండి చూడ నావల ప్రక్క మనుష్యుని ముఖము గన్పడెను. ఆ పురుషు డెవ్వరో తెలిసికొన వాంఛ కలుగుటచే నాగది యంతయు కాళ్ళతో తడిమిచూడ నందొక

యుత్తైనరాయి యుండెను. ఆ రాతిని గోడవైపునకు తోసికొనివచ్చి దానిపై నిల్చుండి చూచెను. ప్రక్క గదిలోనున్న మానవుని ముఖ మావలివైపునకు దిప్పబడి యున్నది. మరియును విచారముతో గూర్చుండినట్లు కానుపించినది. అతడెవ్వరా యని తలంచుచు క్రిందకు దిగి మల్హారరావా గదిలో నొకమూల కూర్చుండెను.

---

16 వ ప్రకరణము

—విముక్తి—

నాటి రాత్రి మల్హారరావునకు నిద్ర పట్ట లేదు. అట్లే కూర్చుండి యుండెను. కొంచెము కాలము గడచిన పిదప నతడా కన్నమును జూచెను. గదిలో మినుకు మినుకు మను దీప మొకటి కలదు. ఆ దీపపు వెలుగున కన్నములో నుండి యొక చేయి కదలుచున్నట్లు కన్పడుటచే మల్హారరావు విస్మయముతో జూడ నారంభించెను. నాలుగు నిముసము లయి నంతనే యొక చిన్నరాయి యా కన్నములో నుండి వచ్చి యతనికి తగిలెను. మల్హారరావు తటాలున లేచి రాయి పడుట కేమి కారణమో యని యోచింప నది యొక సంకేతముగా దోచెను. నిదానించి కన్నమును బరిశీలించు చుండ నావల నుండి యెవరో చిటుక వైచి తన్ను బిలుచుచున్నట్లు గ్రహించి వెనుకటి రాతి సహాయమున కన్నమును సమీపించెను. ఆవలి మనుష్యుడు మెల్లగ నిట్లనెను. "జాగ్రత్త! కేకలు వేయకుము. చాల నెమ్మదిగ మాట్లాడుము. నే నెవ్వరనో తెలుసుకొంటివా?"

మల్హా:—గుర్తింపజాల కున్నాను. మీ రెవ్వరో తెలియజేయుడు.

"నేను ధనేశ్వరుడ" నని ప్రత్యుత్తరము వచ్చెను.

మల్హారరావునకు మితి లేని యాశ్చర్యము కలిగెను.

మల్హా:—నీవు ధనేశ్వరుడవా? నీవు చంపబడితి వని నిశ్చయించితిమి. నీవు వీరి చేతి కెట్లు చిక్కితివి?

ధనే:—ఆ వృత్తాంతమును తరువాత వచించెదను. నీవు ఈ సన్నదశమునకు సంబంధించిన వానినిగా దలంచు చుంటివా?

మల్హా:—నే నట్లు తలంప లేదు.

ధనే:—నే నీ రంధ్రమును పెద్దదిగ జేయుచున్నాను. నా దగ్గర నొక కత్తి యున్నది. దాని సహాయమున నే నీకన్నమును పెద్దదిగా జేయ బ్రయత్నించుచుంటిని. దైవకృపవలన నా యత్నము ఫలించినచో మన మిర్వురము కలసి యేదియో యొకయుక్తిని వెదకికొనవచ్చును. నీవు ద్వారమునకు డనుండి యెవ్వరైన వచ్చుచుండిన యెడల నాకు సాంకేతికముగ దెలియ జేయుము.

మల్హారరావు ద్వారమును సమీపించి యొక రాతియంచును వెదకి కనుగొని తనచేతి బంధనమును దానిపై రాచి యరుగ జేయ నారంభించెను. ధనేశ్వరుడు కన్నమును పెద్దదిగా జేయు ప్రయత్నములో నుండెను. కొంచెము కాలము బలముకొలది నరుగ జేయు నప్పటికి బంధనసూత్రము తెగిపోవుటచే మల్హారరావునకు చేతులు స్వాధీనమైపోయెను. ధనేశ్వరుడు విశేషప్రయత్నము చేసి యా రంధ్రమును పెద్దది జేసెను. మల్హారరావు రాతిసహాయమున కన్నమును సమీపించి ధనేశ్వరునకు సాయపడెను. ఇర్వురి ప్రయత్నముల వలనను నొక మనిషి సులభముగ దూరదగినంత సొరంగ మేర్పడెను. మల్హారరావు ధనేశ్వరునితో నిట్లనియె. 'నీవున్న వైపున కొన్ని రాళ్లున్నచో నా చేతి కందిమ్ము.' ధనేశ్వరుడు వెడల్పుగల రాళ్లను ఏరి మూడు నాలుగు రాళ్ల నందిచ్చెను. వాని సాయమున మల్హారరావు సులభముగ సొరంగములో నుండి దాటి ధనేశ్వరుని సమీపించెను. ధనేశ్వరుడు మల్హార

రావు చేయిబట్టుకొని యా గదిలోనున్న రహస్యమార్గము గుండ నీవలకు వచ్చెను.

ధనే:—మల్హారరావ్ ! ఇప్పుడు మనము దైవకృపవలన గదులలో నుండి వెలుపలబడితిమి గాని దాటిపోవలసిన ప్రదేశ మంతయు ముందేయున్నది. ఇది యొక గుహ. నలుప్రక్కల శిలామయమై భూగర్భమందున్నది. ఇప్పుడు మనము దాటిన రహస్య మార్గమును నిన్న రాత్రి నన్ను బంధించిన గదిముందు కావలి యున్న యిర్వురు దొంగల సంభాషణమువలన గ్రహించితిని. ఇచ్చటనుండి దాటిపోవలయునని విశ్వప్రయత్నములను జేసితిని. కాని మార్గము లభించినదిగాదు. నలుప్రక్కల నెత్తైన పర్వత కుడ్యములు. ఈ కటికచీకటిలో సురక్షితముగ పైకిపోజాలము.

మల్హా:—ఏదియో యొకవిధముగ పైకి పోయి తీరవలయును.

ధనే:—నాకేమియు త్రోవ కనుపడుటలేదు. ఒకవేళ ముందునకు సాగినను గుహాముఖద్వారమున గల దస్యుమండలి మనలబట్టి తీరును.

మల్హా:—ఇచ్చటికి నీవెట్లు వచ్చితివి ?

ధనే:—నే నా రాత్రి యొక కార్యార్థినై బయలుదేరితిని.

మల్హా:—కాగితములో చుట్టిన ముసుగును పారవేయుటకై వచ్చితిని.

ధనే:—నీ వా సంగతిని చూచితివా? సరియే తరువాత వినుము. నిజమునకు నేను కాలూరాయినిగాని, వాని యనుచరులలోని యొకడనుగానికాను. నిష్కారణముగ షట్చక్రదళము నన్ను బాధింప తలంపుతో నున్నట్లు విని యాత్మరక్షణమునకై నే నా ముసుగును తయారుచేయించితిని. దానిని ధరించినచో నన్నే కాలూరాయిగ దలంచి నా శత్రువులు నా వైపుకు రాకుందురని నిశ్చ

యుంచితిని. ఇంతలో నాటిరాత్రి హోటలులో నిజమైన కాళూరాయి ప్రవేశించుటచే నాకు భయము కలిగెను. నన్ను కాళూరాయగా దలంచి బంధించి నను సంకెలతో పాఱవేయ దలంచి బయలుదేఱితిని. నీవు నన్ను రక్షించితివి నను సంక నేమియును కలుగఁజేయ.”

అని చెప్పి తాను ముసుగును గోతిలో పాఱవేసినది మొదలు గోవర్ధనుని కుటీరములో ప్రవేశించుట, పులింద దీపము నార్పివేయుట వరకు గల సంగతిని వివరించి మరల నిట్లనెను.

“పులింద దీపము నార్పివేయుటతో తడవుగ నేనా చీకటిలో కుటీరమునుండి తప్పించుకొన దలంచి ద్వారమునకై పరుగున బయలువెడలి తిని. ఇంతలో వెనుకనుండి గోవర్ధనుడు వచ్చి నన్ను బట్టుకొనెను. మా కిరువురకు ఘోర యుద్ధము జరుగుచుండెను. శంభూ సింహుడును వెంటనే దీపమును వెలిగించి తీసుకొని వచ్చెను. ముగ్గురు కలిసి నన్ను బంధించిరి. తత్సమయమున నన్ను జంపుటకై శంభూసింహుడు గోవర్ధనుని ప్రోత్సహించెను. కాని మదనుడు అడ్డుపడి యిచ్చటికి గొనితెచ్చి యీ భూగర్భమున చీకటికొట్టున బంధించెను.”

మల్హా:—పులిందగతి యేమయ్యెను.

ధనే:—ఆమె సంగతి యేమయ్యెనో నాకు తెలియలేదు.

మల్హా:—పులింద కానవచ్చుటలేదు. ఏమయ్యెనో తెలియదు.

ధనే:—క్రూరుడగు గోవర్ధను డామెను చంపెనేమో?

మల్హా:—నాకును అదియే అనుమానము. నా అనుమానమునకు తగి నట్లు కుటీరములో ముందుభాగమున నేలపై నెత్తురు డాగులను చూచితిని. ఆ నెత్తు రెవరిదై యుండును.

ధనే:—అది గోవర్థనుని చేతి నెత్తురు. మే మిర్వురము పోరాడు చున్నప్పు డతని చేతి గాయమునకు పట్టీ యూడిపోవుటచే గాయము నుండి నెత్తురు కారెను.

అగ్గోక్తిలో ధనేశ్వరుడాగెను. అతనిదృష్టి మరియొక వైపు నుండుట గ్రహించి మల్హారరావు ప్రశ్నించెను. "అదేమి?"

ధనే:—ఎక్కడనుండియో వెల్తురు కనబడుచున్నది.

ఇర్వురు నిదానించి నలుప్రక్కల జూచుచుండిరి. కొండమీద ఎత్తుప్రదేశమున కాగడా వెలుగుచుండెను. కాగడా పుచ్చుకొని యొకడు నిల్చుండెను. వాని వెనుక మరియొక డుండెను.

వా రిర్వురను జూచి మల్హారరావు ధనేశ్వరునితో నిట్లనియె. "మన మీ గుహాంతరము నుండి బయలు పడుట దొంగలకు తెలిసి యుండును. తత్కారణమున మనలను పట్టుటకే కాగడా వెలిగించి యుందురు. మన మీ భూగర్భము నుండి బయలు పడు టెట్లో తెలియ లేదు".

ధనే:—ఈమూల నాగుదము రమ్ము. పైకి పోవుట కొకటే మార్గము. కడు సంకీర్ణము. మన కాత్మరక్షణోపాయము కానరా లేదు. పరమేశ్వరుడే రక్షింపవలయును.

కొండపై కాగడా పుచ్చుకొని వాడును వాని యనుచరుడును మాట్లాడుకొనుచున్న ధ్వని వినబడు చుండెను. ధనేశ్వర మల్హార రావు లా ధ్వని వినవచ్చిన వైపునకు దృష్టి నిగుడ్చి చూచు చుండిరి. గాఢాంధకారముగ నున్న నా ప్రదేశమున వారి ముందు ధడాలు మని పెద్ద చప్పుడుతో నొక వస్తువు పడెను. కొండపై నుండి వెలుగుచున్న కాగడా కూడ దొర్లుచు ప్రక్కను పడిపోయెను. ధనేశ్వర మల్హారు లా పడిన దేమో చూడవలయు నని తలంచి నిర్వ్యాజోన్ముఖులై యున్న

కాగడాను దీసికొని దాని వెలుగున జూచి యొక మనుష్యుడు గాన్పించెను.

ధనే:—నీ వెవ్వరు? ఎట్లు పడెను?

మల్హా:—గుహాముఖద్వారమున కావలి యుంచిన వారలలో నీ డొకడు. మన కింతకు ముందు కాగడాతో కొండపై నుండి కన్పడెను. కొండ పైభాగమున నడచుటలో రాత్రివేళ జాగ్రత్త తప్పుటచే కాలు జారి క్రింద పడినాడు.

మల్హారరావు ఆ పడిన వానిని సమీపించి వస్తువులను పరీక్షించెను. ఒక వాడి యైన కత్తియు, గుండ్లతో బారు చేయ బడిన పిస్తోలును దొరకెను. మల్హారరావు వానిని గట్టి జాగ్రత్త చేసెను.

క్రిందపడిన మనిషి విపరీతమైన బాధపడుచు కన్నులు తెరచి మల్హారరావును గుర్తించి పలుకరించెను: 'మల్హారరావ్!'

మల్హా:—నీ వెవ్వరవు?

దొంగ:—నన్ను నీవు గుర్తింపజాలవు. నేను ప్రదేశమునకు పహరా యిచ్చుచుంటిని. నిన్ను నేను గుర్తించితిని. నేను బ్రతుకను.

మల్హా:—నీ వెట్లు పడితివి?

దొంగ:—చీకటిలో కాలు జారినది. ఘోర భాగమున పడితిని. తలయందును గాయములైనవి. నేను జీవింపను.

మల్హా:—నీ వేమైన చెప్పదలచిన చెప్పుము. నీ పేరేమి?

దొంగ—నా పేరు రామేశ్వరుడు, నా యిల్లు వింధ్యక్షేత్రసమీపమున నున్నది. నేను లోహపు పనివాడను. లోహపువస్తువుల నమ్మెదను. ఎటువంటి గట్టి తాళముల నైన, చివరకు ఇనుపపెట్టెల తాళముల నైన నవలీలగా తీయగలను.

ధనేశ్వరసింహు డీలోపుగ నూరక నిల్చుండుట కన్న తోవ్రియ మైన దొరకునేమో యని వెదకుచుండెను.

రామేశ్వరుడు బాధను సహించుకొనుచు నిట్లనెను.

రామే:—నీవు భద్రగిరిమీద నొక శవమును జూచితివి.

మల్హా:—కాలూరాయి వేషమును ధరించి పడియుండెను.

రామే:—వాడే. వాడు కాలూరాయికాదు. వానిపేరు గోకులదాసు. వానిని నేనే చంపితిని. నేను వెళ్లిపోయిన తదుపరి యెవరో నిన్ను మోసపుచ్చుటకు కాలూరాయి వేషమువేసి పడవేసి నారు. ఎంతయో చెప్పవలసియున్నది. బాధచే చెప్పజాల కుంటిని. ఆ గోకులదాసు నా లోహపు కార్ఖానాలో పనిచేయు చుండువాడు. ఒకనాడు గోవర్ధనుడు నా దగ్గరకువచ్చి "మీర్జా పురములో నున్న యొక ధనాఢ్యుడైన వర్తకుని యింటికి కన్నమువేసి ధనమును దొంగిలింపవలయును. అందుల కుగా నాకు సాయపడవలయు"నని యడిగెను. మొదట నేనంగల కంగీకరింపలేదు. అతడంతతో విడువక ఆ వర్తకునకును తనకును బరస్పర విరోధ మనియు నా వైరము తీర్చుకొనుటకే యిట్లు చేయుచుంటినని చెప్పి మిక్కిలి బలవంతముచేయ తుద కంగీక రించితిని.

మల్హా:—తరువాత నేమి జరిగినది?

రామే:—గోవర్ధనునకు కావలసిన సదుపాయములను జేసి మువ్వురము కలసి యొకరాత్రి ధనాగారమును కొల్లగొట్టితిమి. పహరా యిచ్చుచున్న వా డడ్డము రాగా గోవర్ధనుడు వానిని చంపి వైచెను. అంతతో బోవక ఖజాంజీ దగ్గరనున్న రెండవ తాళపుచెవిని సంగ్రహించితిమి. అట్లు చేసిన నింద యతనిపై

బడు నను నమ్మకముతో నట్లొనర్చితిమి. ఆనాటి కార్యక్రమ మూరంతయు వ్యాపించెను. పహరావాని మరణమును గూర్చి భయంకర వార్తలు బయలు దేరుటచే మే మట నుండి వెరచి ప్రదేశమును గూర్చి చాల కాలము తిరిగి తిరిగి యిచ్చటకు జేరితిమి. బాధ...మూర్ఛవచ్చేను........

మల్హారరావు వాని పరిస్థితిని గమనించి తరువాయి వృత్తాంతమును వీని వలన తెలిసికొను నుపాయము లేకుండుటయు వీడిక జీవింప డనియు స్థిరపరచు కొనెను.

రామేశ్వరుడు కొనయూపిరితో "మల్హారరావ్ ! నీ కొక యుప కారము...చేయు చుంటిని ...కొంతదూరము...నడచిన... కుడిచేతి వైపున...గల సంకీర్ణ ...మార్గము...కొంప సుమా..."

రామేశ్వరుడు కనులు మూసుకొనెను. మల్హారరావు ధనేశ్వరుని బిలిచి రామేశ్వరుడు చెప్పినట్లు కొంతదూరము నడిచి కుడిచేతి వైపున తడవుకొనుచు బోవ నొక యిరుకు త్రోవ కాన్పించెను. వారిర్వు రా సన్నని త్రోవలో నడచు చుండిరి. చీకటి యగుటచే చేతులతో కాళ్లతో తడవుకొనుచు పాతిక గజముల దూరము పోవునప్పటి కొక ముసుగువాడు చేత కాగడాతో తమ కెదురు వచ్చుచుండుటను గనిపెట్టెను. వీ రిర్వురకును పైప్రాణములు పైన పోయిన ట్లాయెను. తమ ప్రయత్నము వ్యర్థ మయ్యె నని తలంచిరి. మల్హారరావు ధైర్యము వదలక రామేశ్వరుని కడ సంగ్రహించిన పిస్తోలును గురి చేసెను. క్రమముగ ముసుగువాడు సమీపించునప్పటికి మల్హారరావు పిస్తోలు గురిచేసి "నీ వెవరవు? ముసుగు తీయుము. లేదా ప్రాణము గోల్పోయెదవు." అని పల్కెను.

ముసుగువాడు "సోదరా! క్షమింపుము. ఇంకమీద నే నీ ముసుగును ధరింపను. క్షమింపుము." అని తన ముసుగును తీసివేసెను, కాగడా వెల్తురులో చూచి మల్హారరా వాశ్చర్యపడెను. "మిచువా! నీ వెట్లు వచ్చితివి?" అని ప్రశ్నించెను.

"ఇది మాటలకు సమయము కాదు. ఆవలకు బోయిన పిదప మాట్లాడుకొందము." అని పల్కుచు మిచువా ముందు నడచుచుండ మల్హార ధనేశ్వరులు వెనుకకు నడచుచుండిరి. ఆ సంకీర్ణ మార్గము పోను పోను వెడల్పు, విశాలము కల్గదె కన్పట్టెను. కొంతకాలము నడచునప్పటికి వీరు మువ్వు రొక గుహాముఖంబున ప్రవేశించిరి. లోన ప్రవేశించి పోవుచుండ వారి చెవుల కొక జంతువు యొక్క గర్జనము వినబడెను. మల్హారరావు పిస్తోలును చేత ధరించి నలుప్రక్కల జూచుచుండెను. వీరుమువ్వురు ముందు నడచిన కొలది గర్జన మధికమగుచుండెను. అకస్మికముగ నొక స్త్రీ కంఠ రవము వినబడుటచే ముగ్గురును విస్మితులైరి. ఒక స్త్రీ "టామీ ఇటు రమ్ము." అని పిలుచుచుండెను. ధనేశ్వర మల్హారరావు లొకరి ముఖ మింకొకరు చూచుకొని యాశ్చర్య పడుచుండిరి. ఈ నిర్జన గుహా ప్రదేశమున స్త్రీ కంఠస్వరము వినవచ్చుచున్నదే! ఎవ్వరా యువతి యని యాలోచించుచుండ గుహలో కొంచెము దూరమున దీపపు కాంతి కన్పడెను. ఆ వెల్తురులో నొక యువతీమణి వచ్చి వారి ముందు నిలువబడెను. మల్హారరా వామెను గుర్తించెను.

మల్హా:—పులిందా! నీవు జీవించి యుంటివా?

మల్హారరావు తటాలున పులింద యొక్క చేతిని గట్టిగ పట్టుకొనెను. పులిందకు గుండెలు కొట్టుకొన నారంభించెను.

మల్లా:—పులిందా! నిన్ను తిరిగి చూతు నని నే నెన్నడు తలంచి యుండలేదు. నీవు మరణించితి వని నిశ్చయించితిని. ఇట్టి సుయోగమును లభింప జేసిన దేవుల కీశ్వరున కనేక వందనము లొసంగు చున్నాను.

పులిం:—(కన్నీరు తుడుచు కొనుచు) నేను మీకు జ్ఞాపకముంటినా?

మల్లా:—నా హృదయమున నీకు గాక వేరొకరికి స్థానము లేదు. నాటి రాత్రి నీ కొరకై కుటీరమునకు వచ్చితిని. నీవు కాన రాక పోవుట చేతను కుటీరమునకు నిప్పు వేసియుండుట చూచి క్రూరాత్ముడైన నీ తండ్రి నిన్ను జంపి పారిపోయె నేమో యని నిశ్చయించితిని.

పులిం:—గోవర్ధనుడు నా తండ్రి కాడు. ఈ సంగతిని వాడే నాకు చెప్పి యుండెను. ఆ పాపాత్ముని రక్తములో నొక బిందువైన నా శరీరమున లేదు. నన్నాతడు హత్య చేయ సిద్ధపడెను. కాని మదనుడు తప్పించుటచే బ్రదికితిని.

మల్లా:—మిత్రమా! నీ రహస్యము నెఱింగింపుము.

మధు:—షట్చక్రదళము నిన్ను బంధించిన వెంటనే మాకు జాబు వ్రాసి తెలియజేసిరి. అందఱమును కొంచెము కాలము చింతించితిమి. కాని యే యుపాయమును తోచకపోవుటచే హోటలునకు బయలుదేరితిమి. నాకు మాత్ర మనుమానము మెండయ్యెను. మనము బయలుదేరిన సంగతి నీకును నాకును మధుసూదనరావునకును వెంటవచ్చిన యిర్వురకును గాక వేరొకరికి తెలియదు. శత్రువులకు మన జాడ యెట్లు తెలిసినది? మన అయిదుగురిలో నెవ్వరో యొకరు విరోధులలో

జేరి రను అనుమానము కలుగుటయే గాక నా సంశయ మూ వెంటవచ్చిన యిర్వురిపై బడినది. వెంటనే నే నా యిర్వురును వెన్నాడితిని. నేను సంశయించితి నను సంగతి వారికి తెలి యదు. హోటలులో సేవకు లుండు గదులను సమీపించి యొకదానిలో బ్రవేశించిరి. నేను మారువేషమును ధరించి యా ప్రాంతమందే సమీపముగా గొంగళి పరచుకొని పరుండి యుంటిని. రాత్రి పదునొక్క గంటల కా యిర్వురు వెలు పలకు వచ్చిరి. మధ్య మధ్య నేను గుర్రుకొట్టుచుండుటచే నిద్రించుచుంటి నని యే వారు తలంచి తమ రహస్యంబులను వెల్లడించుకొను చుండిరి.

ప్రథ:—మనల నెవ్వరు గుర్తింపలేదు గదా!

ద్వితీ:—మనయందు వారికి కొంచెమైన అనుమానము కలుగలేదు. నిశ్చయము.

ప్రథ:—ఎట్లయిన నేమి, మల్హారరావు చిక్కెను. ఇంక నే యాటంకము లేదు.

ద్వితీ:—వేళయైనది. నేను పాతాళముం జేరవలయును.

ప్రథ:—జాగ్రత్త. నలుప్రక్కల పరిశీలింపుము. సంకేతపదము జ్ఞప్తి యున్నదా? రేపు ఉదయము వచ్చెదను.

ద్వితీ:—మరచిపోలేదు, "భైరవి". ఇంక నేను పోయెదను. ఎవరి త్రోవను వారు వెడలిపోయిరి. ద్వితీయుడు పోయిన రెండు నిమిషములకు నేను మెల్లగ లేచి వెన్నాడితిని. వాడెంత జాగ్రతతో నున్నను పర్వతప్రాంత వాసిని, ఆటవికజాతిలో బుట్టిన భిల్లుడ నగు నా కన్నులలో దుమ్ము జల్ల లేకపోయెను. వానివెంట

బడి గమ్యస్థానముం జేరితిని. కొంతదూరము పోయినంతనే వాడు ముసుగుధరించి లోనికిపోయి తన వారితో నేదియో మాట్లాడి వెనుకకు వచ్చెను. నేనును నూరాడక పిల్లివలె వానిని వెన్నాడి యొక నిర్జనప్రదేశమునకు వచ్చిన వెంటనే సమీపించి వెనుకనుండి తటాలున రెండుచేతులతో వాని గొంతుకను పట్టితిని. ఎంతప్రయత్నించినను నా చేతుల నుండి తప్పించుకొనజాలక పోయెను. వాని నా కోక బంధించి పిస్తోలు చూపి భయపెట్టి వానివలన గోవర్ధనవృత్తాంతమును తెలిసికొని కాలుసేతులుగట్టి యొక గుప్తస్థానమున బడవేసి యా ముసుగును ధరించి సంకేతపదమును వింటినిగావున తత్సహాయమున గుంపులో జేరితిని. క్రమముగ నన్ను సర్దారు భాగీరథ గృహరక్షణముకై రామేశ్వరునితో నాల్గు బంపెను. అందే మీరిద్దరు బంధింపబడియుంటిరి.

మల్హా:—రామేశ్వరునితో కొండమీద మాట్లాడినది నీవేనా?

మిచు:—నేనే. వానివలననే గుప్తమార్గమును తెలిసికొంటిని. మిమ్ము వదలించుటకు రామేశ్వరు డాటంక మని గ్రహించి ఏమరుపాటున నున్న వానిని కొండపై నుండి క్రిందకు త్రోసి యట నుండి మిమ్ము తప్పించుటకై మీరు త్రోవను వచ్చు చుండ మీరు కాన్పించితిరి. ఇది నా వృత్తాంతము.

మల్హారరావు మిచువానియొక్క సమయస్ఫూర్తికి చాల సంతసించెను. గోవర్ధనుని బంధించుటకు తగిన సూత్రములను గూర్చి యాలోచించిరి. పులింద కొన్ని సలహాల నిచ్చెను. గోవర్ధనుని రేపే యెట్లయిన బంధించి తీరవలయు నని మల్హారరావు నిశ్చయించెను. షట్చక్రదళమునకు మదనజీయే సర్దా రని దృఢపడినది. కాని కాలూరాయి

ఎవరో నిశ్చయించుట కవకాశము దొరక లేదు. తత్కారణమున మదనజని బంధింపవలయునా లేదా యను విషయమును గూర్చి యాలోచించి యందరును కలసి యింటికి బయలుదేరిరి. స్వామియు వారి వెంట నంటెను.

17వ ప్రకరణము

—కాలూరాయని వన్నుగడ—

మరునాడు నిశ్చితసమయమునకు జయంతపురము నుండి శివనివాసమున కొక గుఱ్ఱపుబండి వచ్చుచుండెను. అందు ముగ్గురు కూర్చుండిరి. వారిలో నిద్దరు గొప్పవారు. మూడవవాడు మాసిన బట్టలు కట్టుకొని యుండుటచే తక్కువ కులమునకు చెందిన దరిద్రుడని తోచును.

బండి నడచుచుండెను. గొప్పవా రిద్దరు మాట్లాడుకొనుచుండిరి. మూడవవా డూరక కూర్చుండెను. వా రిద్దరిలో నొకరి పేరు మధుసూదనరావు. రెండవవారి పేరు భువనేశ్వరుడు. వీ రంద రును కలిసి శివనివాసము వచ్చుచుండిరి.

మధు:—పూర్వ మీ శివనివాసగ్రామము మంచియూరే కాని యిప్పు డీ స్థాన మంతయు దొంగలతో నిండినది.

భువన:— ఔను. నేనుగూడ చాల సంగతులు వినియుంటిని. బందిపోటు దొంగయైన కాలూరాయని వలన నీప్రదేశమంతయు తల్లడిల్లుచున్నది. పోలీసు వారీ విషయములో శ్రద్ధతీసుకొనలేదా?

మధు:— పోలీసు వారి సహాయము చేయజాలక పోయిరి. కొంతవరకు ప్రయత్నించినను వారికి [illegible] ఎద్దరు [illegible] సంతస్థానము కాబట్టి. వారి [illegible] నిజముగా భయంకర ప్రదేశమైనది.

మూర్ఖుడైనవాడు:- అయ్యా! శివనివాస మందిరపు మదనపల్లి చొక్క [illegible] మైనను [illegible] లేదు గదా? [illegible] తెలుపగలరా?

మధు:— తెలియజేయగలను. నాకు [illegible] మైన పరిచయము గలదా?

మూర్ఖుడు:— ఘోరమైన [illegible] పరిచయము ముందుగనే [illegible] —

మధు:— (ఆశ్చర్యముతో) [illegible] పరిచయము [illegible] మైనది? [illegible] —

మూర్ఖుడు:— ఎంతో కాలమైనది కాని బాగుగా జ్ఞాపకము లేదు.

ఆ ప్రసంగము మారెను. బండి భద్రగిరి ప్రాంతమునకు వచ్చెను.

మధు:— భువన [illegible] బాబూ! ఇదే భద్రగిరి ప్రాంతము. ప్రస్తుతము కాలూరాయుని ప్రదేశమే—

తటాలున బండి నిలిచెను. బండిలోని ముగ్గురును బండి ఆగుటకు కారణమేమి యని తలంచుచుండిరి. ఎదురుపడిన ఒక భయంకరవ్యక్తి బండిలో ప్రవేశించెను. శరీరము నిండ నల్లని ముసుగు. చేతిలో పిస్తోలు కలదు. మధుసూదనరావు నోటినుండి "కాలూరాయి" అని అస్పష్టాక్షరములతో వినబడెను. మధుసూదనుని ముఖము కళావిహీనమై పోయెను.

కాలూరాయి చేతులలో ధరించిన పిస్తోళ్ళను సరిజేసికొని ముప్వురతో నిట్లనియె. "మహాశయులారా! మీదగ్గరనున్నదాని నిట నుంచుడు. వ్యర్థసంభాషణము వలన ప్రయోజనము లేదు.

మధు:—ఏమి కావలయును?

కాలూ:—మార్గపు పన్ను. గవర్నమెంటుకు చెల్లించవలసిన సుంకము నెల్లాసంగెదరో యట్లే యీ మార్గమున బోవు వారు నాకు పన్ను చెల్లింపవలయును. ఈ మార్గ మంతయు నా యధీనము. కెంకు. దగ్గరనున్న దంతయు నిచ్చివేయుడు.

మధు:—నా దగ్గర నేమియును లేదు.

కాలూ:—ధనము లేకున్న నేమి? ప్రాణమున్నదిగదా! దానినే తీసికొనెదను.

మధుసూదనుడు విధిలేక జేబులో నున్న దంతయు నిచ్చెను. భువనేశ్వరుడు నట్లే యొనర్చెను. మూడవవాడూరక చూచు చుండెను. కాలూరాయి మూడవవానిం జూచి "నీ దగ్గర నే మున్నదిరా? అని కేక వేసెను.

మూడవ:—చిరిగిన పాతిబట్ట లున్నవి. వలయునెడల తీసికొనుము. ఇంతకన్న నేమియును లేదు. మదనజీని చూడబోవు చుంటిని. ఏమైన నిచ్చినచో తిరిగి వెళ్లునప్పుడు నీకు సమర్పించెదను.

కాలూరాయి వానిని తీక్ష్ణదృష్టితో జూచి యిట్లనియె. "నీవు మదనజీని గుర్తింపగలవా?

మూడవ:—గుర్తింపగలను. ఎట్టి సమయముల యందైనను గుర్తింపగలను.

కాలూ:—అసత్యము. నీ వంటి కుక్కలతో మదనజీ మాట్లాడడు,

కాలూరాయి ఒక్క యురుకున బండి దిగి తలుపు బిగించి వెడలి పోయెను. మధ్యాహ్నకాలము దాటిన తదుపరి బండి దుర్గాహోటలు ముందు నిలువబడెను. మధుసూదనరావు బండి దిగెను. దిగుటతో తడవుగ నతని చూపులు ద్వారము కడ నిలువబడి వేరొక నౌకరితో మాట్లాడుచున్న మదనజీపై బడెను. వెంటనే, మదనుడే కాలూరాయి యగునా? ఏమో! ఎట్లు చెప్పనగును? ఘనముతో గూడ నా యిరుకైన కొండత్రోవలలో నుండి బండికన్న ముందు వచ్చుట సాధ్యమా! మధుసూదనరావేదియు నిశ్చయింపజాలక చింతితహృదయుడై తన గదిలోని కేగెను. భావనేశ్వరుడు నా హోటలులోనే బసచేసెను. మూడవవాడైన దరిద్రవ్యక్తి కొంతకాల మా హోటలు ముందు నిలువబడి చూచి మరి యొక చౌకబారు హోటలును వెదకుకొన బోయెను. దుర్గాహోటలునకు కొంచెము దూరములో "గ్రామీణాశ్రమము" అను పేరు గల మరి యొక హోటలు కలదు. అది పేదవారి కొఱకేర్పరుపబడినది. మన దరిద్రవ్యక్తి యచటి కేగి యొక గదిని దీసికొని యందు బసచేసెను.



సాయంకాలము కావచ్చుచుండెను. మదనజీ గదిలో కూర్చుండి యుండెను. ముఖమున చింతారేఖలు ప్రకటమగుచుండెను. గత రాత్రి షట్చక్రదళము యొక్క జైలునుండి బంధితులు పరారి యగుట, రామేశ్వరుడు చనిపోవుట, మొదలగు వృత్తాంతము తెలిసినదో లేదో! తెలియకున్న నీ చింత యేల? క్రమముగ సంధ్యాకాలమైనది. చీకటి వ్యాపించుచున్నది. మదనజీ గదిలోనుండి లేచి దీపమును వెలిగించి మంచముపై కూర్చుండ బోవుచుండెను. ఇంతలో మన దరిద్రవ్యక్తి యట ప్రత్యక్షమై "మిత్రమా! కుశలముగ నుంటివా?" అని ప్రశ్నించెను. మదనజీ వానిని పాదాది శిరఃపర్యంతము పరిశీలించెను,

మద.—నీ వెవ్వరితో మాట్లాడుచుంటివి ? నీవు నన్ను గుర్తించలేను.

దరి:—మిత్రమా ! పరిహాసము జేయుచుంటివా ! నే నెవరినో తెలియ లేదా ! ఆలోచింపుము. తప్పక తెలిసికొన గలవు.

మద:—బుద్ధిహీనుడా ! నీ వెవ్వరవో నే నెరుంగను. నీ కపట వేషము లను కట్టిపెట్టుము.

దరిద్రు:—హా శుంఠా ! ఎంత మాటంటివి. నన్నెఱుంగవా ? నా దరిద్ర మును గ్రహించి యిట్లనుచుంటివి. కాని జయంతపురములోని శివరామదాసు నెఱుంగవా ?

మదన:—నీ వెన్ని చెప్పినను లాభము లేదు. నేను నిన్నెఱుంగను.

దరిద్రు:—ఇంకను జ్ఞాపకము చేసెద నాలింపుము. 1925 వ సం. రం. జనవరిలో నీవు నా యింట నుండలేదా ! చాల కష్టస్థితిలో నా యింట పడియుంటివి. చాలునా ! ఇంకను జ్ఞాపకమునకు తెచ్చుకొని రావలయునా ? ఆ డబ్బు తీసుకొని ప్రాగాకు బయలు దేరనుంటివి. బయలుదేరు నాటికి వెనుకటి దినముననే నీవు జబ్బుపడి యుండుటచే నా ద్రవ్యమును తారాబాయితో పంపి తివి. త్రోవలో కాలూరాము బండి నడ్డగించి ధనమును దోచుకొనెను. జ్ఞాపకమునకు వచ్చినదా ?

మదన:—నాకు బాగుగా జ్ఞాపకమున్నది. నీవు నిజముగ శివరామదాసు వైనచో నీకు రావలసిన దా న్నాడే చెల్లించి యుంటిని. మరల నిచ్చుటకేల వచ్చితివి?

శివ:—ఆ నాడు నీకు శుభ దినము. నాటి నుండియు నాకు దుర్దిన ములు. భిక్షుకుడనై తిరుగుచుంటిని.

మదన:—నీకుఁ బిచ్చియెత్తినదా యేమి?

శివ:—పిచ్చి కాదు. నిశ్చయమే పల్కుచుంటిని. ఎవని యింట నుండి, నీవు లక్ష రూపాయల నార్జింప గల్గితివో వానికి కష్ట సమయమున తోడ్పడజాలవా?

మదన:—బ్రహ్మాండ! అవునా! నేనా రూపాయలను సంపాదించితినా?

శివ:—ఇంకొక సమాచారమును నేను చెప్పవలసియుండెను.

మదన:—అబద్ధము. నేను నీ యింట నొక గ్రహస్థుడనై యుండుట నీవు నాగాచియు నిల్లాలి పత్యే దను.

శివ:—బాలకులను భ్రమపెట్టినట్లు నన్ను భ్రమపెట్టజాలవు. నీ నా మాయ లకు లోబడను. నాకు నీ గుట్టంతయు తెలియును.

మదన:—నీవు వ్యర్థముగ చెప్పిన వినుచుంటిని కాని, నేనే యీనాడు పిలిచి మెడబట్టి గెంటించెదను. అప్పుడు కాని నీవు బుద్ధి రాదు.

శివ:—నా మాటను వినుము. అట్లు చేయకుము. సత్యాగ్రహాసనమీద నా నిజము చెప్పవలసి యుండెను. లక్ష రూపాయిలను రూపాయల నపహరించినది నీవేయనియు, కాలూరాయని వేషధారివై తిరుగుచున్నది నీవే యనియు పలువురితో చెప్పవలసి యుండును.

మదనుకు నిరుత్తరుడై పోయెను. రెండు నిముసములకు,

మద:—నీవు శివరామదాసువు కావేమో! నా కనుమానముగా నున్నది. అప్పటి నీ రూపమునకు ఇప్పటి రూపమునకు పోలిక లేదు.

శివ:—నే నీ సంగతిని మల్హారరావు నెదుట ఋజువు పరచెదను.

మద:—నీవు నన్ను వ్యర్థముగ ననుమానించుచుంటివి. నా మాటలు యథార్థములు. నేను కాలూరాయని కాను. గోపాలరావు

మధుసూదనరావు కంపెనీ తాలూకు పైస నైనను నాకు చెందలేదు. నీవు నిక్కముగ శివరామదాసు వైనచో నీకీ కష్టమున దోడ్పడ గలను.

అని పల్కుచు పది రూపాయల నోటు నొకదానిని వాని చేత నుంచి "జాగ్రత్త. పొమ్ము. మార్గమున నేను కనపడినను నాతో మాట్లాడ కూడదు. రేపు మధ్యాహ్నము భద్రగిరి ప్రాంతమున నన్ను కలియుము. సంగతి యంతయు నీతో వచించెదను."

శివరామదాసు 'సరే' యని తల యూచి వెడలి పోయెను. మదనజీ వెంటనే లేచి వానిని వెన్నాడి వాని యునికిని తెలుసుకొనెను. ఇట్లనుకొనెను.

"సరియే. ప్రదేశము మన కనుకూలమే. శివరాన్! సురక్షిత ముగ నుండుము. నీవు రేపు సూర్యుని జూడ జాలవు. మదనజీతో చెలగాటమా?"

---

18 వ ప్రకరణము

—గ్రామీణ ఆశ్రమములో—

గోవర్ధనసింహుడు కొన్ని దినముల నుండి తన గుడిసెను వదలి కొండల మధ్య దాగి యుండెను. మదనజీ వాని కొఱకు పలు బాధలు పడి యతి కష్టముపై వాని జాడ తెలుసుకొని వానిని గలుసుకొనెను.

మదన:—గోవర్ధనా! నీతో నవసర మైన పని యున్నది.

గోవ:—నా వలన నీ కేమియు లాభము లేదు. నే నితరులతో సంబంధము వదలితిని. నా వలన నీ కెట్టి పనియు జరుగదు.

మదన:—నీ వెవరికొఱకు భయపడి యిట చేరితివో వానిని పూర్తి జేసితిని. ఇంక వాని భయము లేదు. ఇప్పుడొక క్రొత్తగూఢచారి నా రహస్యమును తెలుసుకొని నన్ను వెన్నాడుచున్నాడు. నేటిరాత్రి వాని పని పూర్తి చేసికొని రేపు ప్రాతఃకాలమున నిచ్చట నుండి మకాము ఎత్తివేయవలయును.

మల్హారరావు మరణించిన వార్తను విని గోవర్ధనుడు మదనజీ చెప్పినట్లు చేయుట కంగీకరించెను.

గ్రామీణ ఆశ్రమము యొక్క యజమాని పేరు కరుణాశంకరుడు. దొంగలతోడను హంతకులతోడను నతనికి సంబంధము కలదు. గోవర్ధనున కతడు చిరపరిచితుడు. మదనజీ చెప్పినట్లు గోవర్ధనుడు కరుణాశంకరునితో గలసికొని చెవిలో నేదో చెప్పెను. అంమల కతడు సంతసముతో నంగీకరించెను. వెంటనే మూలచందు అను తన సహచరు నొకని బిలిచెను. వాడు గంజాయిని సేవించుచు యజమాని పిలుపును విని సమీపించెను. కరుణాశంకరు డతనికి కర్తవ్య జ్ఞానమును బోధించి యిట్లనెను. "కార్యము పూర్తియైన యెడల మన కిర్వురకును లాభము కలుగును."

మూలచందా మాటల కంగీకరించి వెంటనే శివరామదాసుని గదిలోనికి బోయి యతనితో ప్రసంగములకు మొదలు పెట్టెను.

రాత్రి పది గంటలు దాటినది. శివరామునకు నిద్ర వచ్చుచుండెను. కరుణాశంకరుని పిలిచి తనకు పరుండుటకు గది చూపుమని యడిగెను. కరుణాశంకరుడు 8 వ నెంబరు గది తాళపు చెవిని శివరామున కిచ్చి 9 వ నెంబరు గది తాళపు చెవిని మూలచందున కిచ్చెను, 'గదులలో చాపలు తలగడలు నుండును, పోయి పరుండుడు.'

అని చెప్పెను. ఇద్దరును తమ తమ గదులను జేరి తలుపుల దెరచి కూర్చుండిరి.

శివ:—ఇచ్చట సారాయము దొరకునా ?

మూల:—దొరకక పోవుటేమి? పైస యుండిన నన్నియు లభించును.

శివరాముడు వానిచేతిలో నొక రూపాయ నుంచెను.

మూలచంద్రు వెళ్లి సారాయిని తీసుకొనివచ్చెను. ఇద్దరు నా చీకటిలో గూర్చుండి తృప్తిగా సారాయిని సేవించి గదులలో పరుండిరి. క్రమముగ రాత్రికాలము జరుగుచుండెను. రెండు యామములు దాటెను. సత్రములో ప్రతిప్రాణియు నిద్రాబద్ధమై యుండెను. తత్సమయమున గోవర్ధనుడు మెల్లగ లేచి కరుణాశంకరునితో నిప్పుడ నియె. ఇంక నాలస్య మెందులకు. మూలచంద్రు నిద్రించుచుండెనేమో?

కరు:—సత్వరముగ కార్యక్రమమును ముగింతము రమ్ము.

ఇద్దరును గదులను సమీపించిరి. 9 వ నెంబరు గదిని సమీపించి తలుపును తట్టిరి. లోపలనుండి ప్రత్యుత్తరము రాలేదు. నిద్రించుచుండెనని తలంచి శివరాముని 8 వ నెంబరు గదిని సమీపించి తలుపు దగ్గర చెవి యొగ్గి వినుచు నిల్చుండిరి. లోపలనుండి నిద్రించువాని గుఱ్ఱు వినవచ్చుచుండెను. తలుపులు లోపల బంధింప బడినను బయటనుండి తీయుట శంకరు డెఱింగిన వాడగుటచే తలుపుల గడియను దీసెను, మొనపువత్తిని చేత ధరించి కరుణాశంకరుడు వెలుపల నుండెను. గోవర్ధనుడు ఖడ్గపాణియై గదిలోని కేగి పరుండియున్నవాని గుండెలను గురి జూచి యొక్క పోటు పొడిచెను. కత్తి లోపలికి దిగెను. ఆః ఆః. అను అస్ఫుటార్త నాదము వినబడెను. శత్రువు మరణించె నని తెలుసుకొని శంకరుని లోనికి బిలిచెను. కరుణాశంకరుడు లోనికేగెను దీపపు వెలుగున మృతవ్యక్తియొక్క ముఖమును జూచిరి. ఇద్దరకును గుండెలు బ్రద్దలై

పోయెను. గోవర్ధనుడు భీతచిత్తుడై "సర్వనాశనమైనది. మూలధనమును జూపితిని. దుర్మార్గుడగు శివరాముడు బ్రతికెను." అని పల్కెను.

వెనుకనుండి పెద్ద నవ్వు ధ్వని వినబడ వెనుకకు తిరిగి చూడ శివరామదాసు ద్వారమున కృష్ణునివలె నిలువబడి యుండెను. రెండు చేతులలో రెండు పిస్తోళ్లున్నవి.

శివ:—"మిత్రులారా! పిరికిగా మీరే గ్రహించితిరి. మూలధనము సొరంగము నుండి వచ్చునట్లే పోవుచున్నది. నీవు తాళపు చెవులను సంపాదించి కాపాడుచున్న మూలధనము నా గదిలోనికి పంపుచున్నాను. గోవర్ధనా! నాయనమ్మ మల్హారరావు చనిపోయెనని తెలిసినది కాదా. నీ నెవ్వ రనో తెలియునా? శివరాముడను కాను యువ మల్హారరావును."

గోవర్ధనుడు వడకుచుండెను. మల్హారరావు ఈలవైచెను. ఆ ధ్వనిని విని యిద్దరు భటులు గదిలోనికి వచ్చి నిలువబడిరి.

మల్హా:—వీరిద్దరిని బంధింపుడు.

భటులిద్దరును కరుణాకరుని బంధించిరి. గోవర్ధనుని బంధింపబోవు నంతలో నతడు భటుల ఏమరుపాటును గమనించి ప్రాణములకు తెగించి యొక్క యురుకున పట్టుకొనిన భటుని బడ ద్రోసి పారిపోయెను. మల్హారరావు వాని సాహసమునకు ఆశ్చర్యపడి వాడు పోయిన వైపునకు గురిచూచి పిస్తోలును పేల్చుచు వెంట బడెను. భటులిద్దరు బంధించిన కరుణాకరుని కట్టిపెట్టి యుండిరి.

మల్హారరావు గోవర్ధనుని వెంట కొంత దూరము పరువెత్తి ముందునకు జూడ గోవర్ధనుడు పడి యుండెను. తన గురి తప్పిపోలే దని గ్రహించి, గోవర్ధనుని సమీపించి పలుకరించి "గోవర్ధనా! ఆత

సంరక్షణము కొరకు నీ వెంత పోరాడినను లాభము లేదు. విధాత నీ కింతవర కనుకూలుడై యుండుటచే నీ యాటలు సాగినవి. నీ దుష్కృత్యములు కమ్మిదల యైనవి. ఇంక ప్రయోజనము లేదు. నీ చౌర్యములు నీ హత్యలు బయల్పడినవి. నీవు వెనుక మీర్జా పురములో సాహుకారు యింటికి కన్నము వేసి అడ్డు వచ్చిన వానిం జంపి ధనమును దొంగిలించిన వివర మంతయు నాకు రామేశ్వరుని వలన తెలిసినది. నూరు ప్రమాణములకు కొదువ లేదు. శిక్ష ననుభవింప సిద్ధపడుము.

గోవ:—అసత్యము. కావలి వానిని జంపినది రామేశ్వరుడే.

మల్హా:—కొంత లోని వారెవ్వరు నీకు రహస్యముగ తోడ్పడ లేదా?

గోవ:—లేదు.

మల్హా:—కేవలము మీరు ముగ్గురేనా ?

గోవ:—మేము ముగ్గురమే కాని నాలుగవ వారెవ్వరును మాకు సాయము చేసి యుండలేదు.

మల్హా:—ఇది యదార్థమా ?

గోవ:—నిశ్చయము.

మల్హారరావునకు సంశయము రహిత మయ్యెను. గోవర్ధనుని చేతులను గట్టిగ బంధించి తన భటుల నిరువురను బిలిచెను. వారిర్వురును కరుణాశంకరుని 9 వ నెంబరు గదిలో నుంచి మల్హారరావును సమీపింప నతడు గోవర్ధనుని భద్రముగా గనిపెట్టి యుండు డని వారిర్వురకు నప్పగించి తాను మరికొన్ని విషయములను దెలుసుకొన కరుణాశంకరుని కడ కేగెను.

గోవర్ధనుడు బాధ నభినయించుచు పడి యుండెను. భటు లిరువురును వానిని బంధితుడు, ప్రశాంతుడగుట నెచ్చట పోగల డని తలంచి నిల్చుండి తమలో తాము మాట్లాడుకొను చుండిరి. చోర శిఖామణియైన గోవర్ధను డా తరుణము గనిపట్టి నేలపై నుండి ద్రొర్లు కొనుచు కొంత దూరము పోయి సత్తువను పుంజుకొని పరువెత్త నారంభించెను. మల్హారరావు తిరిగి వచ్చి చూచు సరికి గోవర్ధనుడు లేడు. కరుణాశంకరుని భటుల కప్పగించి, గోవర్ధనుని వెన్నాడి పోయెను.

సాయంకాలమునకు మల్హారరావు ఒంటరిగ తిరిగి వచ్చెను. అందరును కలసి [illegible] పోయిరి.

19వ ప్రకరణము

—గోవర్ధనుని గుప్తస్థానము

మరునాటి ప్రాతఃకాలమున మల్హారరావు గోవర్ధనుని యొక్కయు మదనుని యొక్కయు జాడల నరయుటకై ప్రయత్నము చేసెను. తిరిగి తిరిగి పర్వతప్రాంతముల కేగెను. [illegible] బోయెను. ఆకస్మికముగ వాని దృష్టి యొక [illegible] బడెను. [illegible] వెంటనే మల్హారరావు వులిక్కిపడెను.

పర్వత ప్రాంతమున ప్రవహించుచున్న యొక నది యొడ్డునగల రహస్యప్రదేశమున గూర్చుండి గోవర్ధనుడు నేలలో త్రవ్వుచుండుటయు వానికి సుమా రిరువది గజముల దూరమున వెనుకగ నొక చెట్టుచాటున నుండి కాలూరాయి గోవర్ధనుని ప్రయత్నమును పరిశోధించుచుండు

టయు మల్హారరావు కనుగొనెను. వెంటనే తానొక గుప్తప్రదేశమున నిల్చుండి యీ విచిత్రమును చూచుచుండెను.

గోవర్ధనుడు గోతిని త్రవ్వెను. దానిలోనుండి యొక టిన్ రేకు పెట్టెను బయటికి తీసెను. అదియే గోవర్ధనుని గుప్తధన మని మల్హారరావు గ్రహించెను. పెట్టెను జూచి సంతసించుచు గోవర్ధను డిట్లనియెను. "ఇదియే గోవర్ధనుని గుప్తధనము. ఎవరి ధనమో.—ఎవ్వ రనుభవించుచుండిరో తెలిసికొనుట కష్టము. కాలూరాయి ధర్మమా యని నాకు లభించినది"

వెనుక దాగియున్న కాలూరాయి గోవర్ధనుని సమీపించెను.

కాలూ:—గోవర్ధనా! నిశ్చయముగ వచించితివి. కాలూరాయి వలన నీకా ధనము లభించినది. దానిని అపగా తన ధనమును గొని పోవుటకై కాలూరాయి స్వయముగ వచ్చి యున్నాడు.

గోవర్ధనుడు భయకంపితుడై వెనుకకు తిరిగి చూడ కాలూరాయి హస్తము తన కంఠమును నొక్కిపట్టి యుండెను. గోవర్ధను డెంత వేగముగ బరుగెత్తినను మల్హారరావుయొక్క పిస్తోలు దెబ్బ వలని బాధచే తప్పించుకొన జాలక పోయెను. ఆ గుండుదెబ్బ వలని బాధ వానిని మిక్కిలి పీడించుచుండెను.

కాలూ:—ఘాతుకా! దొంగా! నేను జీవితాశను బరిత్యజించి యొకరి నుండి రు 1,50,000 లు దొంగిలించి దాచుకొనగా దానిని నీ వపహరించితివా? నిన్నటివరకు నా ధనమును దొంగిలించిన వా రెవ్వరో కనుగొనజాలక పోయితిని. నీ సంగతి నిన్ననే తెలిసికొంటిని. లేకున్న నేనాఁడో నా చేతు లలో జచ్చి యుందువు.

గోవ:—వదలుము. [illegible] బాధ యధికముగా నున్నది. లేకున్న నీ పని పట్టి [illegible] యుందును? [illegible] నా తప్పే మున్నది? నేను దొంగను. నా [illegible] కను పడినచో తీసుకొనక విడుచుదునా? [illegible]. నీవును దొంగవే కదా! [illegible] నిశ్చయము [illegible] చెడవా!

కాలూ:—పాపీ! నీ [illegible] యుందువా? [illegible] నా జీవిత మెంతో నాశన మైపోయినదో తెలుసు కొంటివా? [illegible] ప్రియమైనము. ఆ [illegible] నా జీవితమును సుఖమయముగ చేసి [illegible]. [illegible] తనము [illegible] యుందును. [illegible] నాకు [illegible]. [illegible] హము చేసినది నీకొరకేనా! నా [illegible] [illegible] పుత్రుడు.

కాలూరాయు గోవర్ధనుని గొంతుపట్టి [illegible] చాతీపై గూర్చుండి [illegible] యుండెను. గోవర్ధనుడు [illegible] బాధ నంతయు సహించుకొని [illegible] యుండెను.

వీరిద్దరికి గడబిడలో [illegible] యున్న మల్హారరావు ముందునకువచ్చి [illegible] గోవర్ధనుని [illegible] యుండెను. గోవికి ముందుభాగమున కాలూరాయు గోవర్ధనుని [illegible] ఎదురు రొమ్ముపై గూర్చుండి యుండెను. తరుణమును గనిపెట్టి మల్హారరావు మెల్లగ ముందున కేగి యా పెట్టెను సంగ్రహించి, వెనుకకుబోయి యొక సురక్షిత స్థానమున భద్రపరచి తిరిగి వచ్చెను. తిరిగి వచ్చి చూచు నప్పటికి కాలూరాయు గోవర్ధనుడు నదిలో నుండిరి. గోవర్ధనుని కళే బరము నీటిపై తేలుచుండెను. కాలూరాయు గట్టునుజేరి గోతిని సమీ

పించి చూడ, పెట్టె కనుపడలేదు. చుట్టుప్రక్కల నెచ్చటను కానరాలేదు. "మా యిర్వురి పోట్లాటలో నా పెట్టె నొల్లి నదిలో పడియుండును. కానిమ్ము; తొందర యేమియును లేదు. మరల వచ్చి దానిని తీసుకొన వచ్చును. నోట్లు తడియుట కవకాశము లేదు. ఆ పెట్టె సురక్షిత మైనది. ప్రవాహ మధ్యమున బడినను నీటి బొట్టైనను లోనికి పోదు. కావున నిదానముగా వెదకి తీసుకొన వచ్చును." అని కాలూరాయి నిశ్చయించెను.

ధనపు పెట్టెను సంగ్రహింప బోవు నప్పుడు మల్హారరావు కాలూరాయి గోవర్ధనుల కలహమును బరికించెను. ప్రమాదమున కాలూరాయి ముసుగు తొలగుటచే సూక్ష్మదృష్టియైన మల్హారరావు కాలూరాయి ముఖమును జూచి యాశ్చర్య పడెను.

కాలూరాయి పర్వత ప్రాంతమునకు బోయి నలుప్రక్కల పారజూచెను. ఎవ్వరును కానరాలేదు. తటాలున తన శరీరమున గల ముసుగును తీసివేసి యొక గౌరవనీయ వ్యక్తి వలె దుస్తుల ధరించి శివనివాసమునకు బయలుదేరెను. గుట్టలచాటున నుండి కనిపెట్టి యున్న మల్హారరావునకు సంశయము తీరిపోయెను

పాఠకులారా! భయంకర చోరాగ్రేసర చక్రవర్తి యగు కాలూరాయి ఎవరు?

ఉపసంహారము జదువుడు!

---

20 వ ప్రకరణము

—: ఉపసంహారము :—

మధ్యాహ్నకాలము. దుర్గాహోటలులోని సావడిలో సభ సమావేశ మయ్యెను. యశవంతసింహుడు, మల్హారరావు, మధుసూదన రావు, సోమేశ్వరుడు, భువనేశ్వరుడు, తాని, పులింద మొదలగు వారు బాగులుతీర్చి కూర్చుండిరి. గ్రామములోని కొంతమంది పెద్దలు, నల్వురు రక్షకభటులు వచ్చియుండిరి.

ఆకస్మికముగ ధనేశ్వరుడు సభలోని కరుదెంచెను. అందరు విస్మితులై చూచుచుండిరి. తానికి హృదయమున లజ్జావిచారములు పెనగొనెను.

సోమేశ్వరుడు లేచి గంభీరస్వరమున నిట్లనియె.

"మహాశయులారా! మీ కందరి కిష్టము లేకపోయినను నేను నా కర్తవ్యము నిప్పుడు నెఱవేర్చుకొన బోవుచుంటిని. అందులకు క్షమింతురుగాక! నన్ను మీ రందరును దుర్గాహోటలునకు అసిస్టెంటుమేనేజరు నని తలంచుచున్నారు. కాని నేనట్టివాడనుగాను. నేను మీర్జాపురములోని రహస్యాపరాధపరిశోధక శాఖకు సంబంధించిన కర్మచారిని. నేనిప్పుడే ధనేశ్వరుని, హత్యాపరాధమునకును, చౌర్యమునకును ప్రభుత్వమువారి అనుమతిని బంధించుచున్నాను. ఇతని యదార్థ నామము కుబేరసింహుడు. ఆ వివరమును వినుండు. నేటికి సుమారు మూడు సంవత్సరముల క్రిందట సుప్రసిద్ధ ధనాఢ్యవ్యక్తి యగు భవానీ ప్రసాదు యొక్క ధనాగారమును దొంగలు దోచుకొనుటయే గాక రక్షకుడైన భటుని జంపివేసిరి. ఆ ధనాగారమునకు రెండు తాళము చెవు లుండును. తాళములు మిగుల సురక్షితములైనవి. ఒక తాళపు

చెవి యజమాని దగ్గరనుండును. రెండవ తాళపుచెవి విశ్వాసపాత్రుడును ఖజాంచీయైన కుబేరుని యొద్ద నుండును. దొంగతనము జరిగిన తరువాత యజమాని దగ్గరనున్న తాళపుచెవి లభించినది. కాని కుబేరుని తాళపుచెవి దొరకలేదు. అందువలన పోలీసువారికి కుబేరునిపై అనుమానము కలిగి బంధించుటకు వారంటు జారీచేయించిరి. కాని కుబేరు డంతర్ధానుడయ్యెను. అతనిని పట్టుటకై నియమింపబడిన పరిశోధకులలో నేనొకడను. ఈ యాత్రికులలో నీ హోటలులో ధనేశ్వరుడను మారుపేరున నివసించుచున్న వ్యక్తియే కుబేరు డని గ్రహించితిని. కావున నే నిప్పుడు బంధించుచున్నాను.

అని చెప్పి సోమేశ్వరుడు ధనేశ్వరుని చేతులను బట్టుకొనెను.

ధనే:—నా నిజమైన పేరు కుబేరుడే. కాని మీరు చెప్పిన రెండు నేరములలో నే నొకటియు చేయలేదు. దైవమును దలచుకొని చెప్పుచుంటిని. దొంగతనము జరిగిన నాటిరాత్రియే నా పరుపుక్రింద నుండు రెండవ తాళపుచెవి కూడ దొంగిలింపబడినది. మరునాడు గృహమంతయు వెదకితిని. కాని దొరకపోవుటచే నపరాధము నాపై మోపబడుటయే గాక పోలీసులకు చిక్కవలసి యుండును. లోకులు నన్ను చోరు డని తలంచెద రను భయమున నటనుండి పారిపోయితిని. ఇది నా వృత్తాంతము.

మల్హా:—నేనును మొదట నిన్ననుమానించి యుంటినిగాని విమర్శించిన పిదప నీవు నిర్దోషి వనియు, నపవాదము నీ శిరమున మోపబడెననియు గ్రహించితిని. సోమేశ్వరా! నాడు నీవు గోవర్ధనుని కుటీరమున నన్ను గలియుటకు ముందే నిన్ననుమానించియుంటిని. నీవు గూఢచారి వని గ్రహించితిని. నేను గూడ నీ వలెనే పరిశోధక శాఖకు సంబంధించిన వాడ

నగుటచే నా విమర్శనమున దెలిసిన యథార్థమును వచింపు చుంటిని. విశ్వసింపదగినదో, లేదో, నీవే తరువాత యోజించు కొనుము. కుబేర సింహుడు నీ వనుకొని నట్లు హంతకుడును కాడు. చోరుడును కాడు. నిరపరాధి. అతడు చెప్పిన దంతయు యథార్థము. ఆ దొంగతనమును గోవర్థనుడు, రామేశ్వర - గోకులదాసుల సాయమున చేయగల్గెను. కావలివాడు గోవర్థనునిచే జంపబడెను. దొంగతనము చేసిన రాత్రియే కుబేరసింహుని తాళపుచెవిని సంగ్రహించిరి. తమపై నేరము మాసిపోవుట - కాదు, తమపై ననుమానము కలుగకుండుటకే యట్లొనర్చిరి. ఈ సంగతి రామేశ్వరు డంగీకరించి యున్నాడు. గోవర్థనుడు కుంటు పడిపోవు ముందు తన పాపకార్యము నంగీకరించి యుండెను. ఇందులో రామేశ్వర గోకులదాసులు పట్టుబడరి సభ్యులు. ఇంతకును నేరస్థులు ముగ్గురు దుర్మరణము నందుటచే నీ యెదుట ఋజువు చేయుట సంభవము కాదు. ఇది జరిగిన సంగతి. నమ్ముటయు నమ్మకపోవుటయు నీ యిష్టముపై నాధారపడి యున్నది.

సోమే:—మల్హారరాయా! బుద్ధిబలమున మేమందరము నీ యెదుట బాలకులమే. నీ వింత తీవ్రవిమర్శన మొనర్చి తేల్చిన నిశ్చితార్థమును నమ్మకపోవుట కేవల మసంభవము. నేరస్థుని నిరూపించుటలో మేము పొరబడితి మని యంగీకరించు చుంటిని. ఆ కూర్చున్న భువనేశ్వరుడే భవానీప్రసాదు యొక్క కుమారుడు. ఇతని సోదరి ఇందుమతి యను బాలిక రెండేండ్ల పసిబిడ్డయై యుండ దొంగిలింపబడినది. ఆ దొంగతనము చేసినది గోవర్థను డని యనుమానించి యీ బిడ్డ జాడల నరయుటకై యితడు నన్ను నియమించెను. పరిశోధింపగా అను

పానమునకు తగిన నిదర్శనము కూడ కోరకెను. ఈ గోవర్థనున కొక ప్రియురాలు కలదు. ఆమె యొక దొంగతనము చేయుటచే భవానీప్రసాదు ద్వారా జైలునకు పంపబడి కారాగృహములోనే మరణించెను. అందులకుగాను కసి తీర్చుకొన దలంచి యీ రెండేండ్ల బిడ్డను అపహరించెను. ఆ రెండేండ్ల బాలిక పేరు పులింద. ఈ సందర్భములను విమర్శించుచు పులిందను జూడ కోరి ప్రాంతమునకు రాగా నీవు కూడ నా యింటిలో నామె కొరకే వెదకుచుంటివి. నేనా నాడు నా పని మీదనే వచ్చితిని గాని, నీవు వ్యతిరేకముగ దలంచితివి.

మల్హా:—ఆ గోవర్థనుని పేరిప్పుడు మదిలో తేలి యుండ జూచితిని.

సోమే:—అట్లయిన మీ కార్యభారము మిగిలినదే యున్నది.

మల్హా:—దైవానుగ్రహము వలన సంతియు తీరినది.

అని చెప్పు నప్పుడు ఈలవైచెను మరుచువా, బంధితులై యున్న యిద్దరు పురుషులను గొనివచ్చెను. వారిలో నొకరి పేరు శింభూసింహుడు. రెండవవాడు మదనజీ.

మధుసూ:—మల్హారరావుగారూ! నీ కింకను మదనజీయే కాలూరాయి యని అనుమానమా?

మల్హా:—కాదు. ఆ సంగతి తరువాత చెప్పెదను. ప్రస్తుత మితడు షట్చక్రిదళ నాయకుడు. షట్చక్రిదళమును నడుపు వారిద్దరు. మదనజీ శింభూసింహులు మీ కెదురుగనే యున్నారు. రామేశ్వర గోకులదాసులు మరణించిరి. ఇంక నిద్దరున్నారు. వారిని బంధింప నా భటులను బంపి యుంటిని.

సోమే:—అసలు కథానాయకుడైన కాళూరాయని బంధించుట మిగిలి పోలేదు ?

మల్హా:—అదియు మిగులలేదు. ఆ కార్యము కూడ నిప్పుడే పూర్తి యగుచున్నది.

అనుచు లేచి చేతుల నుండి సంకెలలను దీసి మధుసూదన రావు చేతులకు దొడిగెను. "మధుసూదనరావుగారూ! కాళూరాయుడు అను మారుపేరు పెట్టుకొనిన మిమ్ము గవర్నమెంటువారి అనుమతిని బంధించు చుంటిని."

మధు:—అసత్యము. మల్హారరావు! పొరబడి నన్నవమానించు చుంటివి. నీ బుద్ధి భ్రమించినది.

మల్హా:—మధుసూదనరావుగారూ! నే నేమియు పొరబడలేదు. నీ విప్పుడ మును నీవుగా నంగీకరించుట నీ కిష్టము లేకున్న నేనే చెప్పెదను వినుము. నాకు నీ యం దనుమానము కల్గినది. [illegible] పురము నుండి భువనేశ్వరునితో శివనివాసము వచ్చినప్పుడు దరిద్ర వేషమున నీ బండిలో జేరిన ముసలివాడను నేనే. నీ మాటలు వినగనే నా కనుమానము బలమయ్యెను. ఏలయన మరియొక పురుషుడు అనగా మదనుడు కాళూరాయని వేషము ధరించి బంధింపనిక వచ్చినప్పుడు నీ ముఖకళ యెట్లు మారినదో గ్రహించితిని. అందువలన నా సందేహము ప్రబల మయ్యెను. తరువాత రహస్యముగ నీ పెట్టెలను పరిశీలింపగా నీవు ధరించు నల్లని ముసుగు కాన్పించినది. ధనపు పెట్టెకై గోవర్ధనునితో నీవు పోరాడు చుండ నీ ముఖమున గల ముసుగు తొలగినది. అప్పుడు నిన్ను నేను బాగుగ గుర్తించితిని. తత్సమయమున నీవు లక్ష యేబదివేల రూపాయ

లను దొంగిలించి నట్లు అంగీకరించి యుంటివి. నీవు నదిలో నుండి లేచి వేషమును మార్చుకొని గ్రామము లోనికి వచ్చునప్పుడు పూర్తిగ తెలిసికొంటిని. ఇంకను నే గొనర్చినది పొరపాటం దువా? ప్రథమమున నా ధనమును పంపుమని మా తండ్రి యైన గోపాలరావు వ్రాసినప్పుడే నీకు దురాశ గల్గినది. అటు పిమ్మట మదనజీకి సూపాయలను కాజేయువలయు నను తలంపు కలిగినను సాగనీయక నీవు మారు వేషమున కాలూ రాయి అను పేరుతో ధనము నపహరించి అడవిలో నొక చోట దాచి తర్వాత తీసికొందమని తలంచితివి. కాని మధ్య సైంధవుని వలె గోవర్థనుడు వచ్చి మీ కిర్వురకు గాకుండ తాను కాజేసెను. ఎట్లైన నేమి? న్యాయమైన ద్రవ్యము కనుక నా తండ్రిసొత్తు నాకు చేరినది. నీ దుర్బుద్ధియే నిన్ను దుర్గతికి దెచ్చినది. నీవు కాలూరాయి వేషమును ధరించుటచే నీవు నల్వురు కాలూరాయలను సిద్ధము చేసితివి?

మధుసూదన బాబూ! చాలునా! ఇంకను చెప్పమందువా?

మధు—అంతయు వెల్లడి యైనది. మల్హారరావూ! నీవు చెప్పిన దంతయు యథార్థమే. నేను ధనాపేక్షచే మీ తండ్రి భాగము కూడ నపహరింపదలచి ధనమును రు 1,50,000 లను దొంగి లించి, మీ కనుమానము కలుగకుండుటకై దాని నొకచో దాచి వెంటనే బండిమీద తెల్లవారు నప్పటికి పూనా వచ్చితిని. తుదకు చేసిన పాపమునకు ఫలితము లభించినది.

మల్హారరావు తరువాత నేమియు ప్రశ్నింపలేదు. దొరకిన ధనముతో సహా బంధితుల నందఱను వెంటగొని పునహా చేరెను. అపరాధుల కందఱకు న్యాయచట్ట ప్రకారము శిక్ష విధింపబడెను.

పులింద అను ఇందుమతిని మల్హారరావును, తారను కుబేర సింహుడును వివాహమాడిరి. మల్హారరావీ విధముగ తన ప్రతిజ్ఞను నెఱవేర్చుకొని సర్కారువారి ఉద్యోగము నుండి సెలవు దీసుకొని తన జీవితమును సుఖముగ వెళ్లించుచుండెను.

పాఠక సోదరులారా! ఇది గ్రం

థ 1,50,000 ల సంగతి.

శ్రీ శ్రీ శ్రీ.

The Orient Power Press, Tenali,